సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+12 వెల: ₹ 5.00

సంపుటి: 12
సంచిక: 355

సోమవారం 16-3-2020

'రాష్ట్రాన్ని దేశానికే అన్నం పెట్టే అన్నపూర్ణగా తీర్చిదిద్దాలనేది నా స్వప్నం'

అత్యవసర నిధి ఏర్పాటు చేద్దాం

కోవిడ్‌పై పోరు కోసం సార్క్ దేశాలకు ప్రధాని మోదీ పిలుపు – 13లో

18న మారటోరియం ఎత్తివేత

నెలాఖరుకు కొత్త బోర్డు ఏర్పాటు.. 'యస్' సీఈవో, ఎండీగా ప్రశాంత్ – బిజినెస్‌లో

SIMULTANEOUSLY PRINTED AT NALGONDA | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

ఏపీ న్యూస్..

ఈసీ మాట.. వైరస్

1

కరోనా వైరస్ కారణంగా రాష్ట్రంలో స్థానిక ఎన్నికలను ఆరువారాల పాటు నిలిపివేస్తున్నట్లు ఎన్నికల కమిషనర్ రమేష్ కుమార్ ప్రకటించారు. ఆరువారాల తర్వాత రాష్ట్రంలో సాధారణ పరిస్థితులు నెలకొన్న తదనంతరం ఎన్నికల ప్రక్రియ పునః ప్రారంభమౌతుందని ఆయన తెలిపారు. అత్యున్నత స్థాయి అధికారులతో సంప్రదింపులు జరిపి పరిస్థితులను మదింపుచేసి ఉద్యోగుల మనోభావాలను పరిగణనలోకి తీసుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. అప్పటి వరకు ఎన్నికల కోడ్ కొనసాగుతుందని ఆయన అన్నారు.

రాజ్యాంగం అపహాస్యం

"కరోనా వైరస్‌ను సాకుగా చూపుతూ స్థానిక ఎన్నికలను ఎన్నికల కమిషనర్ ఆరు వారాల పాటు వాయిదా వేశారు. ఓ వైపు ఎన్నికలను వాయిదా వేస్తూనే పలువురు అధికారులను బదిలీ చేశారు. నిరు పేదలకు ఇళ్లపట్టాలిచ్చే కార్యక్రమాన్ని ముందే ఆపేశారు. ఇది ఆరువారాలతో ఆగుతుందా.. ఇంకా సంతృప్తి చెందలేదనే కారణంతో ఎన్నికల కోడ్‌ను అడ్డంపెట్టుకుని ఈసీ అధికారాన్ని చెలాయించే అవకాశం ఉందని విమర్శకులంటున్నారు..ఆరువారాలే కాక ఎన్నిరోజులైనా దానిని కొనసాగించే ప్రమాదం ఉందని ప్రజాస్వామికవాదులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రజలు ఎన్నుకున్న ప్రజా ప్రభుత్వంతో కనీసం సంప్రదించకుండా ఎవరో చెప్పింది చేస్తున్నట్లు.. ఎవరో రాసిచ్చింది చదువుతున్నట్లు... ఎన్నికల కమిషనర్ వ్యవహరించడం రాజ్యాంగాన్ని అపహాస్యం పాల్జేసిందని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి."

సీఎం ధర్మాగ్రహం

2

కరోనా వైరస్‌ను సాకుగా చూపుతూ ఎన్నికలు వాయిదా వేయడం ధర్మమేనా? అని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రశ్నించారు. ఎన్నికల కమిషనర్ రమేశ్ కుమార్ నిష్పాక్షికతతో పాటు విచక్షణ కూడా కోల్పోయారని విలేకరుల సమావేశంలో విమర్శించారు. ''ఎన్నికలు పూర్తయి స్థానిక సంస్థల ప్రతినిధులంతా బాధ్యతలు చేపడితే కరోనా వంటి వైరస్‌లను తరిమికొట్టడం మరింత సులువవుతుంది.. ప్రజారంజక పాలనతో అధికార పార్టీ మంచి విజయాలను సాధిస్తున్నందునే వ్యవస్థలను నీరుగార్చి చంద్రబాబు ఎన్నికలను అడ్డుకుంటున్నారు.. ఈసీ తీరుపై గవర్నర్‌కు ఫిర్యాదు చేశాం. నిర్ణయాన్ని పునః సమీక్షించుకోకపోతే ఈ అంశాన్ని ఇంకా పైకి తీసుకువెళతాం''అని పేర్కొన్నారు.

ఈసీ.. మారిన వాయిస్

3

ఎన్నికల వాయిదాపై గవర్నర్‌కు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఫిర్యాదుచేయడం, విలేకరుల సమావేశం పెట్టి అనేక ప్రశ్నలు సంధించడంతో సాయంత్రం కల్లా ఎన్నికల కమిషనర్ రమేష్ కుమార్ మాట మార్చారు. కరోనా వైరస్ సాకుగా చూపడం సరే.. ఆ విషయమై రాష్ట్ర ఆరోగ్య శాఖ కార్యదర్శితోగానీ, సీఎస్‌తో గానీ సంప్రదించారా.. పాటించాల్సిన ప్రొసీజర్స్ ఏమైనా పాటించారా అని ముఖ్యమంత్రి అడిగేసరికి.. సాయంత్రానికి ఒక నోట్ రిలీజ్ చేశారు.. కేంద్ర ఆరోగ్యశాఖ అధికారులతో మాట్లాడినట్లు అందులో పేర్కొన్నారు. కరోనా వైరస్ అనేది ఓ సాకు మాత్రమేనని దీనిని బట్టి అర్థమౌతోందని విశ్లేషకులు వ్యాఖ్యానిస్తున్నారు.

'సుప్రీం' వైపు సర్కార్

4

తొమ్మిది నెలల సంక్షేమ పాలన చూసి ప్రజలంతా జగన్‌మోహన్‌రెడ్డికి బ్రహ్మరథం పడుతున్నారని, స్థానిక సంస్థల ఎన్నికలలో ఏకగ్రీవాల సంఖ్య చూస్తే ఈ విషయం స్పష్టంగా అర్థమౌతుందని వైఎస్సార్‌సీపీ నాయకులంటున్నారు. ఇది చూసి ఓర్వలేకే తమ సామాజిక వర్గానికి చెందిన నిమ్మగడ్డ రమేష్ కుమార్‌ను ఉపయోగించుకుని ఎన్నికలు వాయిదా వేయించారని వారు పేర్కొంటున్నారు. ఈసీ నిర్ణయంపై తాము సుప్రీంకోర్టును ఆశ్రయిస్తామని వైఎస్సార్‌సీపీ ప్రధానకార్యదర్శి వి.విజయసాయిరెడ్డి వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా ఇందుకు సంబంధించిన ప్రక్రియను ప్రారంభించిందని తెలుస్తోంది.

- వివరాలు 4లో

మరో కోవిడ్ పాజిటివ్

గాంధీ ఆస్పత్రిలోని కోవిడ్ హెల్ప్‌డెస్క్ వద్ద వేచి చూస్తున్న కరోనా అనుమానితుడు

- నెదర్లాండ్ నుంచి రాష్ట్రానికి వచ్చిన వ్యక్తికి కరోనా ఉన్నట్లు గుర్తింపు
- నిర్ధారించిన పుణే ల్యాబ్
- రెండింటిలో ఒకటి నెగెటివ్
- వివరాలు వెల్లడించిన కేంద్రం
- మొత్తంగా రాష్ట్రంలో నమోదైన పాజిటివ్ కేసులు 3
- చనిపోయిన వ్యక్తిలో కోవిడ్ ఉండదని వైద్యుల వెల్లడి

107 దేశంలో కోవిడ్ కేసులు | **31** మహారాష్ట్రలో నమోదైన కేసులు.. | **22** కేరళలో నమోదైన కేసులు..

సాక్షి, హైదరాబాద్

రాష్ట్రంలో మరో కోవిడ్ పాజిటివ్ కేసు నమోదైంది. నెదర్లాండ్ నుంచి వచ్చిన వ్యక్తికి కోవిడ్ పాజిటివ్‌గా గుర్తించారు. ఆ వ్యక్తి రంగారెడ్డి జిల్లా పరిధిలోని కొత్తపేట వాసవి కాలనీకి చెందినవారు. ఇప్పటికే ఆయనతో 12 మంది అతి సన్నిహితంగా మెలిగినట్లు గుర్తించడంతో స్థానికుల్లో ఆందోళన నెలకొంది. ప్రస్తుతం ఆయన గాంధీ ఆస్పత్రి ఐసోలేషన్ వార్డులో చికిత్స పొందుతున్నారు. బాధితుడు కుటుంబసభ్యులు ఎంత మంది.. ఎక్కడెక్కడ.. ఎంత మందితో తిరిగాడు.. ఏయే ప్రాంతాలు సందర్శించాడు? లక్షణాలు బయట పడ్డాక చికిత్స కోసం స్థానికంగా ఏ ఆస్పత్రుల్లో చూపించాడు.. వంటి అంశాలను గుర్తించే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. ఇటలీ నుంచి వచ్చిన ఓ వైద్య విద్యార్థినికి ఇప్పటికే కరోనా పాజిటివ్ రాగా, ఆమె గాంధీలో చికిత్స పొందుతున్న సంగతి తెలిసిందే. సౌదీ నుంచి వచ్చిన యువతి నమూనాల్లో కరోనా నెగెటివ్ వచ్చింది. కోవిడ్ నిర్ధారణ కోసం ఇటీవల పుణేకు పంపిన రెండు కేసుల్లో ఒకటి నెగెటివ్ కాగా, రెండోది పాజిటివ్ వచ్చింది. కోవిడ్ సోకి కోలుకున్న వ్యక్తి సహా ఇప్పటివరకు రాష్ట్రంలో కోవిడ్ పాజిటివ్ కేసుల సంఖ్య మూడుకు చేరింది. కాగా, మంచిర్యాల జిల్లా నస్పూర్ మండలానికి చెందిన ఓ విద్యార్థికి కోవిడ్ సోకిందన్న అనుమానంతో శనివారం మిగతా 2వ పేజీలో ▶

యూరప్ అతలాకుతలం

కరోనా వైరస్ ఐరోపా దేశాలకు విస్తరించి అతలాకుతలం చేస్తోంది. ఇన్నాళ్లూ ఇటలీలో విజృంభించిన ఈ మహమ్మారి, ఇప్పుడు స్పెయిన్‌లో రాత్రికి రాత్రి ఉధృతమై పోయింది. ఒకే రోజు ఏకంగా 2,000 కేసులు నమోదయ్యాయి. మొత్తం కేసులు 8 వేలకి చేరువలో ఉంటే.. 288 మంది ప్రాణాలు కోల్పోవడంతో ఆరోగ్య అత్యవసర పరిస్థితి విధించారు. ప్రపంచ వ్యాప్తంగా 1,59,844 కరోనా కేసులు నమోదుకాగా, మృతుల సంఖ్య 6,034కు చేరుకుంది.

- వివరాలు 13లో

ఇష్టారాజ్యం..

- హైరిస్క్ దేశం నుంచి వస్తే ఐసోలేషన్‌లో ఉంచాలన్న నిబంధనను ఉల్లంఘిస్తున్న ఎయిర్‌పోర్టు అధికారులు

ఐటీ.. ఇక ఇంటి నుంచే డ్యూటీ..

పలు ఐటీ కంపెనీల నిర్ణయం

100కి డయల్ కరోనా

- వివరాలు 2లో

'బల నిరూపణ' ఉంటుందా?

- నేటి నుంచి మధ్యప్రదేశ్‌లో అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు
- తొలిరోజే విశ్వాస పరీక్ష జరగాలన్న గవర్నర్
- నిర్ణయం సభలో ప్రకటిస్తానన్న స్పీకర్

- 13లో

NECC NATIONAL EGG CO-ORDINATION COMMITTEE
Vencobb CHICKEN
సూచించిన నేటి గుడ్డు & చికెన్ హైదరాబాద్ టోకు ధరలు

గుడ్డు రిటైల్ ధర ₹ 38 డజన్	ఫారం దగ్గర లైవ్ బర్డ్	20 కిలో	డ్రస్డ్ స్కిన్‌తో	61 కిలో
	రిటైల్ లైవ్ బర్డ్	42 కిలో	స్కిన్‌లెస్	69 కిలో

Consumers Apply
వినియోగదారుల శ్రేయస్సు దృష్ట్యా జారీచేయడమైనది



గోల్కొండ కోటపై కాషాయ జెండా

ఎగరవేయడమే లక్ష్యంగా పనిచేస్తా: బండి సంజయ్

బండి సంజయ్‌ను అభినందిస్తున్న లక్ష్మణ్

- టీఆర్ఎస్ ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటాలు
- రాష్ట్ర అధ్యక్షుడిగా నియమితులు అయ్యాక తొలిసారి హైదరాబాద్‌కు
- బీజేపీ శ్రేణుల ఘనస్వాగతం

సాక్షి, హైదరాబాద్: 'నేను ఇంట్లో కూర్చోను. ప్రజల్లోనే ఉంటా. తెలంగాణలో బీజేపీని అధికారంలోకి తీసుకురావడమే లక్ష్యంగా పనిచేస్తా. టీఆర్ఎస్, కేసీఆర్ ప్రజావ్యతిరేక విధానాలపై పోరాటం చేస్తా. శివాజీ వారసులుగా మేం వస్తాం. ఔరంగజేబు వారసులుగా ఎంఐఎం, టీఆర్ఎస్ వస్తోంది. విజయమో వీరస్వర్గమో తేల్చుకుంటా' అని రాష్ట్ర బీజేపీ నూతన అధ్యక్షుడు బండి సంజయ్ స్పష్టం చేశారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా మిగతా 4వ పేజీలో ▶

4 రోజులు ముందుగానే...

నేటితో ముగియనున్న అసెంబ్లీ సమావేశాలు

- పౌరసత్వ సవరణ చట్టానికి వ్యతిరేకంగా ఉభయ సభల్లో తీర్మానం
- ద్రవ్య వినిమయ బిల్లు అనంతరం వాయిదా పడనున్న అసెంబ్లీ
- స్పీకర్ పోచారం సమక్షంలో అసెంబ్లీ ఫ్లోర్ లీడర్ల భేటీ.. కుదింపుపై నిర్ణయం

సాక్షి, హైదరాబాద్: ఈ నెల 6న ప్రారంభమైన అసెంబ్లీ వార్షిక బడ్జెట్ సమావేశాలు సోమవారం ముగియనున్నాయి. కోవిడ్‌పై ప్రభుత్వ కఠిన నిర్ణయాల నేపథ్యంలో ఈ నెల 20 వరకు జరగాల్సిన అసెంబ్లీ సమావేశాలు నాలుగు రోజుల ముందుగానే ముగుస్తున్నాయి. అసెంబ్లీ సమావేశాల కుదింపునకు సంబంధించి ఆదివారం సాయంత్రం స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి చాంబర్‌లో శాసనసభ ఫ్లోర్ లీడర్ల సమావేశం జరిగింది. మంత్రులు వేముల ప్రశాంత్ రెడ్డి, హరీశ్‌రావు, ఎంఐఎం, కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్లు ఈ భేటీలో పాల్గొన్నారు. కోవిడ్‌పై ప్రభుత్వ నిర్ణయాల నేపథ్యంలో అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు కుదించాలని నిర్ణయం తీసుకున్నారు. దీంతో శాసనసభ, మండలి రెండూ సోమవారం ఉదయం 11 గంటలకు వేర్వేరుగా సమావేశమవుతాయి. చివరి రోజు సమావేశంలో అత్యంత కీలకమైన పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ) బిల్లును ప్రవేశపెడతారు. దీనిపై చర్చించిన తర్వాత తీర్మానం చేస్తారు. ఆ తర్వాత ద్రవ్య వినిమయ బిల్లును శాసనసభలో ప్రవేశపెడతారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇతర బిల్లులతో పాటు, సీఏఏ వ్యతిరేక తీర్మానం, ద్రవ్య వినిమయ బిల్లు ఆమోదం తరువాత శాసనసభను నిరవధికంగా వాయిదా వేస్తారు. అనంతరం మండలి కూడా సీఏఏ వ్యతిరేక తీర్మానం, ద్రవ్య వినిమయ బిల్లును ఆమోదించిన తర్వాత వాయిదా పడనుంది.

పద్దులపై చర్చ...

అసెంబ్లీ సమావేశ తేదీల కుదింపు నేపథ్యంలో ఆదివారం బడ్జెట్ పద్దులపై చర్చ జరిగింది. వివిధ ప్రభుత్వ శాఖలకు సంబంధించిన 25 పద్దులపై పలు పార్టీలకు చెందిన 23 మంది సభ్యులు ప్రసంగించారు. ఆదివారం ఉదయం 11గంటలకు పద్దులపై మొదలైన చర్చ రాత్రి పొద్దుపోయే వరకు సాగింది. సభ్యులు లేవనెత్తిన ప్రశ్నలకు సంబంధిత శాఖల మంత్రుల సమాధానాలు చెప్పారు.



జాగరూకతతో జయిద్దాం

100కి డయల్ కరోనా!

సాక్షి, హైదరాబాద్

విపత్తులు, ఆపదల సమయంలో వెంటనే స్పందించే డయల్ 100 ఇప్పుడు మరో బాధ్యతను భుజాలకెత్తుకుంది. ఫైర్, రోడ్డు, అగ్నిప్రమాద ఘటనలతోపాటు ప్రపంచాన్ని వణికిస్తోన్న కరోనా విపత్తు నుంచి ప్రజలను కాపాడేందుకు తమ వంతుగా ముందు కొచ్చింది. రాష్ట్ర ప్రజల్లో కోవిడ్ వైరస్ లక్షణాలు కనిపిస్తే.. వెంటనే తమ ఎమర్జెన్సీ నంబరు డయల్ 100 ద్వారా గానీ, హాక్ఐ ద్వారా గానీ తమకు సమాచారం అందజేయవచ్చని సూచించారు. అలాంటి కాల్స్‌ను రిసీవ్ చేసుకున్న డయల్ 100 కంట్రోల్ రూం వారు వెంటనే ఆ సమాచారాన్ని వైద్యారోగ్యశాఖకు బదిలీ చేస్తారని, వారు వచ్చి వెంటనే వైద్యసాయం అందజేస్తారని భరోసా ఇస్తోంది.

పోలీసుల వద్ద విదేశీయుల జాబితా

కోవిడ్ కేసు వెలుగుచూసిన దరిమిలా.. రాష్ట్రంలో వైద్యారోగ్యశాఖ అప్రమత్తమైంది. ఎయిర్‌పోర్టులో థర్మల్ స్క్రీనింగ్ సెంటర్లు ఏర్పాటు చేసి అనుమానితులను ఐసోలేషన్ వార్డులకు తరలిస్తోంది. చైనా, హాంకాంగ్,

- కోవిడ్ అనుమానితుల సమాచారమూ అందించవచ్చు
- హాక్ ఐ ద్వారా కూడా తెలిపేందుకు అవకాశం
- విదేశాల నుంచి వచ్చినవారు దాదాపు 750 మంది
- వైద్య శాఖకు వివరాలు బదిలీ చేసిన హోంశాఖ..

సింగపూర్, ఇరాన్, థాయ్‌లాండ్, సౌత్ కొరియా, జపాన్, ఇండోనేసియా, మలేసియా, నేపాల్, వియత్నాం, ఇటలీ, ఫ్రాన్స్, జర్మనీ, స్పెయిన్ దేశాల నుంచి ఇంతవరకూ తెలంగాణకు 750 మంది రాష్ట్ర పౌరులు వచ్చారు. వీరందరి చిరునామాలు పోలీసుల వద్ద ఉన్నాయి. వీటిని ఇటీవల వైద్యారోగ్యశాఖకు అందజేసింది. వారు ఏయే పోలీసుస్టేషన్ పరిధిలోకి వస్తారో కూడా అందులో పేర్కొంది. ఈ వివరాల ఆధారంగా వైద్యారోగ్యశాఖ విదేశాల నుంచి వచ్చిన వారి ఆరోగ్య పరిస్థితి తెలుసుకునేందుకు వారిని సంప్రదించే యత్నాల్లో ఉంది.

వదంతులపై చర్యలు.. అవగాహన షురూ!

కోవిడ్‌పై అప్రమత్తంగా ఉండాలని పోలీసు శాఖ కూడా విజ్ఞప్తి చేసింది. ముఖ్యంగా సోషల్‌మీడియా ద్వారా వదంతులు వ్యాప్తి చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకుం టామని డీజీపీ కార్యాలయ అధికారులు హెచ్చ రించారు. అలాంటి వదంతులు పుట్టించే వారిపై చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి కూడా హోంశాఖను ఆదేశించిన సంగతి తెలిసిందే. సైబరాబాద్, వరంగల్ కమిషనరేట్, కరోనాపై అవగాహన కార్యక్రమాలు ప్రారంభించారు. తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పబ్లిక్ అనౌన్స్‌మెంట్ల ద్వారా అవగాహన కల్పిస్తున్నారు.

ఇష్టారాజ్యం

అతని పేరు ఆకాశ్ (పేరు మార్చాం). శనివారం జర్మనీ నుంచి వచ్చాడు. హైదరాబాద్ విమానాశ్రయంలో దిగాడు. అక్కడి కేంద్ర వైద్య అధికారులు థర్మల్ స్క్రీనింగ్ చేసి వదిలేశారు. అతడి గురించి రాష్ట్ర వైద్యాధికారులకు సమాచారం కూడా ఇవ్వలేదు. తనకు జాగ్రత్తలు కానీ, ప్రత్యేకంగా ఐసోలేషన్‌లో ఉండాలని కానీ అక్కడ ఎవరూ చెప్పలేదని అతను అంటున్నాడు. దర్జాగా హైదరాబాద్‌లో తిరుగుతున్నాడు.

పూర్వ ఖమ్మం జిల్లాకు చెందిన లోకేష్ (పేరు మార్చాం) 3 రోజుల క్రితం అమెరికా నుంచి హైదరాబాద్ వచ్చాడు. విమానాశ్రయంలో అతడికి ఎటువంటి జాగ్రత్తలు చెప్పలేదు. సరికదా అతను ఎక్కడికి వెళ్తున్నాడు, ఏం చేయబోతున్నాడు కూడా తెలుసుకోలేదు. అతను పెళ్లి చేసుకునేందుకు ఇక్కడకు వచ్చాడన్న విషయం కూడా అధికారులకు తెలియదు. ఆదివారం పెళ్లి జరిగింది. అతను అమెరికా నుంచి వచ్చాడని తెలిసి చాలా మంది పెళ్లికి కూడా వెళ్లలేదు.

- హైరిస్క్ దేశం నుంచి వస్తే ఐసోలేషన్‌లో ఉంచాలన్న నిబంధన ఎయిర్‌పోర్ట్‌లో ఉల్లంఘన

సాక్షి, హైదరాబాద్: ఇలా వివిధ దేశాల నుంచి వచ్చే వారికి కోవిడ్ అనుమానిత లక్షణాలు ఉన్నాయా? లేదా? అనేది సంబంధం లేకుండా హోం ఐసోలేషన్‌లో ఉంచాలి. జర్మనీ సహా ఏడు దేశాల నుంచి ఎవరు వచ్చినా సరే సర్కారు ఆధ్వర్యంలో ఐసోలేషన్ చేయాలని తెలంగాణ వైద్యాధికారులు నిర్ణయించారు. అది ఈ నెల 13 నుంచి అమల్లోకి వచ్చింది. అమెరికా సహా ప్రపంచంలోని ఏ దేశం నుంచి వచ్చినా, వారిని కూడా 14 రోజులు హోం ఐసోలేషన్ చేయాలని గతంలోనే నిర్ణయించారు. పైన పేర్కొన్న ఇద్దరు వ్యక్తులు ఒకరు జర్మనీ నుంచి, మరొకరు అమెరికా నుంచి వచ్చారు. కానీ ఈ ఇద్దరికీ హోం ఐసోలేషన్‌లో ఉండాలని కానీ, ఎలాంటి జాగ్రత్తలు కానీ చెప్పకపోవడంపై విమర్శలు వస్తున్నాయి. హైదరాబాద్ రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయ అధికారులు తెలంగాణ వైద్యాధికారులకు కొందరు ప్రయాణికుల విషయంలో సరైన సమాచారం ఇవ్వడం లేదన్న విమర్శలు వస్తున్నాయి. ఒక్కోసారి విదేశీ ప్రయాణికుల జాబితా తీసుకోవడం కూడా కష్టంగా మారుతుందని రాష్ట్ర వైద్యాధికారులు అంటున్నారు.

తెలంగాణ ప్రభుత్వం, వైద్య, ఆరోగ్య శాఖ కోవిడ్ వైరస్‌పై యుద్ధం ప్రకటిస్తే, విమానాశ్రయ అధికారుల్లో కొందరు తేలిగ్గా తీసుకుంటున్నారని అంటున్నారు. ఆ ఏడు దేశాలు హైరిస్క్‌లో ఉన్నందున, 60 ఏళ్లు దాటిన వారికి లక్షణాలు లేకపోయినా తప్పకుండా సర్కారు ఆధ్వర్యంలో కోరంటైన్ చేయాలని, ఆ లోపు వారికి లక్షణాలు లేకపోతే హోం ఐసోలేషన్‌లో ఉంచాలన్నది కేంద్రం నిబంధన. ఈ నిబంధనను మార్చాలని, ఆ ఏడు దేశాల నుంచి వచ్చేవారెవరైనా సరే తమ ఆధ్వర్యంలోనే కోరంటైన్‌లో ఉంచుతామని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ అధికారులు కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖకు తాజాగా లేఖ రాశారు. అయినా ప్రస్తుతం ఉన్న నిబంధనలను కూడా తుంగలో తొక్కడం వల్ల ఆ 2 దేశాలకు చెందినవారు హోం ఐసోలేషన్‌లో కూడా లేకుండా బయట ఉన్నారు. ఇలా విదేశాల నుంచి, రిస్క్ ఉన్న దేశాల నుంచి ఎందరు రాష్ట్రంలోకి సమాచారం లేకుండా ప్రవేశిస్తున్నారన్న దానిపై ఆందోళన వ్యక్తమవుతోంది. ఇదే జరిగితే ముమ్ముందు పరిస్థితిని నియంత్రించలేమన్న భయాందోళనలు కూడా వైద్యాధికారుల్లో నెలకొన్నాయి.

'స్క్రీనింగ్ టెస్ట్ లేకుండా అస్సలు పంపొద్దు'

సాక్షి, హైదరాబాద్: విమాన ప్రయాణం అనంతరం ఎయిర్‌పోర్టుకు చేరుకున్న ప్రయాణికులకు తప్పకుండా స్క్రీనింగ్ టెస్ట్ చేయాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి ఈటల రాజేందర్ స్పష్టం చేశారు. ఎయిర్‌పోర్టును దిగ్బంధం చేయాలని, ఒక్కరిని కూడా స్క్రీనింగ్ టెస్ట్ లేకుండా బయటకు పంపొద్దని ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ రమేశ్‌రెడ్డి, డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ శ్రీనివాస్‌రావులను ఆదేశించారు. ఆదివారం అసెంబ్లీ సమావేశాల మధ్యలో మంత్రి వారితో ఫోన్‌లో మాట్లాడారు. పాజిటివ్ వ్యక్తులను కలిసిన వారందరికీ రాపిడ్ యాక్షన్ టీమ్‌లతో పరీక్షలు చేయించాలన్నారు.

హైదరాబాద్ ఫీవర్ ఆస్పత్రిలోని ఐసోలేషన్ వార్డులో పనిచేస్తున్న వైద్య సిబ్బంది, రోగులు వాడిన దుస్తులను తగలబెడుతున్న దృశ్యం

మరో కోవిడ్ పాజిటివ్

▶ మొదటి పేజీ తరువాయి

అతడి నమూనాలు గాంధీకి పంపి పరీక్షలు చేయగా.. నెగెటివ్ వచ్చింది. అలాగే హన్మకొండకు చెందిన మరో వ్యక్తి 20 రోజుల కిందట అమెరికా నుంచి వచ్చాడు. దగ్గు, జలుబు, జ్వరం ఉండటంతో చికిత్స కోసం వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి వచ్చాడు. అతడిని ఐసోలేషన్ వార్డుకు తరలించి చికిత్స అందిస్తున్నారు. నమూనాలను హైదరాబాద్‌లోని గాంధీకి కోవిడ్ పరీక్షల కోసం పంపారు. ఇంకో వ్యక్తి కూడా కోవిడ్ అనుమానిత లక్షణాలతో ఎంజీఎంకు వచ్చిన ఓ వ్యక్తి చెప్పకుండానే వెళ్లిపోయాడు. దీంతో అతడి ఆచూకీ కోసం వెతుకుతున్నారు. అటు దేశంలో కోవిడ్ కేసుల సంఖ్య పెరుగుతోంది. కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ ఆదివారం రాత్రి ప్రకటించిన లెక్కల ప్రకారం దేశంలో 107 పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. అత్యధికంగా మహారాష్ట్రలో 31 నమోదు కాగా, కేరళలో 22 కేసులు నమోదయ్యాయి.

దేశంలో ప్లాన్-బీ అమలు..

ప్రస్తుతం దేశంలో కోవిడ్ వైరస్ నియంత్రణకు ప్లాన్-బీ నడుస్తోందని కేంద్రం ప్రకటించింది. ఇప్పటివరకు విమానాశ్రయాల్లో జల్లెడ పట్టి గుర్తించామని, అందులో పాజిటివ్ వచ్చిన వ్యక్తులకు నయం చేశామని అంటున్నారు. ప్లాన్-బీలో భాగంగానే అనేక రాష్ట్రాలు పాఠశాలలు, కాలేజీలు, థియేటర్లను మూసేశారని తెలిపారు. ప్లాన్-బీతో కూడా కోవిడ్ నియంత్రణలోకి రాకపోతే, ప్లాన్-సీ కూడా అమలు కానుందని అంటున్నారు. ప్లాన్-సీ అంటే ఒకరకంగా పూర్తిస్థాయి కర్ఫ్యూ వాతావరణమే నెలకొంటుంది. ఇళ్ల నుంచే పనిచేయాల్సి ఉంటుంది. వీధుల్లో మనుషులు తిరిగే పరిస్థితి ఉండదు. వైద్యాధికారులు మాత్రమే ముసుగులు ధరించి విధులు నిర్వహిస్తారు. ఇతర అన్ని కార్యకలాపాలు బంద్ అవుతాయి. వైరస్ రూపం మార్చుకొని ఈ ఉష్ణోగ్రతలోనూ తన ఉనికిని కాపాడుకోగలిగితే సీ ప్లాన్ అమలు చేయకతప్పని పరిస్థితి ఉంటుందన్న చర్చ కూడా సాగుతోంది.

ఇతర రాష్ట్రాల సహకారం..

కొందరు విదేశాల నుంచి నేరుగా రావట్లేదు. ఢిల్లీ, ముంబై లాంటి చోట్ల విమానాలు దిగి, అక్కడి నుంచి రైళ్లు, బస్సుల ద్వారా రాష్ట్రానికి వస్తున్నారు. దీంతో వారిని కనిపెట్టడం కష్టమవుతోంది. అందుకే ఇతర రాష్ట్రాల సహకారాన్ని రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటోంది. ప్రస్తుతం ఎక్కడ విమానం, ఓడ దిగినా వారి వివరాలన్నింటినీ స్థానిక ప్రభుత్వ అధికారులు నమోదు చేయాలని నిర్ణయించారు. దాన్ని ఇతర రాష్ట్రాలకు షేర్ చేయనున్నారు. దాని ఆధారంగా తెలంగాణకు చెందిన వ్యక్తులు ఎక్కడ దిగినా ఆ సమాచారాన్ని రాష్ట్ర ప్రభుత్వం సేకరిస్తోంది. గత నెల రోజులుగా విదేశాల్లో ఏ దేశంలో ప్రయాణించారనేది పాస్‌పోర్టు ఆధారంగా గుర్తిస్తున్నారు. కోవిడ్ తీవ్ర ప్రభావిత దేశంలో ప్రయాణించి వస్తే వారిని ఇక్కడ గుర్తించి ఐసోలేషన్ చేస్తారు. కొందరు విదేశాల నుంచి వచ్చిన వారు ఐసోలేషన్‌కు ఒప్పుకోవట్లేదు. ముప్పుతిప్పలు పెడుతున్నారు. ఈ విషయాన్ని వైద్య ఆరోగ్య శాఖ అధికారులు పోలీసు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో పోలీసులు రంగంలోకి దిగారు.

3 కేటగిరీలుగా విభజన..

కోవిడ్ తీవ్ర ప్రభావం ఉన్న 7 దేశాల నుంచి వచ్చే ప్రయాణికులను ఐసోలేషన్ చేయాలని సర్కారు ఇప్పటికే నిర్ణయం తీసుకుంది. చైనా, ఇటలీ, దక్షిణ కొరియా, ఇరాన్, ఫ్రాన్స్, జర్మనీ, స్పెయిన్ నుంచి వచ్చే విమాన ప్రయాణికులను 14 రోజుల పాటు వికారాబాద్‌లోని హరిత రిసార్టులో ఉంచుతారు. వీరిని 3 కేటగిరీలుగా విభజిస్తారు. కేటగిరీ 'ఏ'ను హైరిస్క్‌గా గుర్తిస్తారు. ఇందులో జ్వరం, దగ్గు, శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులున్న వారిని ఇతర ప్రయాణికుల నుంచి వేరుపరచి నేరుగా ఆస్పత్రికి తరలిస్తారు. బీ-కేటగిరిలో మాధ్యమిక రిస్కు కింద పరిగణిస్తారు. 60 సంవత్సరాలు పైబడి ఉన్న వారిని ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఐసోలేషన్‌కు తరలిస్తారు. రోజూ వారిని వైద్యులు పరిశీలిస్తారు. సీ కేటగిరిలో తక్కువ రిస్క్ ఉన్నవారు ఉంటారు. ఎటువంటి లక్షణాలు లేనివారు. వీరందర్నీ హోం ఐసోలేషన్‌లోనే ఉంచాలని నిర్ణయించారు. అయితే ఈ ఏడు దేశాల నుంచి వచ్చే వారెవరైనా లక్షణాలు లేకున్నా తమ ఆధ్వర్యంలోనే ఐసోలేషన్ చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి తెలిపింది.

ఖననంపై మార్గదర్శకాలు..

కోవిడ్‌తో మరణించిన వారి మృతదేహాల ఖననంపై కేంద్రం మార్గదర్శకాలు విడుదల చేయనుంది. మన దేశంలో రెండు మరణాలు చోటు చేసుకోవడంతో, ముమ్ముందు వాటి సంఖ్య పెరిగే అవకాశముందన్న అభిప్రాయంతో కేంద్రం మృతదేహాల ఖననాలకు సంబంధించి మార్గదర్శకాలను విడుదల చేస్తుందని వైద్యాధికారులు చెబుతున్నారు. కాగా, కోవిడ్‌తో చనిపోతే వైరస్ ఆ వ్యక్తిలో ఉండదని అధికారులు చెబుతున్నారు. అయినా.. అందుకు సంబంధించిన ప్రొటోకాల్ ఎలా ఉండాలనే దానిపై కేంద్రం మార్గదర్శకాలు జారీ చేయనుంది. కోవిడ్‌తో ఎవరైనా చనిపోతే 15 మందికి మించి అంత్యక్రియల్లో పాల్గొనకూడదని కేరళ ఇప్పటికే మార్గదర్శకాలు ఇచ్చినట్లు ఓ వైద్యాధికారి తెలిపారు.

తప్పుడు ప్రచారాలు చేస్తే కేసులు: సజ్జనార్

శంషాబాద్: కోవిడ్ వైరస్‌పై తప్పుడు వార్తలు ప్రచారం చేస్తే జాతీయ విపత్తుల నిర్వహణ చట్టం కింద కేసు నమోదు చేస్తామని సైబరాబాద్ సీపీ సజ్జనార్ స్పష్టంచేశారు. కొందరు సామాజిక మాధ్యమాల ద్వారా తప్పుడు ప్రచారాలు చేస్తున్నారన్నారు. ప్రజలు దుష్ప్రచారాలను నమ్మవద్దని సూచించారు. ఆదివారం శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌లోని కోవిడ్ థర్మల్ స్క్రీనింగ్ కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఆయా దేశాల నుంచి వచ్చే ప్రయాణికులకు ఏవిధంగా థర్మల్ స్క్రీనింగ్ చేపడుతున్నారు తదితర అంశాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు.

ఐటీ.. ఇక ఇంటి నుంచే డ్యూటీ!

- గూగుల్, మైక్రోసాఫ్ట్ సహా పలు బహుళజాతి ఐటీ కంపెనీల నిర్ణయం
- అధిక ఉష్ణోగ్రత, ఫ్లూతో బాధపడుతున్న ఉద్యోగులు ఇంటికే పరిమితం
- పలు చిన్న, మధ్యతరహా కంపెనీలు మాత్రం వర్క్ ఫ్రం హోంకు 'నో'

సాక్షి, హైదరాబాద్: కోవిడ్-19 నేపథ్యంలో హైదరాబాద్‌లో గూగుల్, క్వాల్‌కామ్, మైక్రోసాఫ్ట్ సహా 20 వరకు బహుళజాతి ఐటీ కంపెనీలు సోమవారం నుంచి తమ ఉద్యోగులను వర్క్‌ఫ్రం హోంకు అనుమతించనున్నాయి. దాదాపు 600 ఐటీ, బీపీఓ, కేపీఓ కంపెనీలకు నిలయమైన నగరంలోని మాదాపూర్, గచ్చిబౌలి, కొండాపూర్, మైండ్‌స్పేస్ ప్రాంతాల్లో 6 లక్షల మంది పనిచేస్తున్న విషయం తెలిసిందే. ఉద్యోగులను సోమవారం నుంచి తలపై థర్మామీటరుతో శరీర ఉష్ణోగ్రత తనిఖీ చేసిన తరవాతే కంపెనీలలోకి అనుమతిస్తామని, అధిక జ్వరం, ఫ్లూ లక్షణాలతో బాధపడుతున్న ఉద్యోగులను తాత్కాలికంగా ఇంటికి పంపించాలని నిర్ణయించినట్టు హైదరాబాద్ సాఫ్ట్‌వేర్ ఎంటర్‌ప్రైజెస్ అసోసియేషన్ (హైసియా) వర్గాలు 'సాక్షి'కి తెలిపాయి. కాగా, నగరంలోని మరో 400 వరకు ఉన్న చిన్న, మధ్యతరహా ఐటీ కంపెనీలు మాత్రం వర్క్ ఫ్రం హోంకు 'నో' చెప్పాయి. ఉద్యోగులకు వ్యక్తిగతంగా ల్యాప్‌టాప్‌లు, ఇంటర్నెట్ సదుపాయం కల్పించడం కష్టం కావడం, కీలక సమావేశాలకు ఉద్యోగులను దూరంగా ఉంచితే సంస్థల రోజువారీ కార్యకలాపాలు, వ్యాపార విస్తరణ ప్రాజెక్టుల మనుగడ ప్రశ్నార్థకమవుతుందన్న అంచనాతో ఉద్యోగులు విధిగా కార్యాలయాలకు హాజరుకావాలని స్పష్టం చేసినట్లు హైసియా అధ్యక్షుడు మురళి 'సాక్షి'కి తెలిపారు.

అన్ని కంపెనీలకు స్టాండర్డ్ ప్రొటోకాల్

కోవిడ్ నేపథ్యంలో కంపెనీలు, ఉద్యోగులు తీసుకోవాల్సిన చర్యలపై స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొటోకాల్ (ఎస్ఓపీ) రూపొందించి అన్ని కంపెనీలకు అందజేసినట్టు మురళి తెలిపారు. ఇందులో వైరస్ వ్యాప్తి చెందకుండా తీసుకోవాల్సిన సూచనలు, సమన్వయ కమిటీల ఏర్పాటు, అత్యవసర సమయాల్లో ఎవరికి ఫోన్ చేయాలి, ఉద్యోగులను ఏ ఆస్పత్రులకు తరలించాలనే వివరాలు పొందుపరిచామన్నారు. విదేశాలకు వెళ్లొచ్చిన ఉద్యోగులు కొన్నిరోజుల పాటు ఎలా ఐసోలేట్ కావాలో ఇందులో సూచించామన్నారు.

పర్మిట్ రూంలూ బంద్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని మద్యం దుకాణాల మూసివేతపై రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రంలోని అన్ని బార్లు, క్లబ్బులు, టూరిజం క్లబ్బులతో పాటు వైన్‌షాపుల పర్మిట్ రూంలను ఈనెల 21వరకు మూసివేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్‌కుమార్ ఆదివారం ఉత్తర్వులు జారీచేశారు.

31వరకు విద్యా సంస్థలకు సెలవు

విద్యా సంస్థలకు 31వరకు సెలవులు ఇస్తూ విద్యా శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి చిత్రా రాంచంద్రన్ ఆదివారం ఉత్తర్వులిచ్చారు. ఇందులో పాఠశాలలు, జూనియర్, డిగ్రీ కాలేజీలు, వర్సిటీలు, ఇంజనీరింగ్, వృత్తి విద్యా కాలేజీలన్నీ 31వరకు బంద్ చేయాల్సిందిగా పేర్కొన్నారు.

తెలుగు తల్లి ఫ్లైఓవర్

షట్‌డౌన్

రాజధానిలోని ఐమాక్స్‌లో 'బొమ్మ' పడలేదు. జలవిహార్, ఎన్టీఆర్ గార్డెన్, లుంబినీ పార్కుల్లో పిల్లాపాపల సందడి లేదు. అటు రాష్ట్రవ్యాప్తంగా దాదాపుగా అదే పరిస్థితి.. పార్కుల్లో విహారాల్లేవు.. రోడ్లు వెలవెల.. నాన్ వెజ్ అమ్మకాలు డల్.. సందే వచ్చిందంటే సందడిగా కనిపించే ఊరు.. ఈ ఆదివారం గడప దాటలేదు. 'కోవిడ్' నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన ప్రత్యేక మార్గదర్శకాలతో.. ప్రజలు జాగ్రత్తలు తీసుకున్నట్టే కనిపించింది. పనుంటే తప్ప ఇళ్ల నుంచి బయటకి రాలేదు. దీంతో నిత్యం రద్దీగా కనిపించే ప్రాంతాలన్నీ దాదాపు నిర్మానుష్యంగా మారాయి.

సూర్యాపేటలో ఓ సినిమా థియేటర్

నెహ్రూ జూ పార్క్

పెళ్లిసైనా కోవిడ్ ఎఫెక్ట్

షాదీ 'ఆన్‌లైన్' కరోనా

ఖమ్మం అర్బన్: కరోనా దెబ్బకు ఖమ్మంలో వరుడితో వధువుకు ఆన్‌లైన్‌లో వివాహం జరిపించారు. విమాన ప్రయాణాలపై ఆంక్షలు ఉండటంతో సౌదీలో ఉంటున్న వరుడు ఇక్కడికి రాలేకపోయాడు. దీంతో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా గుండాలకు చెందిన అమ్మాయికి ఆదివారం మత పెద్దలు ఆన్‌లైన్ ద్వారా సౌదీలో ఉన్న వరుడితో వివాహాన్ని జరిపించారు.

epaper.sakshi.com

ధర్మపురిలో వైభవంగా రథోత్సవం

జగిత్యాల జిల్లా ధర్మపురిలో ఆదివారం సాయంత్రం స్వామివార్ల రథోత్సవం వైభవంగా నిర్వహించారు. లక్ష్మీనృసింహుని బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈ వేడుకలు నిర్వహించారు. శ్రీలక్ష్మీనృసింహ స్వాములతోపాటు వేంకటేశ్వర, పార్వతీపరమేశ్వరుల ఉత్సవ మూర్తులను రథాలపై ఆసీనులు చేసి ప్రత్యేక పూజలు జరిపారు. గోవింద నామస్మరణతో భక్తులు రథాలను లాగారు. ఎస్పీ సింధూశర్మ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. – ధర్మపురి

బో'నమో' మల్లన్న

జగిత్యాల జిల్లా మెట్‌పల్లి మండలంలోని పెద్దాపూర్‌లో ఆదివారం మల్లికార్జునస్వామి బోనాల జాతర వైభవంగా జరిగింది. ఈ ఉత్సవాలకు జగిత్యాల, కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్ జిల్లాల నుంచే కాకుండా మహారాష్ట్ర నుంచి కూడా పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. వేలాది మంది భక్తులు ఒకేసారి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసిన తర్వాత మల్లన్నకు మొక్కులు చెల్లించుకున్నారు. జాతర సందర్భంగా పోతరాజుల విన్యాసాలు, శివసత్తుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. – మెట్‌పల్లి

మాస్క్‌లు ధరించి దర్శనానికి..

యాదగిరిగుట్ట: కరోనా (కోవిడ్–19) వైరస్ విజృంభిస్తున్న నేపథ్యంలో ఆదివారం యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి దర్శనానికి భక్తులు మాస్క్‌లు ధరించి వచ్చారు. గుట్టపై వైరస్ వ్యాపించకుండా దేవస్థానం అధికారులు ముందస్తు జాగ్రత్తలు చేపట్టారు. భక్తులకు అవగాహన కల్పించేందుకు కొండపై నిత్యం మైక్‌లో ప్రచారం చేస్తున్నారు. క్యూలైన్లలో డెటాల్ స్ప్రే చేయడంతో పాటు చేతులు శుభ్రం చేసుకోవడానికి డెటాల్ లిక్విడ్‌ను అందుబాటులో ఉంచారు. ఎప్పటికప్పుడు ఆలయ పరిసరాలను శుభ్రం చేస్తున్నారు.

భక్తుల రద్దీ..

యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఆదివారం భక్తుల రద్దీ నెలకొంది. సుమారు 20 వేల మంది భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. వివిధ పూజల ద్వారా స్వామి వారికి రూ.16,96,904 ఆదాయం సమకూరిందని ఆలయ అధికారులు తెలిపారు.

కొండగట్టులో మాస్క్‌లతో అర్చకుల పూజలు

కొండగట్టు(చొప్పదండి): కరోనా వైరస్ వ్యాపించకుండా ముందు జాగ్రత్తగా జగిత్యాల జిల్లా కొండగట్టు అంజన్న ఆలయంలో ఆదివారం అర్చకులు ఇలా మాస్క్‌లు ధరించి పూజలు చేశారు. పలువురు భక్తులు కూడా మాస్కులతో ఆలయానికి వచ్చారు.

రాతి గుహలో కలెక్టర్ అజీమ్ దంపతులు

పాండవుల గుట్టపై కలెక్టర్ ట్రెక్కింగ్

టేకుమట్ల(రేగొండ): జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండలంలోని పాండవుల గుట్ట ఒక అద్భుతమని కలెక్టర్ మహ్మద్ అబ్దుల్ అజీమ్ అన్నారు. ఆదివారం ఉదయం కలెక్టర్ దంపతులు పాండవుల గుట్టపై పర్యటించారు. రాక్ క్లైంబింగ్, ట్రెక్కింగ్ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం తొండంగుండు వద్దకు చేరుకుని వివిధ రకాల శిలాకృతులను తిలకించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పాండవుల గుట్ట అభివృద్ధికి కృషి చేస్తానని చెప్పారు. అనంతరం బుగులోని వేంకటేశ్వరస్వామి ఆలయానికి చేరుకుని స్వామివారిని దర్శించుకున్నారు. ఈ క్షేత్రాన్ని మినీ తిరుపతిగా అభివృద్ధి చేస్తానని జాతర చైర్మన్ కట్ల మధుసూదన్‌రెడ్డికి కలెక్టర్ హామీ ఇచ్చారు.

ఆర్డీఎస్‌లో నిలిచిన నీటి ప్రవాహం

శాంతినగర్ (అలంపూర్): గద్వాల జిల్లాలోని ఆర్డీఎస్ ప్రధాన కాల్వలో రెండు రోజులుగా నీటిప్రవాహం నిలిచిపోయింది. ఎగువన కర్ణాటకలోని హెడ్‌వర్క్స్ నుంచి విడుదలవుతున్న నీరు డి–22 వరకు వచ్చే వరకు నిలిచిపోవడంతో వడ్డేపల్లి శివారులోని తనగల డి–23 వరకు నీరందడంలేదు. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. తెలంగాణ నీటి వాటాగా మూడోసారి 2,500 క్యూసెక్కులకు నీటిపారుదల శాఖ అధికారులు ఇండెంట్ పెట్టారు. తుంగభద్ర డ్యాం నుంచి విడుదలైన నీరు ఆర్డీఎస్ హెడ్‌వర్క్స్‌కు చేరుకున్నాయి. ఆదివారం నీటిమట్టం 6 అడుగులు ఉన్నట్లు ఆర్డీఎస్ ఏఈఈ వరుణ్‌కుమార్ తెలిపారు. ఇప్పటికే హెడ్‌వర్క్స్ వద్ద ఓవర్ ఫ్లో ఉండాలి. అయితే నదీతీర ప్రాంతాల్లోని ఎత్తిపోతల పథకాలు, మడుగులు, మోటార్ల ద్వారా నీటిని వాడుతుండటంతో తుంగభద్ర నదిలో నీరు ముందుకు సాగడం లేదు. ఎగువన ఉన్న కర్ణాటక, తెలంగాణ సరిహద్దులోని నాన్ ఆయకట్టు పొలాలకు అక్రమంగా ఆర్డీఎస్ నీటిని తరలిస్తుండటం వల్లే దిగువన ఉన్న డిస్ట్రిబ్యులరీలకు నీరందడం లేదని రైతులు వాపోతున్నారు. హెడ్‌వర్క్స్ వద్ద పూర్తిస్థాయిలో నీటిని విడుదల చేసినా నీటిని అక్రమంగా వాడుకోవడంతో సింధనూర్ సరిహద్దు వచ్చే వరకు ప్రధాన కాల్వలో 3 అడుగులకు నీటి ప్రవాహం పడిపోతోంది.

కేసీకి ఇండెంట్ పెడితేనే

ఆంధ్రప్రదేశ్ వాటాగా టీబీ డ్యాంలో కేసీ కెనాల్‌కు ఇండెంట్ పెడితే తప్ప తుమ్మిళ్ల ఎత్తిపోతల పథకం మోటార్‌ను ప్రారంభించే అవకాశంలేదు. కేసీ కెనాల్‌కు ఇండెంట్ పెడితే తుమ్మిళ్ల మీదుగా సుంకేసుల బ్యారేజీకి నీరు చేరుకుంటుంది. గతంలో కేసీ కెనాల్, ఆర్డీఎస్ కెనాల్‌కు ఇండెంట్ పెట్టడంతో నీరు పూర్తిస్థాయిలో నదిలో చేరి 15 రోజుల వరకు ఆర్డీఎస్ కెనాల్‌కు నీరందడంతో పంటలకు నీటి తడులు ఇచ్చేవారు. తుంగభద్ర నదిలో పూర్తిస్థాయిలో నీరున్న సమయంలో తప్ప ఆర్డీఎస్ ఆయకట్టుకు నీరందే పరిస్థితి లేదు. రెండో దశలో భాగంగా రిజర్వాయర్లు నిర్మిస్తే తప్ప ఆర్డీఎస్‌కు న్యాయం జరిగే అవకాశం లేదని రైతులు చెబుతున్నారు.

అభయారణ్యాల్లోనూ తునికాకు సేకరణ

ఆకు సేకరణపై నిషేధం తాత్కాలికంగా ఎత్తివేత

- టెండర్ల ప్రక్రియ పూర్తి
- కూలీలకు ఉపాధి.. అటవీ శాఖకు అదనపు ఆదాయం

కిన్నెరసాని అభయారణ్యంలో తునికాకు సేకరిస్తున్న కూలి(ఫైల్)

పాల్వంచరూరల్: అభయారణ్యాల్లో తునికాకు సేకరణను నిషేధిస్తూ గత ఏడాది నిర్ణయం తీసుకున్న కేంద్ర ప్రభుత్వం ఈ సంవత్సరం ఆ నిషేధాన్ని తాత్కాలికంగా ఎత్తివేసింది. దీంతో రాష్ట్రంలోని అభయారణ్యాల్లో ఉన్న 39 యూనిట్లలో తునికాకు సేకరణకు అటవీశాఖ అనుమతి ఇచ్చింది. ఇటీవల హైదరాబాద్‌లో అటవీ అభివృద్ధి కార్పొరేషన్ ఆధ్వర్యంలో టెండర్ల ప్రక్రియను కూడా పూర్తి చేశారు. ఆయా యూనిట్లలో ఆకు సేకరణ కాంట్రాక్టు దక్కించుకున్న కాంట్రాక్టర్లు త్వరలో ప్రూనింగ్ పనులు చేపట్టనున్నారు. దీంతో కూలీలకు ఉపాధితో పాటు అటవీ శాఖకు కూడా గణనీయమైన ఆదాయం సమకూరనుంది. ప్రస్తుతం భద్రాద్రి జిల్లాలోని ఐదు డివిజన్లలో మాత్రమే తునికాకు సేకరణకు అనుమతి ఉండగా, తాజాగా కిన్నెరసాని అభయారణ్యంలోనూ ఆకును సేకరించనున్నారు.

గిరిజనులకు వేసవి పంట..

రాష్ట్రంలో ప్రతి సంవత్సరం మార్చి నుంచి మేనెల వరకు తునికాకును సేకరిస్తారు. భద్రాద్రి జిల్లాలో అత్యధిక సంఖ్యలో గిరిజనులు ఆకు సేకరణ పనులకు వెళ్తారు. 50 ఆకుల కట్టకు కూలీ కింద రూ.1.55 పైసల చొప్పున చెల్లిస్తారు. ఇలా ఒక్కొక్కరు రోజుకు రూ.500 వరకు సంపాదిస్తారు. అయితే అభయారణ్య ప్రాంతాల్లో స్వేచ్ఛగా సంచరించే జంతువుల ఉనికికి ప్రమాదకరంగా మారుతుందనే ఉద్దేశంతో కేంద్రం 2019లో తునికి ఆకు సేకరణపై నిషేధం విధించింది. అయితే అధిక ఆదాయం లభించే అవకాశం ఉండడంతో గిరిజన, కార్మిక సంఘాలు ఈ నిర్ణయంపై ఆందోళనకు దిగాయి. దీంతో అటవీ శాఖాధికారులు స్పందించి సమస్యను కేంద్రం దృష్టికి తీసుకెళ్లడంతో అభయారణ్యాల్లోనూ తునికాకు సేకరణకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. ఈ నిర్ణయంతో గిరిజన కూలీలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వానికి ఏటా రూ.19 కోట్ల ఆదాయం..

రాష్ట్రంలోని ఆరు వైల్డ్‌లైఫ్ అటవీ ప్రాంతాల్లో ప్రతి సంవత్సరం 38,800 స్టాండర్డ్ బ్యాగ్‌ల తునికాకు సేకరిస్తారు. దీని వల్ల ప్రభుత్వానికి రూ.19 కోట్లకు పైగా ఆదాయం సమకూరుతుంది. భద్రాద్రి జిల్లాలోని కిన్నెరసాని అభయారణ్యంలో ప్రతి సంవత్సరం 5,050 స్టాండర్డ్ బ్యాగులు, మహబూబాబాద్ జిల్లా గూడూరు (పాకాల) అభయారణ్యంలో 20,400 బ్యాగులు, భూపాలపల్లి జిల్లా ఏటూరునాగారం (టైగర్) అభయారణ్యంలో 10,100 బ్యాగులు, మంచిర్యాల టైగర్ సర్కిల్‌లో 1,600 స్టాండర్డ్ బ్యాగులు, ఆదిలాబాద్ జిల్లా కవ్వాల్ అభయారణ్యంలో 2,350 స్టాండర్డ్ బ్యాగుల తునికాకు సేకరణ జరుగుతుంది.

తాత్కాలికంగా సడలించారు

తునికాకు సేకరణ కారణంగా ప్రతి సంవత్సరం పచ్చని అటవీ ప్రాంతం కాలిపోతోంది. అడవిలో సంచరించే వన్యప్రాణులు కూడా మృత్యువాత పడుతున్నాయి. అందుకే కేంద్ర ప్రభుత్వం అభయారణ్యంలో గత ఏడాది తునికాకు సేకరణను నిషేధించింది. అయితే ఈ సంవత్సరం నిషేధాన్ని తాత్కాలికంగా ఎత్తివేసింది.

– కె.దామోదర్‌రెడ్డి, పాల్వంచ వన్యమృగాల సంరక్షణ విభాగం ఎఫ్‌డీఓ

గాడితప్పిన 'ఫేర్‌వెల్'

సిరిసిల్ల ఎడ్యుకేషన్: పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పి.. వారిని పరీక్షలకు సన్నద్ధం చేసి ముందుకు తీసుకెళ్లాల్సిన ఉపాధ్యాయుల తీరు గాడితప్పింది. ఫేర్‌వెల్ పార్టీ పేరిట ఒక్కో విద్యార్థి నుంచి రూ.500 వసూలు చేసి ఇష్టారాజ్యంగా పదోతరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించిన అంశం రాజన్న సిరిసిల్ల జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. వివరాలు ఇలా ఉన్నాయి.. వీర్నపల్లి మండలంలోని ఆదర్శపాఠశాలలో శనివారం రాత్రి పదోతరగతి విద్యార్థులకు 9వ తరగతి విద్యార్థులు వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. అయితే ఉపాధ్యాయులు పాఠశాలలోని 9వ తరగతి విద్యార్థుల నుంచి రూ.500 చొప్పున రూ.50 వేలవరకు వసూలు చేసి ఫేర్‌వెల్ పార్టీ నిర్వహించినట్లు ఆలస్యంగా తెలిసింది. అర్ధరాత్రి వరకు పాటలతో హంగామా చేసిన ఉపాధ్యాయులు, విద్యార్థులపై తీవ్ర విమర్శలు వినిపిస్తున్నాయి. విద్యార్థులకు ఇచ్చిన కూల్‌డ్రింక్స్‌లో మద్యం కలిపినట్లు ఆరోపణలు వచ్చాయి. ఇదే విషయాన్ని వీర్నపల్లి మండల విద్యాధికారి మంకు రాజయ్యను వివరణ కోరగా.. ఫేర్‌వెల్ పార్టీ పేరిట విద్యార్థుల నుంచి అధిక మొత్తంలో నగదు వసూలు చేసిన విషయం తన దృష్టికి వచ్చిందని దీనిపై నివేదికను ఉన్నతాధికారులకు సమర్పించి తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. కాగా, జిల్లా విద్యాధికారి రాధాకిషన్ మాట్లాడుతూ.. వీర్నపల్లి పాఠశాలలో జరిగిన పార్టీపై తమకు సమాచారం అందిందని, బాధ్యులపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు.

ఛత్తీస్‌గఢ్‌లో ఎదురు కాల్పులు

తప్పించుకున్న మావోయిస్టులు

చర్ల: ఛత్తీస్‌గఢ్‌లోని సుకుమా జిల్లాలో ఆదివారం మావోయిస్టులు, పోలీసులకు మధ్య ఎదురు కాల్పులు చోటుచేసుకున్నాయి. సుకుమా జిల్లా ఎస్పీ షలబ్ సిన్హా కథనం ప్రకారం.. కిష్టారం పోలీస్ స్టేషన్ పరిధిలోని అమ్మపెంట అటవీ ప్రాంతంలో మావోయిస్టులు సంచరిస్తున్నారనే సమాచారం మేరకు డీఆర్‌జీ, ఎస్టీఎఫ్, కోబ్రా బలగాలు కూంబింగ్ చేపట్టాయి. ఈ క్రమంలో తారసపడిన మావోయిస్టులు పోలీసులపైకి కాల్పులకు దిగగా పోలీసు బలగాలు సైతం ఎదురుకాల్పులు జరిపాయి. సుమారు 45 నిమిషాల పాటు మావోయిస్టులకు, పోలీసులకు మధ్య హోరా హోరీగా కాల్పులు జరిగాయి. ఆ తరువాత మావోయిస్టులు తప్పించుకొని పారిపోయారు. అనంతరం ఆ ప్రాంతంలో పోలీసులు గాలించగా విప్లవ సాహిత్యం, ఎల్క్ట్రిక్ వైర్, డిటోనేటర్లు, పేలుడు పదార్థాలు లభించాయి.

నేత కార్మికుని బలవన్మరణం

సిరిసిల్ల టౌన్: చేసిన అప్పు తీర్చలేని దైన్యస్థితిలో నేత కార్మికుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఆదివారం రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. సిరిసిల్ల శాంతి నగర్‌కు చెందిన గడ్డం కిరణ్ (38) నేత కార్మికుడిగా పనిచేస్తున్నాడు. భార్య తేజశ్విని వంట పనులు చేస్తూ భర్తకు ఆసరాగా ఉంటోంది. వీరికి ముగ్గురు పిల్లలు ఆకాశ్ (17), సాయి (11), ఈశ్వర్(7). ఇద్దరూ పనిచేసినా కుటుంబ పోషణకు తగినంత డబ్బులు రాకపోవడంతో అవసరాల కోసం చేసిన అప్పులు రూ.2 లక్షల వరకు చేరాయి. దీంతో మానసికంగా కుంగిపోయిన కిరణ్ శనివారం రాత్రి డ్యూటీకి వెళ్లొస్తానని ఇంట్లో చెప్పి బయటకు వెళ్లిపోయాడు. ఆదివారం ఉదయం శాంతినగర్ శివారులోని ఓ చెట్టుకు ఉరివేసుకుని శవమై కనిపించాడు. స్థానికుల సమాచారంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.



ఎన్నికలు వాయిదా

ఏపీ స్థానిక ఎన్నికలు 6 వారాలు వాయిదా వేసిన ఎన్నికల సంఘం

నా విచక్షణాధికారాలతో వాయిదా వేస్తున్నా!

ఏపీ ఎన్నికల కమిషనర్ నిమ్మగడ్డ రమేష్‌కుమార్ ప్రకటన

మీడియా సమావేశంలో మాట్లాడుతున్న నిమ్మగడ్డ. చిత్రంలో ఐజీ సత్యనారాయణ

సాక్షి, అమరావతి: రాజ్యాంగం, పంచాయతీరాజ్ చట్టం ద్వారా తనకు సంక్రమించిన విస్తృత, విచక్షణాధికారాల మేరకు నామినేషన్ల ప్రక్రియ కూడా పూర్తయిన ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలతోపాటు మున్సిపల్ ఎన్నికలను 6 వారాలపాటు నిలుపుదల (వాయిదా) చేస్తున్నట్టు ఏపీ ఎన్నికల కమిషనర్ నిమ్మగడ్డ రమేష్‌కుమార్ ప్రకటించారు. కరోనా వైరస్ కారణంగానే ఈ నిర్ణయం తీసుకున్నట్టు చెప్పారు. ఆయన ఆదివారం రాష్ట్ర ఎన్నికల కమిషనర్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికల వాయిదాపై పుస్తకంలో రాసుకొచ్చిన సమాచారాన్ని ఈ సందర్భంగా చదివి వినిపించారు. ఎన్నికల వాయిదా నోటిఫికేషన్‌పై సంతకం చేస్తున్నట్టు ప్రకటించారు. నిమ్మగడ్డ రమేష్‌కుమార్ ఇంకా ఏం చెప్పారంటే...

- ఇది కేవలం నిలిపివేత మాత్రమే.. ఎన్నికల రద్దు కాదు. ఆరు వారాల తర్వాత, రాష్ట్రంలో సాధారణ పరిస్థితులు నెలకొన్న తర్వాత.. నిలిచిపోయిన ఎన్నికల ప్రక్రియ పున:ప్రారంభం అవుతుంది. ఇప్పటిదాకా జరిగిన ప్రక్రియ రద్దు కాదు.
- ఇప్పటికే ఏకగ్రీవంగా ఎన్నికైనవారు కొనసాగుతారు. ఎన్నికలు పూర్తి కాగానే మిగిలిన సభ్యులతోపాటు వీరు కూడా బాధ్యతలు చేపడతారు. వారికి ఎలాంటి నష్టం వాటిల్లదు. ఆరు వారాల తర్వాత సమీక్ష అనంతరం వాయిదా పడిన ఎన్నికల కార్యక్రమాన్ని ప్రారంభిస్తాం.

అత్యున్నత స్థాయి సంప్రదింపుల తర్వాతే...

ఎన్నికలను ఆరు వారాల పాటు నిలిపివేయడం అనేది అత్యున్నత స్థాయి సంప్రదింపులు జరిపి, పరిస్థితులను మదింపు చేసి, ప్రభుత్వ ఉద్యోగుల మనోభావాలను సైతం గుర్తిస్తూ ఎన్నికల సంఘం తీసుకున్న నిర్ణయం. ప్రస్తుతం నెలకొన్న అనివార్య పరిస్థితులకు అనుగుణంగా తీసుకున్న నిర్ణయం ఇది. సాధారణ పరిస్థితులు నెలకొన్న తర్వాత ఎన్నికల ప్రక్రియను పున:ప్రారంభించాలని ఎన్నికల కమిషన్ భావిస్తోంది.

జాతీయ స్థాయి అధికారులతో మాట్లాడా..

సాయంత్రానికి మాట మార్చిన ఏపీ ఎన్నికల కమిషనర్ రమేష్‌కుమార్

సాక్షి, అమరావతి: కరోనా వైరస్ విస్తరణ గురించి ఆరోగ్య శాఖ అధికారులతో మాట్లాడిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలను వాయిదా వేయాలని నిర్ణయం తీసుకున్నట్లు ఏపీ ఎన్నికల కమిషనర్ నిమ్మగడ్డ రమేష్‌కుమార్ ఆదివారం ఉదయం ప్రకటించారు. ఈ మేరకు నోటిఫికేషన్ జారీ చేశారు. ఆరోగ్య శాఖ అధికారులతో మాట్లాడినట్లు రెండో పేరాలో స్పష్టంగా పేర్కొన్నారు. సీఎం వైఎస్ జగన్ విలేకరులతో మాట్లాడుతూ.. వైద్య, ఆరోగ్య శాఖ అధికారులతో మాట్లాడకుండానే ఎన్నికల వాయిదా నిర్ణయాన్ని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ ఎలా తీసుకుంటారని ప్రశ్నించారు. సీనియర్ హెల్త్ ఫంక్షనరీస్‌తో మాట్లాడినట్లు 'ఎన్నికల వాయిదా నోటిఫికేషన్'లో పేర్కొన్న అంశాన్ని సీఎం ప్రస్తావిస్తూ.. వైద్య–ఆరోగ్య శాఖ కార్యదర్శి కంటే సీనియర్ ఎవరు ఉంటారని నిలదీశారు. సీఎంతో పాటు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీలం సాహ్ని, వైద్య–ఆరోగ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి ఉన్నారు. సీఎం ప్రశ్నకు కంగుతిన్న ఎన్నికల కమిషనర్ మాట మార్చారు. సాయంత్రానికి మరో ప్రెస్‌నోట్ విడుదల చేశారు. అందులో.. జాతీయ స్థాయి హెల్త్ ఫంక్షనరీస్‌తో మాట్లాడినట్లు పేర్కొన్నారు. జాతీయ స్థాయి హెల్త్ ఫంక్షనరీస్ అని రాశారే తప్ప.. వారి హోదా/పేర్లు ఏమిటనే విషయాన్ని సాయంత్రం ప్రెస్‌నోట్‌లో పేర్కొనకపోవడం గమనార్హం.

ఇది ధర్మమేనా?

ఎన్నికల కమిషనర్ నిష్పాక్షికతే కాదు విచక్షణ కూడా కోల్పోయారు: ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్

సాక్షి, అమరావతి: ఏపీ ఎన్నికల కమిషనర్ నిమ్మగడ్డ రమేశ్ కుమార్ నిష్పాక్షికతతోపాటు విచక్షణ కూడా కోల్పోయారని ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విమర్శించారు. కరోనా వైరస్‌ను సాకుగా చూపిస్తూ స్థానిక సంస్థల ఎన్నికలను వాయిదా వేయడం పట్ల తీవ్ర అభ్యంతరం తెలిపారు. కరోనా వైరస్‌పై కనీసం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, ఆరోగ్యశాఖ కార్యదర్శులను సంప్రదించకుండానే ఎన్నికల కమిషనర్ ఎన్నికలను ఎలా వాయిదా వేస్తారని నిలదీశారు. ఎన్నికల కమిషనర్ ఒకవైపు ఎన్నికలను వాయిదా వేస్తూనే మరోవైపు గుంటూరు, చిత్తూరు జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, కొందరు అధికారులను ఎలా బదిలీ చేస్తారని సూటిగా ప్రశ్నించారు. పేదలకు ఇళ్ల పట్టాలివ్వకుండా అడ్డుకోవడం సబబేనా? అని ఆక్షేపించారు. ప్రజలు 151 సీట్లతో గెలిపించిన ముఖ్యమంత్రిది అధికారమా? లేక ఎన్నికల కమిషనర్‌దా? అని ప్రశ్నించారు. టీడీపీ హయాంలో చంద్రబాబు తన సామాజిక వర్గానికి చెందిన అధికారిని ఎన్నికల కమిషనర్‌గా నియమించుకుని ప్రస్తుతం వ్యవస్థలను దిగజారుస్తున్నారని మండిపడ్డారు. ముఖ్యమంత్రి జగన్ ఆదివారం తాడేపల్లిలోని తన క్యాంపు కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో కరోనా వైరస్ నియంత్రణకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని, దీనిపై బెంబేలెత్తాల్సిన అవసరం లేదని ప్రజలకు భరోసా ఇచ్చారు.

> స్థానిక ఎన్నికలను షెడ్యూల్ ప్రకారం నిర్వహిస్తే కరోనాను నియంత్రించడం సులభం

ఫలితాలు ఏకపక్షమనే అక్కసుతోనే..

ఎన్నికల మేనిఫెస్టోను పూర్తిగా అమలు చేస్తూ ప్రజారంజకంగా పాలిస్తున్న వైఎస్సార్ సీపీ స్థానిక సంస్థల ఎన్నికల్లో ఏకపక్షంగా ఫలితాలు సాధిస్తోందనే దుగ్ధతోనే చంద్రబాబు ఎన్నికలను అడ్డుకుంటున్నారని ముఖ్యమంత్రి జగన్ ధ్వజమెత్తారు. చంద్రబాబు, ఆయన అనుకూల మీడియా రాక్షస క్రీడకు పాల్పడుతున్నారని విమర్శించారు. ఎన్నికల కమిషనర్ తీరుపై గవర్నర్‌కు ఫిర్యాదు చేశామన్నారు. ఆయన ఇప్పటికైనా తన నిర్ణయాన్ని పునఃసమీక్షించుకుని ఎన్నికలు జరిపించాలని లేదంటే ఈ విషయాన్ని పైస్థాయికి తీసుకువెళతామని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా సీఎం ఇంకా ఏమన్నారంటే...

వ్యవస్థలను దిగజారుస్తున్న బాబు

ఇలాంటి పరిస్థితుల్లో ప్రెస్‌మీట్ పెట్టాల్సిన పరిస్థితి వస్తుందని ఏ రోజూ అనుకోలేదు. చంద్రబాబు దగ్గరుండి వ్యవస్థలను దారుణంగా నీరుగారుస్తున్నారు. కొన్ని విషయాలు, వాస్తవాలను అందరూ తెలుసుకోవాలి. కరోనా వైరస్‌తో మనుషులు చనిపోతారు, ఇదేదో భయానకమైన వైరస్, భయంకర పరిస్థితి అని ఆందోళనకు గురి చేయాల్సిన అవసరం లేదు. ప్రపంచవ్యాప్తంగా కరోనా పాజిటివ్ కేసుల్లో దాదాపు 81 శాతం మంది ఇంట్లోనే ఉంటూ కోలుకున్నారు. కేవలం 13.8 శాతం మంది ఆస్పత్రిలో చేరారు. రాష్ట్రంలో 70 నమూనాలు సేకరిస్తే ఒకే ఒక్క పాజిటివ్ కేసు వచ్చింది. ఆ వ్యక్తి కూ డా కోలుకుంటున్నారు. వ్యాధి లక్షణాలు ఏమాత్రం కనిపించినా వెంటనే చర్యలు చేపడుతున్నాం.

ఎవరిది ఈ అధికారం?

రాష్ట్ర ఎన్నికల కమిషనర్ ఈ రోజు ఉదయం స్థానిక సంస్థల ఎన్నికలను నిలుపుదల చేస్తున్నట్లు ప్రకటించారు. ఆయన్ను మా ప్రభుత్వం నియమించలేదు. చంద్రబాబు తన హయాంలో, తన సొంత సామాజిక వర్గానికి చెందిన ఐఏఎస్ అధికారిని రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌గా నియమించారు. నిమ్మగడ్డ రమేశ్‌కుమార్ వ్యాఖ్యలు చాలా బాధ కలిగించాయి. ఎన్నికల కమిషనర్‌కు ఉండాల్సిన ప్రాథమిక లక్షణం నిష్పాక్షికత. రమేష్‌కుమార్ నిష్పాక్షికతతోపాటు విచక్షణ కూడా కోల్పోయినట్లు ప్రవర్తించారు. రమేశ్ కుమార్ ఒకవైపు కరోనా వైరస్ వల్ల ఎన్నికలు వాయిదా వేస్తున్నట్లు చెబుతారు. మరోవైపు గుంటూరు, చిత్తూరు కలెక్టర్లు, ఎస్పీలు, మాచర్ల సీఐ, మరికొందరు అధికారులను తప్పిస్తూ ప్రకటన చేస్తారు. ఇది ఆశ్చర్యకరం. ఇలా ఎవరైనా చేయగలుగుతారా? 175 స్థానాలకుగానూ 151 స్థానాల్లో ప్రజలు ఓట్లేసి గెలిపిస్తే వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చింది. నేను సీఎం స్థానంలో ఉన్నా. మరి ఈ అధికారం సీఎందా? రమేష్ కుమార్‌దా? ఇదేనా విచక్షణ? స్థానిక ఎన్నికలు జరపాలి. 10 రోజుల్లో ప్రక్రియ పూర్తి చేయండి. అప్పటివరకు మేం మాట్లాడం.

ఎన్నికలపై ఎల్లో మీడియా యాగీ...

ఎన్నికలపై చంద్రబాబు, ఆయన ఎల్లో మీడియా నానా యాగీ చేస్తోంది. రాష్ట్రంలో 10,243 ఎంపీటీసీలు, జడ్పీటీసీలకు ఎన్నికలు జరుగుతున్నాయి. ఇందులో 54,594 నామినేషన్లు దాఖలైతే కేవలం 43 చోట్ల మాత్రమే చెదురుమదురు ఘటనలు జరిగాయి. 2,794 వార్డులు, డివిజన్లలో పోటీ జరుగుతుంటే 15,185 నామినేషన్లు దాఖలయ్యాయి. ఇందులో చెదురుమదురు ఘటనలు కేవలం 14 చోట్ల జరిగితే నాలుగు పత్రికలు, టీవీ ఛానళ్లు ఎక్కువగా ఉన్నాయని ఇలా దుష్ప్రచారం చేయడం సరైనదేనా? గుండెపై చెయ్యి వేసుకోని చెప్పండి.

ప్రజలు హర్షించేలా పని చేస్తున్నాం..

తొమ్మిది నెలల క్రితం జరిగిన ఎన్నికల్లో 151 స్థానాలతో అధికారంలోకి వచ్చాం. ప్రజలకు మేలు చేసేలా హర్షించే రీతిలో పని చేస్తున్నాం. మేనిఫెస్టోలో చెప్పిన ప్రతి అంశాన్ని అమలు చేసి 90 శాతం కార్యరూపంలోకి తెచ్చాం. ఇలాంటి పరిస్థితుల్లో వైఎస్సార్ సీపీ స్వీప్ చేస్తే చంద్రబాబు ఎందుకు తట్టుకోలేక పోతున్నారు? వ్యవస్థల్లో తనకున్న మోల్స్‌ను ఉపయోగించి వాటిని దిగజార్చే పని ఎందుకు చేస్తున్నారు?

రాష్ట్రం డబ్బులు పోగొట్టుకోవాలా?

ఈ ఎన్నికల ప్రక్రియ జరగడం ఎందుకు అవసరమో అంతా ఆలోచించాలి. మార్చి 31లోగా స్థానిక ఎన్నికలు అయిపోతే 14వ ఆర్థిక సంఘం నిధులు దాదాపు రూ.5 వేల కోట్లు రాష్ట్ర ప్రభుత్వానికి వచ్చే అవకాశం ఉంటుంది. ఎన్నికలు జరగకపోతే ఆ డబ్బులు రాని పరిస్థితి ఏర్పడుతుంది. ఆ డబ్బులు ఎందుకు పోగొట్టుకోవాలి? ఆ డబ్బులు రాకూడదు, ఆంధ్రప్రదేశ్ నష్టపోవాలని ఎందుకు ఇన్ని కుట్రలు పన్నాలి? కేవలం చంద్రబాబు ముఖ్యమంత్రి కాలేదనే కోపంతో ఇలా చేస్తున్నారు.

వాయిదాతో పరిస్థితి మారుతుందా?

ఎన్నికలు వాయిదా వేస్తే పరిస్థితి మెరుగవుతుందా? రాబోయే రోజుల్లో పరిస్థితులు ఏమైనా మారిపోతాయని చెప్పగలరా? కరోనా బాధిత దేశాల నుంచి రాబోయే రోజుల్లో మన రాష్ట్రానికి ఇంకా చాలా మంది వస్తారు. అప్పుడు మరిన్ని ఇబ్బందులు ఎదురు కావచ్చు. కరోనాను ఎదుర్కోవడం నిరంతర ప్రక్రియ అవుతుంది. పది రోజుల్లో ముగిసే స్థానిక ఎన్నికలను వాయిదా వేయడం ద్వారా సాధించేది ఏమిటి? ప్రజలకు మంచి చేస్తున్నామా? కీడు చేస్తున్నామా? అని బాధ్యతాయుతమైన స్థానంలో ఉన్నవారు ఆలోచించాలి. దీన్ని ఇలాగే చూస్తూ ఊరుకోం. గవర్నర్‌కు ఫిర్యాదు చేశాం. ఎన్నికల కమిషనర్‌ను పిలిచి మాట్లాడాలని కోరాం. అప్పటికీ మార్పు రాకుంటే ఈ అంశాన్ని ఉన్నత స్థాయి దృష్టికి తెస్తాం.

ఎవరో రాసింది ఆయన చదువుతున్నారు..

- రాష్ట్ర ఎన్నికల కమిషన్ కలెక్టర్లకు నిన్న ఓ ఉత్తర్వు ఇచ్చింది. పేదలకు ఇళ్ల పట్టాలు ఇస్తుంటే సంతోషించాల్సింది పోయి ఎన్నికల ప్రక్రియ జరిగేదాకా ఆపమని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ ఉత్తర్వులు ఇచ్చారు.
- నిన్న ఈ లేఖ ఇచ్చారు. ఇవాళ పొద్దున్న ఎన్నికల ప్రక్రియ నిలుపుదల చేశారు.
- నిన్నటికీ, ఇవ్వాళ్టికీ ఏం తేడా కనిపించింది?
- తేడా ఒక్కటే... స్థానిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ స్వీప్ చేస్తోందనే. దాదాపు 2 వేల పైచిలుకు ఎంపీటీలను వైఎస్సార్ సీపీ ఏకగ్రీవంగా దక్కించుకోవడం వారికి దుర్వార్తలా వినిపించింది:
- దీన్ని తట్టుకోలేక, జీర్ణించుకోలేక, చంద్రబాబు ఇంకా దారుణంగా దెబ్బతింటున్నారని, ఏకంగా ఎన్నికల ప్రక్రియను నిలుపుదల చేస్తున్నట్లు పొద్దున 4 పేజీల ఆర్డర్ వచ్చింది.
- ఇంత పెద్ద ఆర్డర్ తయారవుతున్నట్లు ఎన్నికల కమిషన్ సెక్రటరీకే తెలియదు.
- అంటే ఎవరో రాస్తున్నారు, ఎవరో ఇస్తున్నారు, ఆ ఆర్డర్‌ను ఆయన చదువుతున్నారు.
- ఇలా చేయడం ధర్మమేనా?
- ఒకవైపు ఎన్నికలు వాయిదా వేస్తున్నామని ఆర్డర్‌ఇస్తారు. మరోవైపు కలెక్టర్లు, ఎస్పీలను, అధికారులను బదిలీ చేస్తారు.
- ఇళ్ల పట్టాలు లాంటి సంక్షేమ పథకాలను ఆపేస్తున్నారు.
- కరోనా వైరస్ వల్ల ఎన్నికలు వాయిదా వేస్తున్నట్లు చెప్పేటప్పుడు ఎన్నికల కమిషనర్ కనీసం ఎవరినైనా అడగాలి కదా? సూచనలు, సలహాలు తీసుకోరా?
- కనీసం ప్రభుత్వ ఆరోగ్యశాఖ కార్యదర్శిని అడగలేదు. సమీక్ష చేయలేదు.
- సీఎస్‌తో కనీసం అడగలేదు, మాట్లాడలేదు, రివ్యూ చేయలేదు. కనీసం సలహా తీసుకోలేదు.
- ఆర్డర్ కాపీలో మాత్రం సీనియర్ హెల్త్ ఫంక్షనరీస్ నుంచి వచ్చిన ఇన్‌పుట్స్ తీసుకున్నామని ఎన్నికల కమిషనర్ చెబుతారు.
- ఆరోగ్యశాఖ కార్యదర్శి కన్నా సీనియర్ ఫంక్షనరీ ఎవరైనా ఉంటారా? ఇలాంటిది ఎక్కడైనా జరుగుతుందా? మీరేదో చేయాలనుకున్నారు.. చేస్తున్నారు.
- పోనీ చేస్తే చేశారు. కానీ రెండో వైపు అధికారులను బదిలీ చేస్తారు, ఇళ్ల పట్టాలు ఇవ్వొద్దంటారు. ఇది సరైనదేనా?
- చంద్రబాబు ఆయనకు పదవి ఇచ్చి ఉండొచ్చు. ఇద్దరి సామాజిక వర్గం ఒక్కటే కావచ్చు. అయినా ఇంత వివక్ష చూపడం ధర్మమేనా, సబబేనా?

> వాయిదా నిర్ణయాన్ని పునఃసమీక్షించకుంటే దీన్ని ఉన్నతస్థాయి దృష్టికి తెస్తాం

అసలు కరోనా కేసీఆరే

టీపీసీసీ చీఫ్ ఉత్తమ్

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ ప్రత్యేక రాష్ట్రాన్ని ఏర్పాటు చేసిన కాంగ్రెస్ పార్టీని కోవిడ్ వైరస్‌తో పోల్చడం సీఎం కేసీఆర్ కుసంస్కారానికి నిదర్శనమని, అసలు కరోనా కేసీఆరేనని టీపీసీసీ చీఫ్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి విమర్శించారు. అసెంబ్లీలో కోవిడ్ వైరస్‌పై జరిగిన చర్చ సందర్భంగా సీఎం సంయమనం కోల్పోయి మాట్లాడారని, కాంగ్రెస్ ఇచ్చిన రాష్ట్రానికి సీఎంగా ఉండి కాంగ్రెస్ పార్టీనే దూషించడం ఆయన దిగజారుడు రాజకీయాలకు పరాకాష్ట అని ఆదివారం ఒక ప్రకటనలో విమర్శించారు. కేసీఆర్ సీఎం అయ్యాడంటేనే కాంగ్రెస్ పార్టీ పుణ్యమని, ఆ విషయాన్ని మర్చిపోయి చిల్లరగా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. పారాసెట్‌మాల్ వేసుకోవాలని కోవిడ్ గురించి మాట్లాడిన సీఎం కేసీఆర్‌కు ప్రజారోగ్యంపై చిత్తశుద్ధి లేదని విమర్శించారు. పారాసిటమాల్ వేసుకుంటే తగ్గే వైరస్ అయితే ఇప్పుడు పాఠశాలలన్నీ ఎందుకు మూసేస్తున్నారని ప్రశ్నించారు. కాంగ్రెస్ గురించి కేసీఆర్ చేసిన వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకోవాలని, అసెంబ్లీ రికార్డుల నుంచి ఆ మాటలను తొలగించాలని డిమాండ్ చేశారు. దేశానికి స్వాతంత్ర్యం తెచ్చి, అన్ని రకాలుగా అభివృద్ధి చేసి, బడుగు, బలహీన వర్గాలకు అభివృద్ధి పథం చూపెట్టిన కాంగ్రెస్ పార్టీ ఈ దేశానికి కన్నతల్లి లాంటిదని, అలాంటి పార్టీపై అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు కేసీఆర్ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.

పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గించాలి: సీపీఎం

సాక్షి, హైదరాబాద్: అంతర్జాతీయంగా ఉన్న ముడిచమురు ధరల ప్రకారం దేశంలో పెట్రోల్, డీజిల్ ధరలను తగ్గించాలని, పెంచిన సుంకాలను ఉపసంహరించి వినియోగదారులను ఆదుకోవాలని సీపీఎం డిమాండ్‌చేసింది. లీటర్ పెట్రోల్, డీజిల్‌పై రూ.3 చొప్పున ఎక్సైజ్ సుంకం పెంచుతూ కేంద్రం తీసుకున్న నిర్ణయాన్ని ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించింది. అంతర్జాతీయంగా బ్యారల్‌కు 32 డాలర్లకు తగ్గిన ముడిచమురు ధరల ప్రకారం పెట్రో ఉత్పత్తుల ధరలను సగానికి తగ్గించాల్సి ఉండగా, ఈ ప్రయోజనాలు వినియోగదారులకు అందకుండా మోదీ ప్రభుత్వం పెట్రోల్, డీజిల్ ధరలు పెంచిందని సీపీఎం కార్యదర్శి తమ్మినేని వీరభద్రం మండిపడ్డారు.

రైతులు నష్టపోయారు

- రాష్ట్రానికి ముందుచూపు లేకపోవడం వల్లనే..
- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి జి.కిషన్‌రెడ్డి

మాట్లాడుతున్న కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి జి.కిషన్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: కంది, పత్తి కొనుగోలు విషయంలో రాష్ట్ర ప్రభుత్వం ముందుచూపును ప్రదర్శించలేదని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. ప్రభుత్వ వైఖరితోనే రాష్ట్రంలోని కంది, పత్తి రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. ఈ దిగుబడులను రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేయలేదని, కేంద్ర ప్రభుత్వమే చొరవ చూపి కొనుగోలు చేసి రైతులకు ఉపశమనం కలిగించిందన్నారు.ఆదివారం దిల్‌కుషా అతిథిగృహంలో నాఫెడ్, మార్క్‌ఫెడ్, సీసీఐ అధికారులతో కిషన్‌రెడ్డి సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు.కంది రైతులు దిగుబడులను విక్రయించే అంశంలో ఇబ్బందులు పడుతున్నట్లు ఫిర్యాదులు వచ్చాయని, దీనిపై స్పందించిన కేంద్రం రైతులకు న్యాయం చేసేందుకు చర్యలు చేపట్టిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ముందస్తుగా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తే రైతులకు మద్దతు ధర దక్కేదని, కందులు క్వింటాలుకు రూ.5,800 ఇస్తున్నామని, కానీ ముందస్తుగా కొనుగోలు కేంద్రాలు లేక చాలామంది రైతులు రూ.3,500 నుంచి రూ.4,000 వంతున అమ్ముకున్నారన్నారు.ఒక్కో రైతు కనిష్టంగా రూ.1,500 నష్టపోయారన్నారు.రాష్ట్రంలో పండించిన పంటలో దాదాపు 25శాతం దిగుబడులను నాఫెడ్ కొనుగోలు చేసిందన్నారు. 51,625 మెట్రిక్ టన్నులు కొనుగోలు చేశామని, మరో లక్ష టన్నులు కొనుగోలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రాన్ని కోరిందన్నారు.దీన్ని కేంద్ర ప్రభుత్వ సంస్థ అయిన సీసీఐ ద్వారా చేపట్టామన్నారు.నాసిరరమైనా కొనుగోలు చేస్తున్నామని, ఇప్పటివరకు 20లక్షల మెట్రిక్ టన్నుల పత్తిని కొనుగోలు చేసినట్లు తెలిపారు. రైతులు ఆదుకోవడంలో రాష్ట్ర ప్రభుత్వం మాటలకే పరిమితం అవుతోందని, చేతల్లో కనిపించడం లేదని విమర్శిం చారు. దేశవ్యాప్తంగా నీటి ఎద్దడి నిర్మూలనకు సమగ్ర ప్రణాళిక రూపొందించామని, వంద జిల్లాల్లో అమలు చేసినట్లు చెప్పారు.

> **కరోనాపై అప్రమత్తంగా ఉన్నాం...**
>
> కరోనాపై కేంద్ర ప్రభుత్వం అప్రమత్తంగా ఉందని, అన్నిరకాల జాగ్రత్తలు తీసుకుంటోందన్నారు. ఇతర దేశాల్లో ఉన్న భారతీయులను సురక్షితంగా తీసుకొస్తున్నామన్నారు.కేంద్రం తీసుకుంటున్న చర్యలతో కరోనా నష్టం తక్కువగా ఉందన్నారు. చైనా సరిహద్దు దేశమైనప్పటికీ... మన దగ్గర కరోనా ప్రభావం తక్కువగానే ఉందన్నారు. పారామిలిటరీ క్యాంపులు ఏర్పాటు చేస్తున్నామని, కరోనాపై జాగ్రత్తల విషయంలో పార్లమెంటులో నిర్ణయం తీసుకోనున్నట్లు చెప్పారు.

యూత్ కాంగ్రెస్ నూతన సారథి ఎవరో?

- బరిలో ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడు వెంకట్
- కేంద్ర మాజీ మంత్రి బలరాం నాయక్ కుమారుడితో సహా పలువురు నేతల ప్రయత్నాలు

బల్మూరి వెంకట్



సాయికిరణ్

శివసేన రెడ్డి

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ యువజన కాంగ్రెస్ అధ్యక్ష పదవి కోసం పలువురు యువనేతలు పోటీ పడుతున్నారు. ప్రస్తుతం రాష్ట్ర యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఉన్న అనిల్‌కుమార్ యాదవ్ ఇటీవలే జాతీయ ప్రధాన కార్యదర్శిగా నియమితులవడంతో ఆయన స్థానంలో నూతన సారథిని అధిష్ఠానం నియమించనుంది. అయితే, యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడిగా అప్పటికే ఉన్న రాష్ట్ర కార్యవర్గంలో సీనియర్ వైస్ ప్రెసిడెంట్‌ను నియమించే ఆనవాయితీ కాంగ్రెస్ పార్టీలో ఉంది. కానీ, రాష్ట్రాల ఎన్ఎస్‌యూఐ సారథులుగా 26 ఏళ్లు, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులుగా 35 ఏళ్లు నిండిన వారిని నియమించవద్దని గతంలో రాహుల్ గాంధీ నిర్ణయం తీసుకున్నారు. ప్రస్తుతమున్న సీనియర్ వైస్ ప్రెసిడెంట్ రవియాదవ్‌కు వయసు సమస్య ఏర్పడనుందని, దీంతో పలువురు నేతలు తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారని గాంధీభవన్ వర్గాలంటున్నాయి. ఈ జాబితాలో ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు బల్మూరి వెంకట్ ముందు వరుసలో ఉండగా, నాగర్‌కర్నూల్ పార్లమెంటు నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ ఇన్‌చార్జి శివసేనరెడ్డి, కేంద్ర మాజీ మంత్రి బలరాం నాయక్ కుమారుడు సాయికిరణ్ నాయక్, రాష్ట్ర యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు రాజీవ్‌రెడ్డి, జాతీయ ప్రధాన కార్యదర్శి శ్రవణ్‌రావు, రాష్ట్ర కార్యదర్శి, సోషల్ మీడియా ఇన్‌చార్జి వెంకట్ గురిజాల, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు వినోద్, దిలీప్‌రెడ్డిలు కూడా తమ వంతు ప్రయత్నాలు చేసుకుంటున్నారు.

ఎవరి ప్రయత్నాల్లో వారు..

ఈ పదవి కోసం ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు బల్మూరి వెంకట్రావ్ పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. ఆయనతో పాటు ఢిల్లీ పెద్దల దగ్గర మంచి మార్కులు తెచ్చుకున్న శివసేనరెడ్డి, కేంద్ర మాజీ మంత్రి తనయుడు కావడంతో సాయికిరణ్ నాయక్‌లు ముమ్మర ప్రయత్నాలు చేసుకుంటున్నారు. వారం పదిరోజుల్లో ఆశావహులను ఢిల్లీకి పిలిపించి ఇంటర్వ్యూ చేసిన తర్వాత రాష్ట్ర యూత్ కాంగ్రెస్ సారథిని నియమించాలని ఏఐసీసీ యోచిస్తోందని సమాచారం.

గోల్కొండ కోటపై కాషాయ జెండా

▶ మొదటి పేజీ తరువాయి

నియమితులయ్యాక తొలిసారి హైదరాబాద్ వచ్చిన ఆయనకు బీజేపీ శ్రేణులు పెద్ద ఎత్తున స్వాగతం పలికాయి. తొలుత గన్‌పార్క్ వద్ద తెలంగాణ అమరవీరుల స్తూపానికి ఆయన నివాళులు అర్పించి.. పార్టీ కార్యాలయానికి చేరుకున్నారు. అభినందన సభాస్థలిలో ఏర్పాటు చేసిన సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్, సుష్మాస్వరాజ్ చిత్రపటాలకు నివాళులు అర్పించారు. కాగా, సంజయ్ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఆదివారం బాధ్యతలు స్వీకరించలేదు. ముహూర్తం చూసుకుని స్వీకరించనున్నట్లు సమాచారం.

కాషాయజెండా ఎగరేయడమే లక్ష్యం..

నమ్మిన సిద్ధాంతం కోసం, కాషాయ జెండా రెపరేపలాడించేందుకు ఎందరో కార్యకర్తలు ప్రాణాలు కోల్పోయారని బండి సంజయ్ పేర్కొన్నారు. వారి ఆశయ సాధనకోసం కృషి చేస్తానని చెప్పారు. గోల్కొండ కోటపై కాషాయజెండాను రెపరెపలాడించడమే లక్ష్యంగా ముందుకు సాగుతానని తెలిపారు. టీఆర్ఎస్, ఎంఐఎం విధ్వంసాన్ని అడ్డుకునేందుకు, రాష్ట్రంలో ప్రత్యామ్నాయంగా బీజేపీ అధికారంలోకి రావాల్సిందేనని అభిప్రాయపడ్డారు. భైంసా సంఘటనను మరచిపోబోమని, తమను కాపాడాలని పిల్లలు, మహిళలు, తమ్ముళ్లు చేసిన ఆర్తనాదాలు ఇంకా తన కళ్ల ముందు కదలాడుతున్నాయని పేర్కొన్నారు. భైంసాకు వచ్చి, అక్రమ కేసులతో జైలుకు వెళ్లిన తమ్ముళ్లను గుండెకు హత్తుకుంటానని చెప్పారు.

ఆ తుక్‌డేగాళ్ల సంగతి చూస్తా..

'కేసీఆర్ సంగతేందో.. ఎంఐఎం తుక్‌డేగాళ్ల సంగతేందో చూస్తా. బండి సంజయ్ రూటు మార్చడు. అడ్డదారిలో పోయే అలవాటు లేదు. నమ్మిన సిద్ధాంతం కోసం, పేదల కోసం పని చేస్తా, కార్యకర్తలకు అండగా ఉంటా. ఎన్ని కేసులైనా ఎదుర్కొంటా. బీజేపీ మతతత్వ పార్టీ అని, భ

మాస్కుల కోసం ఎగబడొద్దు

జేబు రుమాలును వాడినా సరిపోతుంది: ఈటల

సాక్షి, హైదరాబాద్: కోవిడ్ వైరస్ సోకినంత మాత్రాన ప్రాణం పోతుందన్న భయం అవసరం లేదని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి ఈటల రాజేందర్ అన్నారు. ఇది సోకినవారిలో కేవలం 5 శాతం మందికి మాత్రమే ఐసీయూలో చికిత్స తీసుకోవాల్సిన అసవరం ఉంటుందని, 95 శాతం మంది తమంతట తాముగా గాని, సాధారణ చికిత్సతోపాటు కోలుకుంటారని తెలిపారు. పద్దులపై చర్చ సందర్భంగా ఆదివారం రాత్రి ఆయన మరోసారి శాసన సభలో కోవిడ్‌పై ప్రకటన చేశారు. రాష్ట్రంలో పరిస్థితి పూర్తిగా అదుపులో ఉందని, విదేశాల నుంచి వచ్చిన వారికి తప్ప స్థానికంగా ఉన్న ఎవరికీ ఇప్పటి వరకు వైరస్ సోకలేదని చెప్పారు. ప్రస్తుతం గాంధీలో ఇద్దరు మాత్రమే వైరస్ సోకి చికిత్స పొందుతున్నారన్నారు. వికారాబాద్ అనంతగిరిలో ఏర్పాటు చేసిన ఐసోలేషన్ సెంటర్ వల్ల ఎవరికీ ఏమాత్రం ఇబ్బంది ఉండదని, విదేశాల నుంచి వచ్చినవారిలో అందులో కేవలం అబ్జర్వేషన్ కోసం 14 రోజులు ఉంచుతామని తెలిపారు. ఇక మాస్కుల కోసం ఎవరూ ఎగబడవద్దని, వైరస్ సోకిన వారు, వారికి చికిత్స అందిస్తున్న వైద్యులు, నర్సులకు మాత్రమే ప్రస్తుతం వాటి అవసరం ఉందని, ఈ విషయంలో మాస్కులకు ఎలాంటి కొరతలేదని ఈటల స్పష్టంచేశారు. మిగతావారు ముందుజాగ్రత్త చర్యగా జేబు రుమాలు, చీరకొంగు, తలపాగాను వాడినా సరిపోతుందన్నారు.

ఈఎస్ఐ సంక్షోభంతో మందుల కొరత: మంత్రి మల్లారెడ్డి

రాష్ట్రంలో ఈఎస్ఐ సంక్షోభం వల్ల కొన్ని మందులకు కొరత ఏర్పడిన మాట నిజమేనని కార్మిక శాఖ మంత్రి మల్లారెడ్డి అంగీకరించారు. అయితే దాన్ని అధిగమించామని ఇప్పుడు మందులకు కొరతేలేదన్నారు.

ఖాయిలాపడ్డ పరిశ్రమల్లో ఐటీ సంస్థలు

తూర్పు హైదరాబాద్‌కూ ఐటీని విస్తరిస్తాం: మంత్రి కేటీఆర్

సాక్షి, హైదరాబాద్: ప్రస్తుతం పశ్చిమ హైదరాబాద్‌కే పరిమితమైన ఐటీ పరిశ్రమలను తూర్పు హైదరాబాద్‌లో కూడా విస్తరించే ప్రణాళికలున్నాయని పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు. మల్లాపూర్, నాచారం పారిశ్రామికవాడల్లో మూతపడ్డ పరిశ్రమలను ఐటీ సంస్థలుగా మార్చేందుకు నిర్ణయించామని, దీనికి సంబంధించి త్వరలో శుభవార్త వెల్లడిస్తామన్నారు. వరంగల్, కరీంనగర్, నిజామాబాద్, ఖమ్మంతో పాటు జనగామ, హుజురాబాద్ లాంటి చిన్న పట్టణాల్లో కూడా ఐటీ పరిశ్రమల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. సోమవారం అసెంబ్లీలో పద్దులపై చర్చకు ఆయన ఆదివారం రాత్రి సమాధానమిచ్చారు. ఐటీ ఎగుమతుల్లో తెలంగాణ పెరుగుదల రేటు 16.89 శాతంగా ఉందని, ఇది జాతీయ వృద్ధి రేటు కంటే ఎక్కువ అని పేర్కొన్నారు. ఐటీ రంగంలో ఆఫీస్ స్పేస్ విషయంలో బెంగళూరును కూడా ఇటీవల వెనక్కి నెట్టామన్నారు. వరంగల్ మెగా టెక్స్‌టైల్ పార్కులో ప్రఖ్యాత బహుళజాతి సంస్థ యంగ్‌వన్ రూ.వెయ్యి కోట్ల పెట్టుబడికి సిద్ధమైందన్నారు.

పౌరులకు అనుగుణంగా..

రాష్ట్రంలో పట్టణ జనాభా 44 శాతానికి చేరుకోవటంతో పౌరులకు అనుగుణంగా పురపాలక విధానం రూపొందించినట్లు కేటీఆర్ అన్నారు. రాష్ట్రంలోని 141 పట్టణాల్లో ప్రజలకు మెరుగైన జీవనప్రమాణాలు ఉండేలా 42 అంశాలతో చెక్‌లిస్టు ఏర్పాటు చేసుకుని అభివృద్ధికి ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు వెల్లడించారు. వచ్చే ఐదేళ్లలో ఔటర్ రింగురోడ్డు వరకు హైదరాబాద్ అభివృద్ధి లక్ష్యంగా రూ.50 వేల కోట్లతో సమగ్ర ప్రణాళిక రూపొందిస్తున్నామని తెలిపారు. వచ్చే ఆర్థిక సంవత్సరానికి సంబంధించి అందులో రూ.10 వేల కోట్లను బడ్జెట్‌లో కేటాయించామన్నారు. టీఎస్ఐపాస్‌ను ఆదర్శంగా తీసుకోవాలని నీతి ఆయోగ్ ఇతర రాష్ట్రాలకు సూచించడం గౌరవంగా ఉందన్నారు. ఇప్పుడు టీఎస్‌బీపాస్‌ను ఏప్రిల్ 2న ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నామని చెప్పారు. ఓఆర్ఆర్ వరకు ప్రత్యేకంగా మురుగు నీటిపారుదల కోసం మాస్టర్‌ప్లాన్ సిద్ధం చేస్తున్నామని చెప్పారు. ప్రజాప్రతినిధుల్లో కూడా జవాబుదారీతనం రావాలని, దాని ఆధారంగా ఎవరినైనా పదవీచ్యుతులను చేయాల్సి వస్తే టీఆర్ఎస్ ప్రజాప్రతినిధులతో ప్రారంభిస్తామని చెప్పారు. అభివృద్ధి కార్యక్రమాల్లో పర్యావరణ సమతౌల్యం దెబ్బతినకుండా చూడాలని సీఎం ఆదేశించినట్లు చెప్పారు. హైదరాబాద్‌లో జన సంఖ్య పెరుగుతున్నందున, భారం తగ్గించేందుకు సమీకృత టౌన్‌షిప్స్ కోసం ముసాయిదా సిద్ధమైందని వివరించారు. పట్టణ ప్రగతి కోసం రూ.148 కోట్లు విడుదల చేయనున్నట్లు వెల్లడించారు.

ఇతర పార్టీలు సహకరిస్తున్నాయి..

పారిశ్రామికాభివృద్ధి విషయంలో ఇతర రాజకీయ పార్టీలు సహకరిస్తున్నాయని, ఈ తరహా రాజకీయ స్థిరత్వం ఏ రాష్ట్రంలో కూడా లేదని మంత్రి చెప్పారు. ఫార్మా సిటీలో వచ్చే పరిశ్రమలు ఏరకమైన కాలుష్యాన్ని వెదజల్లవని చెప్పారు. దేశంలో ఉత్పత్తయ్యే మందుల్లో 40 శాతం వరకు మన వద్దే తయారవుతున్నాయని, ప్రపంచానికి మూడో వంతు వ్యాక్సిన్ మనమే సరఫరా చేస్తున్నామని వివరించారు. ఫార్మాసిటీలో స్థానికులకు ఎక్కువ ఉద్యోగాలొచ్చేలా చూస్తామని, అయితే స్థానికులకు ఉద్యోగాలంటే కొన్ని సంస్థలు వెనక్కి మళ్లే ప్రమాదం ఉందని, దీనిపై కేబినెట్ సమావేశంలో నిర్ణయం తీసుకుంటామన్నారు. ఇసుక ద్వారా మైనింగ్ విభాగానికి గతేడాది రూ.3 వేల కోట్ల ఆదాయం సమకూరిందన్నారు. కాగా, కాంగ్రెస్ ఎమ్మెల్యే భట్టి విక్రమార్క ఫార్మాసిటీ ఏర్పాటుపై పలు అనుమానాలు వ్యక్తం చేశారు. దీనిపై కేటీఆర్ స్పందిస్తూ.. గతంలో ఫార్మా కంపెనీల వల్ల ఇబ్బందులు తలెత్తిన మాట వాస్తవమేనని పేర్కొన్నారు. అయితే ఇప్పుడు టెక్నాలజీ పెరిగిందని, దీంతో కాలుష్యం తలెత్తే ప్రసక్తే లేదని పేర్కొన్నారు. అందుకే అంతర్జాతీయ ప్రమాణాలతో ఫార్మా సిటీని ఏర్పాటు చేయాలని సీఎం కేసీఆర్ ఆదేశించారని, కాలుష్యం ఉంటే ఏర్పాటు చేయొద్దని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినట్లు తెలిపారు. అందరితో చర్చించాకే అంతర్జాతీయ ప్రమాణాలతో కాలుష్యరహితంగానే ఫార్మాసిటీని ఏర్పాటు చేస్తామని, అందులో రాజీ పడేది లేదని కేటీఆర్ చెప్పారు.

రాక్షసుల్లా తయారయ్యారు

కొందరు ప్రైవేటు వైద్యులపై ఎమ్మెల్యే రాజాసింగ్ ధ్వజం

సాక్షి, హైదరాబాద్: ప్రైవేటు ఆసుపత్రుల్లో రోగిని జాయిన్ చేస్తే లక్షల రూపాయలు వసూలు చేస్తున్నారని, రాష్ట్రంలో కొంత మంది ప్రైవేటు వైద్యులు రాక్షసుల్లా తయారయ్యారని బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ మండిపడ్డారు. వైద్యారోగ్య శాఖ, విద్యా శాఖ పద్దులపై ఆదివారం అసెంబ్లీలో ఆయన మాట్లాడారు. ప్రైవేటు ఆసుపత్రుల్లో వ్యాధి తగ్గించడం కంటే మొదట ఎన్ని ఎక్కువ డబ్బులు వసూలు చేయాలని చూస్తున్నారని ఆరోపించారు. రోగి చనిపోయాక కూడా రెండు మూడు రోజులు వెంటిలేటర్లపై పెట్టి డబ్బులు గుంజుతున్నారని పేర్కొన్నారు. రోగి చనిపోతే ఒక్క రూపాయి కూడా తీసుకోకుండా ఇంటికి పంపించేలా చట్టం చేయాలని కోరారు. అప్పుడే ప్రజలకు నష్టం ఉండదని, మంచి జరుగుతుందని అభిప్రాయపడ్డారు.

డయాలసిస్ సెంటర్లను ప్రారంభించాలి: రాజేందర్‌రెడ్డి

వైద్యారోగ్య శాఖ పద్దులపై రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి జిల్లా ఆసుపత్రిలో డయాలసిస్ సెంటర్లను ప్రారంభించాలన్నారు. ఐసీయూలను ఏర్పాటు చేయాలన్నారు. పేదలు చనిపోతే తీసుకెళ్లే వాహనాలను ప్రతి జిల్లాలో ఏర్పాటు చేయాలన్నారు. సీఎస్ఆర్ కింద నీలోఫర్, సరోజినీదేవి ఆసుపత్రిని అభివృద్ధి చేయాలని, క్యాన్సర్ ఆసుపత్రికి నిధులను పెంచాలని, నిమ్స్‌లో మరో 60 -70 వెంటిలేటర్లను ఏర్పాటు చేయాలన్నారు.

త్వరలో రామప్ప, లక్నవరానికి గోదావరి నీళ్లు

- ఎండిన వరికంకులు లేవు.. ఖాళీ బిందెలు లేవు..
- ప్రజారంజక పాలనకు ఇదే నిదర్శనం: మంత్రి హరీశ్

సాక్షి, హైదరాబాద్: 'అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు అనగానే ఎండిన మొక్కజొన్న జూళ్లు, ఎండిన వరి కంకులు, నీటి సమస్యకు చిహ్నంగా ఖాళీ బిందెలు, కరెంటు కోతలకు నిరసనగా కందిళ్ల ప్రదర్శనలు కనిపించేవి. కానీ కేసీఆర్ సీఎం అయ్యాక ఇలాంటివి కన్పించట్లేదు. ప్రజారంజక పాలనకు ఇదే నిదర్శనం'అని ఆర్థిక శాఖ మంత్రి హరీశ్ రావు పేర్కొన్నారు. బడ్జెట్ పద్దులపై చర్చలో భాగంగా సీఎం కేసీఆర్ తరపున నీటిపారుదల శాఖపై ఆయన సమాధానమిచ్చారు. రాష్ట్ర చరిత్రలో యాసంగిలో ఏకంగా 38 లక్షల ఎకరాలు సాగుతో కళకళలాడటం తొలిసారి చూస్తున్నామని చెప్పారు. అద్భుతమైన రీతిలో సాగునీటి ప్రాజెక్టులకు రూపకల్పన చేసి కోటి ఎకరాలు సాగులోకి తెచ్చే దిశగా తెలంగాణ సాగుతోందన్నారు. ఇటీవల సీడబ్ల్యూసీ చైర్మన్ కూడా తెలంగాణ ప్రాజెక్టులపై ప్రశంసలు కురిపించారని గుర్తు చేశారు. త్వరలో దేవాదుల ప్రాజెక్టులో భాగంగా రామప్ప చెరువును గోదావరి నీటితో నింపుతామని, అక్కడి నుంచి లక్నవరం చెరువుకు గ్రావిటీ ద్వారా అందిస్తామని తెలిపారు. వెరసి 8,700 ఎకరాలకు కొత్తగా సాగు నీరు అందిస్తామని చెప్పారు.

లక్ష కోట్ల అవినీతి: కోమటిరెడ్డి

సాగునీటిపై హరీశ్‌రావు మాట్లాడుతుండ గా.. కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అధికారపక్షంపై తీవ్ర విమర్శలు చేశారు. ప్రాజెక్టుల పేరుతో రూ.లక్ష కోట్ల అవినీతి జరిగిందంటూ గట్టిగా నినాదాలు చేశారు. దీంతో అధికార పార్టీ సభ్యులు ఆయనపై విరుచుకుపడ్డారు. భారీ అవినీతి జరిగినా, గొప్పగా పనులు జరిగాయంటూ చెప్పుకోవడాన్ని నిరసిస్తూ సభ నుంచి వాకౌట్ చేశారు.

కాంట్రాక్టర్ల బకాయిలు చాలావరకు తీర్చాం: ప్రశాంత్‌రెడ్డి

రోడ్ల అభివృద్ధికి గతం కంటే ఈసారి ఎక్కువ నిధులే కేటాయించుకున్నామని రోడ్లు భవనాలశాఖ మంత్రి ప్రశాంత్‌రెడ్డి అన్నారు. కాంట్రాక్టర్లకు భారీగా బిల్లుల బకాయిలున్న మాట నిజం కాదన్నారు. గతంలో ఎక్కువే ఉండేవని, కానీ ఆర్‌డీఎఫ్ ద్వారా రుణం పొంది వాటిని చాలా వరకు తీర్చేశామని చెప్పారు. లుంబినీ పార్కులో తెలంగాణ అమరవీరుల స్మృతి చిహ్నాన్ని అద్భుతంగా రూపొందిస్తున్నట్లు చెప్పారు. హైదరాబాద్‌లోనూ ఎమ్మెల్యేలకు క్యాంపు కార్యాలయాలు నిర్మించాలన్న సభ్యుల సూచనను పరిశీలిస్తున్నట్లు పేర్కొన్నారు.

80 శాతం పూర్తయిన 'భగీరథ'

రాష్ట్రంలో మిషన్ భగీరథ పథకం 80% పూర్తయిందని, త్వరలో మిగతా పనులు పూర్తి చేస్తామని గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు వెల్లడించారు. మిషన్ భగీరథ పుణ్యాన ఇప్పుడు వేసవిలోనూ రాష్ట్రంలో తాగు నీటి సమస్యలు లేవన్నారు. పుణ్యస్నానాలు ఆచరించే గోదావరి జలం ఇంటిలో నల్లా తిప్పగానే వస్తున్నందుకు అభినందించాల్సింది పోయి కాంగ్రెస్ నేతలు అనవసర ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి తప్పుడు ఆరోపణలు చేస్తున్నారంటూ ఆయనపై విరుచుకుపడ్డారు. ఈ సందర్భంలో రాజగోపాల్‌ను ఉద్దేశించి మంత్రి వాడిన ఓ పదాన్ని ఉపసంహరించుకుంటున్నట్లు ప్రకటించారు. అందుకు సారీ కూడా చెప్పారు.

ఒక్కో విద్యార్థిపై 1.25 లక్షలు ఖర్చు

విద్యా శాఖ పద్దులపై చర్చలో మంత్రి సబిత వెల్లడి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం ఒక్కో విద్యార్థిపై సగటున రూ.1.25లక్షలు ఖర్చు చేస్తూ వారికి నాణ్యమైన విద్య, భోజనం, వసతులు కల్పిస్తోందని విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి వెల్లడించారు. నైతిక విలువలతో కూడిన గుణాత్మక విద్య అందించడమే లక్ష్యంగా ముందుకు పోతున్నామన్నారు. ఆదివారం శాసనసభలో పద్దులపై చర్చకు మంత్రి సమాధానమిచ్చారు. 'రాష్ట్రంలో అన్ని రకాల పాఠశాలలు 29,275 నడుస్తున్నాయి. వీటిలో 25.51లక్షల మందికి పైగా విద్యార్థులు చదువుకుంటున్నారు. వారికి రూ.110కోట్లతో యూనిఫాంలు అందిస్తున్నాం. రూ.75కోట్లు ఖర్చు చేసి పాఠ్యపుస్తకాలు, ప్రభుత్వ స్కూళ్లల్లో రూ. 474 కోట్లతో సన్నబియ్యంతో భోజనం పెడుతున్నా. ఇప్పటికే తల్లిదండ్రుల అభీష్టం మేరకు 9,537 పాఠశాలలను ఇంగ్లిష్ మీడియంవిగా మార్చాం'అని వెల్లడించారు. పాఠశాలలు, కళాశాలల్లో బయోమెట్రిక్ విధానం అమలు చేస్తున్నామని, అనుమతుల్లేని పాఠశాలలపై కఠినంగా వ్యవహరిస్తున్నామని, ఫీజుల నియంత్రణకు చర్యలు చేపట్టామని తెలిపారు. రాష్ట్రంలో ఢిల్లీ తరహా స్కూళ్లు ఏర్పాటు చేయాలన్న డిమాండ్ ఉందని, దీన్ని ప్రయోగాత్మకంగా జీహెచ్ఎంసీ పరిధిలో అమలుపరిచేలా చర్యలు మొదలయ్యాయన్నారు. పర్యాటక, సాంస్కృతిక, క్రీడాశాఖ పద్దుల పై మంత్రి శ్రీనివాస్‌గౌడ్ సమాధానమిస్తూ, ప్రతి మెట్రో స్టేషన్ నుంచి అంతర్గత రవాణాకు వీలుగా ఎలక్ట్రిక్ ఆటో, బస్సులను ప్రవేశపెట్టే ఆలోచన ఉందన్నారు. ప్రతి నియోజకవర్గంలో స్టేడియం ఏర్పాటు చేస్తామన్నారు.

మంచిని చెప్పు.. అమ్మ ఆశీర్వదిస్తది...

ప్రభుత్వం పర్యాటక అభివృద్ధికి అనేక చర్యలు తీసుకుందని, వరంగల్, ములుగు ప్రాంతాల్లో అనేక అభివృద్ధి చర్యలు చేపట్టినా, కాంగ్రెస్ ఎమ్మెల్యే సీతక్క ఒక్క మంచి పనిని చెప్పలేదని మంత్రి శ్రీనివాస్ గౌడ్ నవ్వుతూ వ్యాఖ్యానించారు. 'అమ్మా మంచి చేస్తే మంచిని చెప్పాలి. మీ నియోజకవర్గంలో చెరువులను తీర్చిదిద్దినా, మేడారం జాతరకు విస్తృత ఏర్పాట్లు చేసినా ప్రభుత్వం చేసిన ఒక్క పనిని మెచ్చుకోలే. మంచిని చెబితే అమ్మ సైతం ఆశీర్వదిస్తుంది'అంటూ చమత్కరించారు.

స్వరాష్ట్రంలో పెరిగిన రాబడులు

ప్రతి యేటా ఆదాయంలో 10 శాతానికి పైగా పెరుగుదల

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంలో రాష్ట్ర సొంత రాబడులు పెరిగాయని ప్రభుత్వ గణాంకాలు చెబుతున్నాయి. ఆదివారం అసెంబ్లీలో వివిధ శాఖల డిమాండ్లపై చర్చ సందర్భంగా ప్రభుత్వం ఉంచిన నివేదికల్లో ఈ వివరాలను పొందుపరిచారు. వాణిజ్య పన్నుల డిమాండ్ల నివేదికలో 2014-15 నుంచి ఇప్పటివరకు వచ్చిన పన్నుల వివరాల ప్రకారం పన్నుల రాబడి ఏటేటా పెరుగుతోంది. 2014-15 ఆర్థిక సంవత్సరంలో వాణిజ్య పన్నుల ద్వారా రూ.27,700 కోట్లు రాగా, 2015-16లో రూ.31,119 కోట్లు, 2016-17 (జీఎస్టీ అమల్లోకి వచ్చిన ఏడాది)లో రూ.35,231 కోట్లు, 2017-18లో రూ.42,054 కోట్లు, 2018-19లో రూ.45,379 కోట్లు వచ్చాయని, 2019-20 సంవత్సరంలో ఈ ఏడాది ఫిబ్రవరి వరకు రూ.42,600 కోట్లు వచ్చాయని పేర్కొంది. ఈ లెక్కల ప్రకారం ఈ ఏడాది కూడా గతేడాది కంటే అదనపు ఆదాయం రానుందని తెలుస్తోంది. వాణిజ్య పన్నుల రాబడుల్లో ప్రతియేటా కనీసం 10 శాతానికి తగ్గకుండా వృద్ధి కనిపిస్తుండటం గమనార్హం.

నా నియోజకవర్గానికి రండి

భగీరథ నీళ్లు ఏ మేరకు వస్తున్నాయో చూపిస్తా.. పద్దులపై చర్చలో భట్టి

సాక్షి, హైదరాబాద్: ఇంటింటికి నల్లా నీరు సరఫరా చేస్తున్నామని ప్రభుత్వం చెబుతున్న దానికి, క్షేత్రస్థాయిలో పరిస్థితులకు చాలా తేడా ఉందని అసెంబ్లీ కాంగ్రెస్‌పక్ష నేత మల్లు భట్టి విక్రమార్క చెప్పారు. 'స్పీకర్ గారు మీరు నా నియోజకవర్గానికి రండి. గ్రామాల్లో మిషన్ భగీరథ అమలు తీరు ఎలా ఉందో తెలుస్తుంది'అని పేర్కొన్నారు. ఆదివారం అసెంబ్లీలో పద్దులపై జరిగిన చర్చలో మాట్లాడుతూ.. తెలంగాణ ఏర్పడిన తర్వాత గ్రూప్-1 నోటిఫికేషన్ కూడా వేయలేదని, వయసు మీరుతోందని నిరుద్యోగులు ఆందోళన చెందుతున్నారని, తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన యువతను పట్టించుకోకపోవడం దారుణమని దుయ్యబట్టారు. గ్రామీణ ప్రాంతాల్లో పంచాయతీరాజ్ రోడ్ల వ్యవస్థ అస్తవ్యస్తంగా మారిందని, 2014లో మొదలు పెట్టిన రోడ్లు ఇప్పటికీ అసంపూర్ణంగానే మిగిలిపోయాయని, లింకు రోడ్లు, గ్రామాలను అనుసంధానం చేసే మార్గాలను అభివృద్ధి చేయాలని కోరారు. ఒక్క అగ్రికల్చర్ పాలిటెక్నిక్ కాలేజీ ఏర్పాటు చేయలేదని, ఇప్పటికైనా జిల్లాకో అగ్రి పాలిటెక్నిక్ కాలేజీ స్థాపించేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనుమతుల్లేని కార్పొరేట్ విద్యాసంస్థల సంఖ్య పెరిగిపోయిందని, ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి వీటికి ముకుతాడు వేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఆంగ్ల మాధ్యమాన్ని ప్రవేశపెట్టేందుకు ప్రభుత్వం చొరవ చూపాలన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సిబ్బంది కొరత తీవ్రంగా ఉందని, దీన్ని ప్రాధాన్యాంశంగా పరిగణనలోకి తీసుకుని తక్షణమే పీహెచ్‌సీల్లో సిబ్బందిని భర్తీ చేయాలని, ప్రభుత్వ ఆస్పత్రులను ఆధునికంగా తీర్చిదిద్దాలని కోరారు.

సీఎం వ్యాఖ్యలు అభ్యంతరకరం

కాంగ్రెస్ పార్టీనే దేశానికి పట్టిన కోవిడ్ వైరస్ అని, కొందరు రాజకీయాలు చేస్తూ శవాల మీద పేలాలు ఏరుకుంటున్నారని శనివారం అసెంబ్లీలో సీఎం కేసీఆర్ చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ పార్టీ స్పీకర్‌కు ఫిర్యాదు చేసింది. ఆదివారం ఉదయం సీఎల్పీ నేత భట్టి విక్రమార్క పార్టీ ఎమ్మెల్యేలతో కలసి స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డిని ఆయన చాంబర్‌లో కలిశారు. సీఎం కేసీఆర్ వ్యాఖ్యలు అభ్యంతరకరమని, సీఎం తీరును నియంత్రించి తమకు అండగా నిలవాలని కోరారు. అనంతరం మీడియాతో ఇష్టాగోష్టి మాట్లాడిన భట్టి.. ప్రపంచ దేశాలన్నీ కోవిడ్ పట్ల ఇప్పటికే అప్రమత్తమై జాగ్రత్తలు తీసుకున్నాయని, అసెంబ్లీలో కనీస చర్యలు తీసుకోలేదని విమర్శించారు. అసెంబ్లీ ప్రాంగణంలో శానిటైజర్లు అందుబాటులో లేకపోవడం సరైందికాదన్నారు.

లాబీల్లో 'కోవిడ్' చర్చ

సాక్షి, హైదరాబాద్: కోవిడ్ వైరస్ విస్తృతి, కాంగ్రెస్ పార్టీనే కోవిడ్ అంటూ సీఎం చేసిన వ్యాఖ్యలపై ఆదివారం అసెంబ్లీ లాబీల్లో ఆసక్తికర చర్చ జరిగింది. ఉదయం సభ ప్రారంభమయ్యే సమయంలో సీఎల్పీ నేత భట్టికి టీఆర్ఎస్ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి ఎదురుపడ్డారు. ఏంటన్నా.. ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఈ సందర్భంగా భట్టినుద్దేశించి జీవన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. దీనికి స్పందించిన భట్టి కాంగ్రెస్ పార్టీని కోవిడ్ అని సీఎం అంటే ఎట్లా అని ప్రశ్నించారు. ఒకవేళ కాంగ్రెస్ పార్టీ కోవిడ్ అయితే ఆ పార్టీ నుంచి గెలిచి వచ్చిన మంత్రి సబితా ఇంద్రారెడ్డి, మా జిల్లా ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు సీఎం పక్కనే ఉంటారు. కోవిడ్ రాకుండా చూసుకోండి అని అన్నారు. అక్కడే ఉన్న కాంగ్రెస్ ఎమ్మెల్యే సీతక్క కూడా మాటలు కలుపుతూ పరిహాస్యంగా ఉంటేనే కరోనా రాదని సీఎంకు చెప్పండి అని జీవన్‌రెడ్డినుద్దేశించి వ్యాఖ్యానించారు.

4 సవరణ బిల్లులకు సభ ఆమోదం

- లాభదాయక పదవుల నుంచి 29 చైర్మన్ పదవుల మినహాయింపు
- జీఎస్టీ, అభయహస్తం, ఎస్‌హెచ్‌జీ పింఛను, లోకాయుక్తలకు సవరణలు

సాక్షి, హైదరాబాద్: లాభదాయక పదవుల జాబితా నుంచి 29 చైర్మన్ పదవులను మినహాయిస్తూ సవరణ బిల్లును రాష్ట్ర అసెంబ్లీ ఆమోదించింది. ఈ చట్టం నుంచి హెచ్ఎండీఏ చైర్మన్, వైస్ చైర్మన్, మెంబర్స్, డైరెక్టర్లు, రాష్ట్ర రోడ్డు రవాణాసంస్థ ప్రాంతీయ బోర్డుల డైరెక్టర్లు, రాష్ట్ర రైతు సమన్వయ సమితి, ఎంబీసీ, మూసీ రివర్ ఫ్రంట్, కార్మిక సంక్షేమ బోర్డు, సాంఘిక సంక్షేమ బోర్డు చైర్మన్లు, యాదగిరిగుట్ట, వేములవాడ దేవాలయ అభివృద్ధి సంస్థలు తదితరాల చైర్మన్లను మినహాయిస్తూ ప్రతిపాదించిన సవరణ బిల్లుకు ఆదివారం సభ ఆమోదం తెలిపింది. తెలంగాణ పేమెంట్ ఆఫ్ శాలరీస్, పెన్షన్స్ అండ్ రిమూవల్ ఆఫ్ డిస్‌క్వాలిఫికేషన్ యాక్ట్, 1953 (యాక్ట్ 2 ఆఫ్ 1954) సెక్షన్ 10లో పొందుపరిచిన మేరకు.. వివిధ సంస్థల చైర్మన్లుగా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఉంటే వారు లాభదాయక పదవులు కలిగి ఉన్నందుకు అనర్హత వేసే నిబంధన వర్తించకుండా గతంలో నిర్ణయం తీసుకున్నారు. ఇందులో భాగంగా గతంలో 23 చైర్మన్ పదవులుండగా, తాజాగా ఆ జాబితాలో మరో 29 చైర్మన్ పదవులను అదనంగా కలుపుతూ సవరణ చట్టం చేశారు. ఇంకా జాబితాలోకి తెలంగాణ బిల్డింగ్ అండ్ అదర్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ వెల్ఫేర్ బోర్డు, తెలంగాణ స్టేట్ రోడ్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, కాళేశ్వరం ఇరిగేషన్ ప్రాజెక్టు కార్పొరేషన్, కులీ కుతుబ్‌షా అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ, అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీస్, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ, తెలంగాణ స్టేట్ షీప్, గోట్ డెవలప్‌మెంట్ కో ఆపరేటివ్ ఫెడరేషన్ లిమిటెడ్, హైదరాబాద్ నగర గ్రంథాలయ సంస్థ, తెలుగు అకాడమీ, హాకా, తెలంగాణ అధికార భాషా సంఘం, తెలంగాణ గురుకుల విద్యా సంస్థల సొసైటీ, స్టేట్ హజ్ కమిటీ, తెలంగాణ ఫుడ్ కమిషన్, సెట్విన్, తెలంగాణ సాహిత్య అకాడమీ, టీఎస్ జెన్‌కో, ట్రాన్స్‌కో, డిస్కమ్స్, తెలంగాణ స్టేట్ యోగాధ్యయన పరిషత్ చైర్మన్ పదవులున్నాయి. ఈ మేరకు ఆర్థికమంత్రి హరీశ్‌రావు ప్రవేశపెట్టిన సవరణ బిల్లును శాసనసభ ఆమోదించింది.

మరో మూడు సవరణ బిల్లులకు ఆమోదం...

వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) సవరణ, అభయహస్తం పథకం, మహిళా స్వయం సహాయక సంఘాల (ఎస్‌హెచ్‌జీ) కో కాంట్రిబ్యూటరీ పింఛను చట్టం రద్దు, తెలంగాణ లోకాయుక్త-2020 సవరణ బిల్లులకు శాసనసభ ఆమోదం తెలిపింది. కేంద్రం ఆదేశించిన మేరకు సీజీఎస్టీ చట్టానికి అవసరమైన సవరణలు చేసుకోవడంలో భాగంగా ఈ చట్ట సవరణ చేపడుతున్నట్టు సీఎం తరపున మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ సభలో తెలిపారు. ఇందులో భాగంగా టీడీఎస్ సమయం పొడిగింపు అధికారం కమిషనర్‌కు ఇవ్వడం, రిజిస్ట్రేషన్‌కు తప్పనిసరిగా ఆధార్ కార్డు చూపడం, తదితరాలను చేర్చారు. లోకాయుక్త చట్టంలో ఏపీ ఉన్న చోట తెలంగాణగా మార్పు చేస్తూ 2019లో తెలంగాణ చట్టం తీసుకురాగా, గతంలో లోకాయుక్త పదవికి మాజీ చీఫ్ జస్టిస్‌ను నియమించాలని ఉంటే ఆ స్థానంలో రిటైర్డ్ జడ్జిని నియమించుకునేలా చట్ట సవరణ చేశారు. ఈ చట్ట సవరణను హరీశ్‌రావు ప్రతిపాదించగా సభ ఆమోదించింది. అభయహస్తం కింద 60 ఏళ్లకు పైబడిన వారికి నెలకు రూ.500 చొప్పున పింఛన్లు ఇస్తుండగా, ప్రస్తుతం ఆసరా వృద్ధాప్య పింఛన్లను 57 ఏళ్ల వారికి కూడా రూ.2,016కు పెంచి ఇస్తున్నందున గతంలోని అభయహస్తం పథకం రద్దుకు ఈ చట్టసవరణ ప్రతిపాదించిన పీఆర్ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు తెలిపారు. అదేవిధంగా ఎస్‌హెచ్‌జీ ఉమెన్ కో కాంట్రిబ్యూటరీ పింఛన్ చట్టం రద్దుకు చట్ట సవరణ ద్వారా ప్రతిపాదించినట్టు తెలియజేశారు. ఈ చట్ట సవరణలకు శాసనసభ ఆమోదం తెలిపింది.

ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ల పొడిగింపు

సాక్షి, హైదరాబాద్: ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లను మరో పదేళ్లు పొడిగిస్తూ పార్లమెంట్ ఆమోదించిన 2019 రాజ్యాంగ (126 సవరణ) బి



నల్లగొండ | సోమవారం
మార్చి | 16 | 2020
sakshisahityam@gmail.com

గ్రహం అనుగ్రహం

శ్రీ వికారినామ సంవత్సరం. ఉత్తరాయణం, శిశిర ఋతువు. ఫాల్గుణ మాసం. తిథి బ.సప్తమి ఉ.9.14 వరకు, తదుపరి అష్టమి. నక్షత్రం జ్యేష్ఠ సా.4.44 వరకు, తదుపరి మూల. వర్జ్యం రా.12.36 నుంచి 2.11 వరకు. దుర్ముహూర్తం ప.12.31 నుంచి 1.20 వరకు, తదుపరి ప.2.54 నుంచి 3.44 వరకు. అమృత ఘడియలు ఉ.8.10 నుంచి 9.44 వరకు.

సూర్యోదయం: 6.12 సూర్యాస్తమయం: 6.00;
రాహుకాలం: ఉ.7.30 నుంచి 9.00 వరకు.
యమగండం: ఉ.10.30 నుంచి 12.00 వరకు

నమాజ్ వేళలు

ఫజర్: 5.11 జొహర్: 12.25
అసర్: 4.45 మగ్రీబ్: 6.26 ఇషా: 7.38

ఈవారం పుస్తకాలు



అప్పకవీయము
రచన: కాకునూరి అప్పకవి;
పరిష్కృతం: గిడుగు రామమూర్తి పంతులు,
ఉత్పల వేంకట నరసింహాచార్యులు;
కొత్త కూర్పు: విద్వాన్ దొరసామి శర్మ;
సంపాదకుడు: డాక్టర్ శ్రీరంగాచార్య;
పేజీలు: 724; వెల: 300

సకలనీతి సమ్మతము
రచన: మడికి సింగన; సంపాదకులు: నిడుదవోలు వేంకటరావు, పోణంగి శ్రీరామ అప్పారావు;
పేజీలు: 290; వెల: 130

సురవరం ప్రతాపరెడ్డి పీఠికలు
సంపాదకుడు: డాక్టర్ ఎల్లూరి శివారెడ్డి;
పేజీలు: 138; వెల: 60

సురవరం ప్రతాపరెడ్డి జీవితం-రచనలు
రచన: ముద్దసాని రామిరెడ్డి;
పేజీలు: 152; వెల: 70



పోతన కవితాసుధ
వ్యాఖ్యాత: డాక్టర్ పి.యశోదా రెడ్డి;
పేజీలు: 122; వెల: 60

పై పునర్ముద్రణలు అన్నీ దొరుకు స్థలం: తెలంగాణ సాహిత్య అకాడమీ, కళాభవన్, రవీంద్రభారతి ప్రాంగణం, హైదరాబాద్-500004.
ఫోన్: 040-29703142

కళింగాంధ్ర తేజం, 'ఫైర్ బ్రిగేడ్'
పుల్లెల శ్యామసుందరరావు జీవితం

రచన: డాక్టర్ కె.ముత్యం;
పేజీలు: 184; వెల: 200; ప్రచురణ: దృష్టి;
ప్రతులకు: రచయిత,
ప్లాట్ నం. 42,
గుల్‌మొహర్ పార్క్
కాలనీ, శేరిలింగంపల్లి,
హైదరాబాద్-19.
ఫోన్: 9440399796

లోకప్రపంచం

చ చ! అలా గజ్జీ దురదా అనొద్దు, మన సాహితీ రచనా పరిభాషలో దీన్ని కీర్తి కండూతి అనాలి రైటర్ జీ. ఒకటీ రెండు అవార్డులూ, సన్మానాలూ కాగానే గోక్కోడం తగ్గిపోతుంది, నో వర్రీ!

నా ప్రతి చరణం ఒక ఆత్మ విమర్శ

● పురస్కారం

మట్టిపొరలను సుతిమెత్తగా తొలగించుకుంటూ వచ్చే లేత మొక్కలా గోరటి వెంకన్న పాట మొలకెత్తుతుంది. పల్లె పాత్తిళ్ల నుంచి ఎగిరొచ్చిన పసితనం అద్దుకున్న పాట రాజ్యధిక్కారాన్ని నింపుకుని నల్లతుమ్మముల్లులా గుచ్చుకుంటుంది. గోరటి పాట ప్రకృతిలోని నిసర్గ సౌందర్యాన్ని దోసిట్లో పోసుకొని తాగుతున్నట్లుగా ఉంటుంది. ఒక జీవితానికి సరిపడినంత తాత్విక దాహం తీర్చుకున్నట్లుగా దేహం విశ్వాంతరాల్లోకి తేలిపోతుంది. ఎవరూ పట్టుకోని హీనప్రతీకలను, ఎవరూ ముట్టుకోని కవిసమయాలను అందుకున్న సహజకవి. ప్రబంధ కవితా పాదాల వరుసలో సాగుతూ, ప్రజా వ్యథల్ని వినిపిస్తున్న వాగ్గేయకారుడు. 'వాగు ఎండిపాయెరో పెదవాగు తడి పేగు ఎండిపాయెరా!' అని వెంకన్న వేదనా చెందాడేమోగాని ఏనాటికీ ఎండిపోని పాటల వాగును తెలుగుజాతికి అందించిన గోరటి వెంకన్నతో ప్రత్యేక సంభాషణ.

■ గోరటి వెంకన్న రేపు ప్రతిష్టాత్మకమైన కబీర్ సమ్మాన్ అందుకుంటున్న సందర్భంగా...

★ మీ పాట ద్వారా సమాజాన్ని ప్రభావితం చేయగలిగారా? ఆ సంకేతం మీకు అందిందా?

అది ప్రజలు చెప్పాలి. నేనైతే ప్రభావితం చేశానని అనుకోవటం లేదు. పాట ఎప్పుడూ ఒక అసంపూర్తి వాక్యమే. ఉద్యమ చైతన్యం, ఆ బలమైన నేపథ్యమే సమాజాన్ని ప్రభావితం చేస్తాయి. పాట అందుకు ఒక ప్రధాన సాధనంగా ఉపయోగపడుతుంది. నాకు నేను బయటపడటానికి, నా బాధల బరువును దించుకోవటానికి పాడుకున్న. పల్లెతో నాది గాఢానుబంధం. పల్లెల దుస్థితిని చూశాక, సంక్షోభ స్థితిని అనుభవించాక పల్లె కన్నీరు పెడుతుందని గీతం రాశాక గాని కొంత ఉపశమనం కలగలేదు. నాది ప్రిమిటివ్ స్వభావం. నాలోని వెలితిని, బాధను, వేదనను దూరం చేసుకోవడానికి పాటను ఆశ్రయించా. ఇంత వేగవంతమైన ప్రపంచంలో నా పాట ఏమేరకు ప్రభావితం చేసిందో సమాజమే చెప్పాలి.

★ మీ రచనా ప్రయాణంలో మిమ్ముల్ని మీరు ఆత్మ విమర్శ చేసుకున్న సందర్భాలున్నాయా?

పాట రాస్తున్నప్పుడు ప్రతి చరణం నాలో ఆత్మవిమర్శను ప్రేరేపిస్తుంది. నాలో కాంట్రడిక్షన్ ఎక్కువ. ఆత్మసంఘర్షణ నిరంతరం జరుగుతూనే ఉంటుంది. నేను రాసిందంతా వాస్తవమా, కాదా? అని నన్ను నేను ప్రశ్నించుకుంటాను. 'పాపాలు, శాపాలు లోకమందు ఉంటాయి. కోపాలు, తాపాలు సహజంగా వస్తాయి.' ఉద్యమ స్ఫూర్తి ఉధృతంగా ఊపేస్తూ ఉంటుంది. అట్లా అని హింసకు వ్యతిరేకం. ప్రతిక్షణం తెలియని ఆత్మసంవేదనకు, అసంతృప్తికి గురవుతూ ఉంటాను. సంచారమే నన్ను నేను సరిదిద్దుకునేటట్లుగా చేస్తుంది.

★ మీ పై యక్షగానాలు, పద్యనాటకాల ప్రభావం ఎక్కువగా కనిపిస్తుంది? దానికి కారణం ఏమిటి?

మా నాన్న మంచి యక్షగాన కళాకారుడు. ఊహ తెలిసిన నాటినుంచే యక్షగానం నా ఎదలో ప్రతిధ్వనించింది. చిన్నప్పటి నాటకాలు బలమైన ముద్రలు వేశాయి. యక్షగానాల్లోని రాగఛాయలు, తాళగతులు, సంగతులు నా పాటకు శిక్షణనిచ్చాయి. నా పాటల్లో యక్షగానాల్లోని నడక కనిపిస్తుంది. నేను పనిగట్టుకొని అల్లిక చేయనవసరం లేదు. చిన్నప్పటి జ్ఞాన ప్రభావంతో అలవోకగా రాగం మొలకెత్తుతుంది. నా పాటలోని పిట్ట, చెట్టు, వేకువ, వెన్నెల, తత్వాలన్నింటికి మూలం నేను విన్న పద్యాలు, గేయాల్లోంచే ఉబికివచ్చాయి. సత్యహరిశ్చంద్ర నాటకం కంటే వందేళ్ళ ముందేవచ్చిన కందాల రాఘవాచార్యులు, రామాచార్యుల పద్యధార, సంస్కృత పదజాలం నన్ను ప్రభావితం చేసింది. నేను రాసిన తెలంగాణ బ్రీత్‌లెస్ సాంగ్‌మీద 'అడిగెదనని కడువడి జను...' లాంటి పోతన పద్యాల ప్రభావం ఉంది.

★ ఈ మధ్య మీరు అలంకార శాస్త్ర అధ్యాపకుడిగా, వర్ధమాన సాహిత్య విమర్శకుడిగా కనబడుతున్నారు. ఈ మార్పుకు కారణాలేంటి?

నాకు చిన్నప్పటినుంచి చదవడం అలవాటు. అది ఒక వ్యసనం. ఒక ఆరాధన. నాకు పాట ఎంత ఇష్టమో, విమర్శ అంతే ఇష్టం. ఎం.ఏ. తెలుగు చదివాను. దొరికిన ఏ పుస్తకాన్ని వదల్లేదు. చిన్నప్పుడు క్లాసిక్స్ దొరకని ప్రదేశంలో ఉన్నాను. ఇప్పుడు అర్థం కాకపోయినా అలంకారశాస్త్రం లాంటి పుస్తకాలు చదవడం అలవాటు చేసుకున్నాను. ఎప్పుటికైనా అర్థంకాకపోదా? అనే నమ్మకం. నా అభిప్రాయాలు, పరిశీలనలు పంచుకునే సందర్భంలో అనుభవంలోంచి వచ్చిన విశ్లేషణల వల్ల నాలో విమర్శకుడు కనిపించవచ్చు మీకు.

★ 'జీవనసారం నిలుపుకున్న పామరులే నిజ సిద్ధుల'న్న మీరు వారి గాఢతత్వాన్ని ఎలా అందుకోగలిగారు?

నా బాల్యం, మా ఊరు, ఆ మట్టిదారులు, అక్కడి పల్లె జనులు, పెద్దలు... నా బలమంతా అక్కడే ఉంది. మా ఊరి మాదిగ నారాయణదాసులాంటి వారి ప్రభావం నా మీద ఉంది. అతనిలాగా నేను ఉండాలని ప్రయత్నించానా అనే అనుమానం వస్తుంది. ఆ అనుభవాలు సామాన్యమైనవేం కాదు. ప్రతిపాటను మా ఊరి పామరులే రాయించారు. పామరులే నా హీరోలు. పామరత్వంలోనే పరమతత్వం ఉంది. పామరులు ఏ సమస్యనైనా సంక్లిష్టం చేసుకోరు. వారి సహజ సంభాషణలో లోతైన లోకతత్వం నెలకొని ఉంటుంది. పామరత్వంలో వున్న శోభ, అలంకారాల్ని నిత్యం నేను ఆస్వాదించాను. అదే నా పాటలో ప్రతిఫలించింది. రచయితలు కేశవరెడ్డి, బండి నారాయణస్వామిలో పామరత్వం, కవి దేవులపల్లి కృష్ణశాస్త్రిలో సౌందర్యం నేను దర్శించాను. అవే నా పాటలో పామరతత్వంగా ప్రతిఫలించాయి.

> **ప్రతిపాటను మా ఊరి పామరులే రాయించారు. పామరులే నా హీరోలు. పామరత్వంలోనే పరమతత్వం ఉంది. పామరులు ఏ సమస్యనైనా సంక్లిష్టం చేసుకోరు. వారి సహజ సంభాషణలో లోతైన లోకతత్వం నెలకొని ఉంటుంది. పామరత్వంలో వున్న శోభ, అలంకారాల్ని నిత్యం ఆస్వాదించాను. అదే నా పాటలో ప్రతిఫలించింది.**

★ తెలంగాణ ఉద్యమం కంటే ముందునుంచే మీరు అనేక సామాజిక రాజకీయ సమస్యల మీద రాశారు. ఇప్పుడెందుకు రాయడం లేదు?

తెలంగాణ వచ్చాక కూడా రాస్తున్నాను. కాకపోతే వస్తువులు మారాయి. పొద్దునే లేచి కనబడిన సమస్యల మీద రన్నింగ్ కామెంట్రీ రాయాలన్న కండీషన్ కవికి లేదు. అలా రాయాలనే ఆసక్తి, అభినివేశం నాకు లేదు. ఉద్యమం చేయనప్పుడు రాయడం ఎందుకు? రాయడం ఐదు నిముషాల పని. 'నా పల్లె కన్నీరు పెడుతుంది, సంత, అడవి' పాటలు కొన్ని యేండ్ల తరబడి నలిగిపోయి వచ్చిన పాటలు. అయినా ఇటీవల యురేనియం సమస్య మీద నేనే మొదట రాశాను. ఈ మధ్య ట్రంప్ వచ్చినప్పుడు 'రక్తపింజర చూపు ఎట్లుందో ట్రంప్ చూపు అట్లుంది' అని రాశా. తెలంగాణ వచ్చాక వెలువడిన 'వల్లంకితాళం'లోనూ కొన్ని ఉన్నాయి. ఇప్పటికీ ప్రకృతి, సమాజం, ఉద్యమమే నా గేయాలకు మాతృక. బయటకు రావాల్సిన పరిస్థితి వచ్చినప్పుడు వస్తాయేమో.

★ దేశమంతటా అనేక చర్చలు, వాదనలు అలుముకుంటున్న వేళ ప్రత్యేకంగా ఏమన్నా రాయదలుచుకుంటున్నారా?

చెడుకాలం కమ్ముకుంటున్నప్పుడు భయంకరమైన నిశ్శబ్దం అలుముకుంటుంది. క్రూరత్వం అలుముకున్న వేళ ప్రకృతే ఆ పరిణామం తీసుకొస్తుంది. కులాలు, మతాలు, దేవుడు వ్యక్తిగతం నుంచి రాజకీయంగా మారాయి. ఈ గోడు ఎల్లకాలం ఉండదు. 'దుష్టరిగే బంధ సంపత్తు, సజ్జనరిగే బంధ విపత్తు, యశ్టో కాల ఇరలారదు' (దుష్టులకొచ్చిన సంపద, సజ్జనులకొచ్చిన ఆపద ఎల్లకాలం వుండవు). కవి గూడా సరైన అదును కోసం ఎదురు చూస్తుంటాడు.

★ పాటకు, వచన కవితా ప్రక్రియల మధ్య వ్యత్యాసాలున్నాయా? మిమ్ముల్ని ప్రభావితం చేసిన వచన కవులు ఉన్నారా?

పాటకు, వచన కవితకు కొన్ని వ్యత్యాసాలున్నా రెండూ ఒకటే. భావనా పటిమ, రసనిష్ఠ, అభివ్యక్తి వైవిధ్యం ఉంటేనే ఏదైనా కవిత్వమౌతుంది. కబీర్, గాలిబ్, గుల్జార్, జావేద్ అలాంటివారు. వచన కవితలో సంక్లిష్ట ప్రతీకలు, కఠినమైన పదప్రయోగాలు చేయొచ్చు. పాటకు అది కుదరదు. కాని పాట ప్రజల్లోకి సులువుగా వెళుతుంది. ఈ సందర్భంలో పాటను ప్రజాపరం చేసిన గద్దర్ స్ఫూర్తిని విస్మరించలేం. పాట నడక నాకిష్టం. పాట నా స్వభావం. శివసాగర్, శ్రీశ్రీ, కృష్ణశాస్త్రి, నండూరి, పుట్టపర్తి, సినారె గేయాల ప్రభావం నా పాటల్లో వినిపిస్తుంది. వచన కవుల్లో అజంతాను చాలా ఇష్టపడతాను. ఆలూరి బైరాగి, తిలక్‌ను మర్చిపోలేను. అస్తిత్వ ఉద్యమాల్లో పైడి తెరేష్‌బాబు, మద్దూరి నగేష్‌బాబు, త్రిపురనేని శ్రీనివాస్, అయిల సైదాచారి ఇంకా చాలా మంది మంచి కవులున్నారు. ఇప్పుడు రాస్తున్న కవులందరిది ఎవరి ప్రత్యేకత వారిదే. వారందరిని ఇష్టపడతాను. సీనియర్ కవుల్లో ఎన్.గోపి, శివారెడ్డి కవిత్వాన్ని అభిమానిస్తాను.

★ గోరటి వెంకన్నలో ఆనాటి ధిక్కారస్వరం మూగబోయిందా? ప్రభుత్వం నుండి పదవులు, అవార్డులు ఆశిస్తున్నాడా?

ఇంతకు ముందే చెప్పినట్లు నేనేం మూగపోలేదు. మూగబోయే అదృష్టం, ప్రాప్తం నాకెక్కడిది. ఇది మౌనం మాత్రమే. నా అలజడిలో ప్రశాంతత, ప్రశాంతతలో అలజడి. నా మౌనంలో ఒక అంతర్మథనం, ఒక చలనం, జ్వలనం దాగి వున్నాయి. అవార్డులు కోరుకుంటే వస్తాయా? ఆశిస్తే వస్తాయా? గుర్తించి ఇచ్చిన సాహితీ మూర్తుల గొప్పతనం అది.

సంభాషణ: **డాక్టర్ ఎస్.రఘు**

● కొత్త బంగారం

వలస నుంచి వలసలోకి

ఈ జనవరిలో వచ్చిన 'ఎ లాంగ్ పెటల్ ఆఫ్ ద సీ' చరిత్ర నేపథ్యంగా సాగే ప్రేమకథ. స్పానిష్ రచయిత్రి ఇసబెల్ అయెండ్ మాటల్లో చెప్పాలంటే– ఆవిడ నవల చివరికి న్యూయార్కర్ పత్రిక నుంచి కూడా ప్రశంసలని పొందింది!

ఈ చారిత్రక ఫిక్షన్ స్పెయిన్ సివిల్ వార్‌తో (1936–39) మొదలవుతుంది. ఎంతోమంది స్పెయిన్ దేశ; ఛీజు శరణార్థులై ఫ్రాన్స్‌కు చేరగా, అయిష్టంగానే స్వీకరించిన ఫ్రాన్స్ వారిని కాన్‌సెన్‌ట్రేషన్ కాంప్స్‌లో దుర్భరమైన పరిస్థితుల్లో ఉంచుతుంది. చిలీలో అధికార హోదాలో ఉన్న కవి పాబ్లో నెరూడాకి, స్పెయిన్ పట్ల ఉన్న ప్రత్యేకమైన మమకారం కారణంగా– రెండువేలమంది శరణార్థులను చిలీకి రప్పించడానికి ప్రభుత్వాన్ని ఒప్పిస్తారు. శరణార్థులను వినీపెగ్ అనే కార్గో ఓడలో చిలీకి తరలిస్తారు. మేధావులు కాదు, పనిచేసేవారిని తీసుకోమన్న ప్రభుత్వ సూచనను పక్కనపెట్టి చిలీ పురోగతిని కాంక్షిస్తూ నెరూడా అన్ని వర్గాల వారికీ ఓడలో చోటు కల్పిస్తారు. అలా 1939లో చిలీ చేరిన శరణార్థులు చిలీ దేశస్తులుగా మారి జీవనం సాగిస్తున్న కొన్నేళ్ల తరవాత 1970లో సోషలిస్ట్ పార్టీకి చెందిన సాల్వడార్ అయెండ్ ప్రజల మద్దతుతో చిలీ దేశాధినేత అవుతారు. అతని అధికారాన్ని ఒప్పుకోని మిలటరీ తిరుగుబాటు సాగించడం, 1973లో సాల్వడార్ అయెండ్ ఆత్మహత్య చేసుకోవడం తదనంతర పరిణామాలు. అధికారంలోకి వచ్చాక అయెండ్ ప్రభుత్వానికి చెందిన విధేయులు అందరినీ మిలటరీ వేధించడంతో చాలామంది చిలీని వదిలి వెనెజువేలా వెళ్లిపోతారు. ఖండాలూ, సముద్రాలూ దాటిన చరిత్ర ఇది.

■ నవల: ఎ లాంగ్ పెటల్ ఆఫ్ ద సీ
స్పానిష్ మూలం: ఇసబెల్ అయెండ్
ఇంగ్లిష్‌లోకి అనువాదం:
నిక్ కైస్టర్, అమాండ హాప్కిన్‌సన్

పై చరిత్రకు బలమైన వ్యక్తిత్వాలనీ, ప్రేమలనీ, స్నేహాలనీ ముడివేసి వైవిధ్యమైన ప్రేమకథను వినిపిస్తారు రచయిత్రి. స్పెయిన్ దేశస్తులైన విక్టర్, రోసెర్ శరణార్థులుగా ఫ్రాన్స్ చేరుకుంటారు. విక్టర్ తమ్ముడిని ప్రేమించి అతనివల్ల గర్భవతైన రోసెర్, ఫ్రాన్స్‌లో కొడుక్కి జన్మనిస్తుంది. అప్పటికే యుద్ధంలో విక్టర్ తమ్ముడు మరణించిన సంగతి రోసెర్‌కి విక్టర్ ద్వారా ఆలస్యంగా తెలుస్తుంది. కొడుకు భవిష్యత్తు దృష్ట్యా చిలీకి వెళ్లడం కోసం ఓడలో స్థానం సంపాదించాలంటే దంపతులుగా మారడం అవసరమని రోసెర్‌ని ఒప్పించి, ఆమెని విక్టర్ వివాహం చేసుకున్న తర్వాత ముగ్గురూ చిలీ చేరుకుంటారు. అవసరార్థం చేసుకున్న వివాహమే అయినా, అది వారి మధ్య ఉన్న స్నేహాన్నీ ఆత్మీయతనూ బలపరుస్తుంది. స్నేహంలో నిజాయితీ ప్రేమగా మారి, వారి వైవాహిక జీవితంలో పరిణతి నిండిన ప్రశాంతత నెలకొంటుంది. విక్టర్ వైద్యుడిగా, రోసెర్ పియానో టీచర్‌గా పేరు సంపాదిస్తారు. విక్టర్‌కి చెస్ ఆటలో ఉన్న ప్రావీణ్యత వల్ల ప్రెసిడెంట్ సాల్వడార్ అయెండ్‌కి సన్నిహితుడౌతాడు.

దాదాపు నలభై ఏళ్ల తరవాత స్పెయిన్‌కి వెళ్తారు విక్టర్, రోసెర్. తమదైన ఆ దేశంలో ఏదీ తమదిగా మిగలలేదు. మనుషులూ, పరిస్థితులూ అన్నీ మారిపోయి వుంటాయి. వైరాగ్యంతో తిరిగి చిలీ వెళ్లిపోతారు. సాల్వడార్ మరణం తర్వాత, అతనికి సన్నిహితుడైన కారణంగా విక్టర్ అనేక ఇబ్బందులను ఎదుర్కొంటాడు. చరిత్ర పునరావృతమై విక్టర్, రోసెర్ వెనెజువేలాకి కట్టుబట్టలతో వెళ్లిపోవాల్సి వస్తుంది. జీవితాన్ని పునఃప్రారంభించి అక్కడ స్థిరపడతారు. చిలీలో పరిస్థితులు మెరుగయ్యాకే మళ్లీ చిలీకి చేరుకుంటారు.

ఇన్ని వైపరీత్యాల మధ్య సంయమనాన్నీ, ఆశావహ దృక్పథాన్నీ కోల్పోకుండా విక్టర్, రోసెర్ జీవించిన తీరూ, వారి మధ్య ప్రేమా, వారి వ్యక్తిత్వం– ఇవన్నీ కథనం చేసిన తీరు బాగుంది. కథలో మిగతా పాత్రలు కూడా బలమైనవీ, సహజమైనవీ కావడంతో నవల నిండుదనాన్ని సంతరించుకుంది. ముగింపులో కొంత నాటకీయత ఉన్నా, చరిత్రనూ కల్పననూ కలగలిపి దృఢమైన సున్నితత్వంతో నవల సాగుతుంది.

◆ పద్మప్రియ

● నేడు మునిపల్లె రాజు జయంతి

తాత్త్విక పరీమళాల కథల మల్లె

వర్తమాన సమాజంలోని సంక్షోభాన్ని– అస్తిత్వ జీవన తాత్త్వికతా ఆలోచనా ధోరణులతో, పౌరాణిక, జానపద, చారిత్రక గాథల శిల్పంతో రాసిన మేజిక్ రియలిజం కథకుడు మునిపల్లె రాజు. మనిషిలోని అంతర్ముఖ భిన్న పార్శ్వాలను, మానవ జీవన వైవిధ్యాలను, సంవేదనలను వివరించిన 'కథన మాంత్రికుడు'. 'అస్తిత్వ నదం ఆవలి తీరాన' కథాసంపుటికి 2006లో కేంద్ర సాహిత్య అకాడెమీ అవార్డు అందుకున్న మునిపల్లె రాజు, పోరంకి దక్షిణామూర్తి అన్నట్లు– 'రాజుగారు హృదయమున్న మార్క్సిస్టు, జీవితం తెలిసిన సైంటిస్టు, అన్నింటినీ రంగరించగల ఆల్కెమిస్టు.'

1925 మార్చి 16న గుంటూరులో మునిపల్లె బక్కరాజుగా జన్మించిన ఈయన మునీంద్ర, మునిపల్లె రాజు పేర్లతో కథలు, కవిత్వం రాశారు. మునిపల్లె రాజు కథలు, పుష్పాలు–ప్రేమికులు–పశువులు', దివోస్వప్నాలతో ముఖాముఖి కథాసంపుటాలు వెలువరించారు. ఆయన రాసిన పూజారి నవల వెండితెరపై పూజాఫలంగా అలరించింది.



■ రాజుగారు హృదయమున్న మార్క్సిస్టు, జీవితం తెలిసిన సైంటిస్టు, అన్నింటినీ రంగరించగల ఆల్కెమిస్టు.

వేరొక ఆకాశం– వేరెన్నో నక్షత్రాలు కవితా సంపుటి ఆయన కవిహృదయాన్ని ఆవిష్కరిస్తుంది. జర్నలిజంలో సృజన రాగాలు, అలసిపోయిన వారి అరణ్యకాలు వంటి వ్యాస సంపుటాలు ఆయన మేధోపటిమకు దర్పణంగా నిలుస్తాయి. మొదటి సంపుటిలోని మొదటి కథ వారాలబ్బాయి లగాయతు, అస్తిత్వ నదం ఆవలి తీరాన ఆఖరి కథ వరకూ ఆయన ఆలోచనా ధోరణులు సమగ్ర మానవ నాగరికతా స్వభావానికి ప్రతీకాత్మకంగా ప్రస్తానించినవే. బిచ్చగాళ్ల జెండా, సవతి తమ్ముడు, యశోద కొడుకు, వీర కుంకుమ, అంతా విషాదాంతం కాదు, దంపతులు వంటివి చదివిన పాఠకులను వెంటాడే కథలు. నిశ్శబ్దం ఒక పదం కాదు, నైమిషారణ్యంలో సత్రయాగం లాంటి ప్రయోగాత్మక కథలు ఆయన నవ్య పరిణామ కథాభివ్యక్తులు.

చిన్న విషయాన్నో సంఘటననో కథలుగా అల్లగల కథకులు ఎందరో వున్నారు. కానీ బాల్యం నుంచి జీవన పర్యంతం 'జీవితపు బైప్రొడక్ట్'గా కథలను మలిచిన ఘనత రాజుగారిది. అందుకే ఆయన కథలు నిడివిలో కూడా పెద్దవిగా ఉంటాయి. 'మీ ఆకాశవాణి ప్రసార సమయంలో పది నిమిషాల వ్యవధిలో చదవగలిగే కథలు నేను రాయగలిగినపుడు వస్తానులే సుధామా' అని రేడియో కథకు ఆహ్వానించినపుడు ఆయన అనడమూ, వారి కథారచన అనుభవాలూ జ్ఞాపకాలను అందుకే ఓ గంట వ్యవధి కార్యక్రమంగా రూపొందించి హైదరాబాద్ ఆకాశవాణి నుండి ప్రసారం చేయడమూ ఒక మధుర స్మరణికే.

రక్షణ శాఖలో వివిధ స్థాయిల్లో పనిచేసి పాఠకులకు తన ఆలోచనలతో బతుకు రక్షణనిచ్చే దిశానిర్దేశక కథా రచయితగా తెలుగు సాహిత్యంలో సుస్థిరుడు మునిపల్లె రాజు. తొంభై రెండేళ్లపాటు జీవించి 2018 ఫిబ్రవరి 24న అస్తమించి పాఠక హృదయాల్లో జీవిస్తున్న కీర్తిశేషుడు.

◆ సుధామ

● సాహిత్య మరమరాలు

ప్రతిభావంతుడు



అప్పట్లో భారతి పత్రికలో రచనలు అచ్చవడం కవులకు రచయితలకు గీటురాయిగా వుండేది. అటువంటిదే తెలికచర్ల వెంకటరత్నం సంపాదకత్వంలో వెలువడిన ప్రతిభ మాస పత్రిక కూడా. పొందికగా వస్తున్న ప్రతిభలో తన పేరు చూసుకోవాలని మధునాపంతులకు కోరికగా వుండేది. అయితే ముందు చందాదారునిగా చేరదాం, తరవాత రచనలు పంపిద్దాం అనుకున్నారో ఏమో, పత్రికకు చందా కట్టారు. మరుసటి నెల సంచికలో చందాదారుల జాబితాలో 'మధునాపంతుల సత్యనారాయణశాస్త్రి' పేరు ముద్రించారు. అది చూసిన ఆంధ్ర సహ సంపాదకుడు, విద్వాన్ పాలెపు వెంకటరత్నం ఆయనతో వున్న చనువుతో ''మొత్తానికి ప్రతిభా'వంతుడవయ్యావు'' అని చమత్కరించారు. అందరినీ చమత్కరించే మధునాపంతుల తన మీది చమత్కారానికి ముసిముసిగా నవ్వుకున్నారు.

సేకరణ: **శిఖామణి**

● రచయిత మాట

యాత్రికుడిగా కొత్త అనుభవం

కొత్త ప్రదేశాలకు వెళ్లినప్పుడు గైడ్లూ, టూరిస్టు బ్రోషర్లు భట్టీయం పట్టకపోయినా కనీసం గూగుల్‌ని సంప్రదించి ఆయా ప్రదేశాల మీద ఒక అవగాహన ఏర్పరచుకోవడం నాకు అలవాటు. థాయ్‌లాండ్ విషయంలో ఉదాసీనత వల్లే అనుకొంటాను, ఆ పని చెయ్యలేదు. అది చివరికి గొప్ప మేలు చేసిందని క్రమ క్రమంగా అర్థమయింది. అధ్యయనం చేసి వెళితే ఆ ప్రదేశం మీదా అక్కడి మనుషులూ సంస్కృతి మీదా ఒక పూర్వ నిర్ధారిత అభిప్రాయంతో వెళతాం. ఆ అభిప్రాయానికి అనుగుణంగానూ బలపరచేలానూ ఉండే వివరాలూ అనుభవాల కోసం తెలియకుండానే వెదుకుతాం. ఒక్క క్వాయ్ నది మీది వంతెన గురించి తప్ప థాయ్‌లాండ్‌లోని అయుత్తయ్య (అయోధ్య అన్నమాటకు అక్కడి స్థానిక రూపం) లూ, కాంచనబురిల గురించి ఏ మాత్రమూ తెలియకుండా, తెలుసుకోకుండా వెళ్లడం వల్ల అక్కడ కనిపించిన అన్ని వివరాలనూ, అన్ని అనుభవాలనూ తిన్నగా సూటిగా మనసులో ఇంకించుకోగలిగాను. ఒక యాత్రికుడిగా ఇది కొత్త అనుభవం. ఇంకా చెప్పాలంటే ఒక కనువిప్పు.

అనగనగా ఒక రాజ్యం
(థాయ్‌లాండ్ యాత్రాగాథ)
రచన: దాసరి అమరేంద్ర;
పేజీలు: 142; వెల: 140;
ప్రచురణ: ఆలంబన ప్రచురణలు,
హెచ్ఐజి 85, ఏపీహెచ్‌జీ
కాలనీ, బాలాజీ నగర్,
కూకట్‌పల్లి, హైదరాబాద్-72.
ఫోన్: 040-23055904

రారండోయ్

- సలీం నవలలు – పడిలేచే కెరటం, అరణ్య పర్వం ఆవిష్కరణ సభ మార్చి17న సాయంత్రం 6.00 గంటలకు హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య కళా నిలయంలోని జరుగుతుంది. ఏనుగు నరసింహారెడ్డి, కే.వీ. రమణ, నందిని సిధారెడ్డి, పి. జ్యోతి, కస్తూరి మురళికృష్ణ, కే.పి. అశోక్ కుమార్ ప్రసంగిస్తారు.
- సాహిత్య అకాడెమీ, కవిసంధ్య సంయుక్తంగా ప్రపంచ కవితా దినోత్సవం సందర్భంగా మార్చి 21న యానాంలో 'యానాం పొయిట్రీ ఫెస్టివల్' నిర్వహిస్తున్నాయి. ఇందులో భాగంగా కవిత్వంలో ఇటీవలి ధోరణులు అంశంపై సదస్సు జరగనుంది. శిఖామణి, శివారెడ్డి, విజయ భాస్కర్, ఖాదర్, పాపినేని, దర్భశయనం, జి.లక్ష్మీనరసయ్య పాల్గొంటారు. కవిసంధ్య–ఆంధ్రీకుటీరం కవితల పోటీ విజేతలకు బహుమతుల ప్రదానం, కవి సమ్మేళనం ఉంటాయి.
- కోవెల సుప్రసన్నాచార్య ప్రారంభించిన స్వాధ్యాయ సాహితీ పురస్కారాన్ని ఆచార్య గంగిశెట్టి లక్ష్మీనారాయణకి ఈనెల మార్చి 22న ఉదయం 10 గంటలకు హైదరాబాద్ నారపల్లిలో జరిగే సభలో ప్రదానం చేస్తారు. గన్నమరాజు గిరిజా మనోహర్, మామిడి హరికృష్ణ, తిగుళ్ల కృష్ణమూర్తి, కట్టా శేఖర్‌రెడ్డి, బుద్ధా మురళి, ఏనుగు నర్సింహారెడ్డి పాల్గొంటారు.
- సహృదయ సాహితీ పురస్కారం – 2019 కోసం 2015-2019 మధ్య వచ్చిన పద్యకావ్య, పద్యకవితా సంపుటాల 3 ప్రతులను ఏప్రిల్ 30 లోగా పంపాలని సహృదయ సంస్థ సాహిత్య కార్యదర్శి కోరుతున్నారు. పురస్కార నగదు: 10 వేలు. ప్రదానం ఒద్దిరాజు సోదరుల స్మృత్యంకంగా జూలై 12న. చిరునామా: కె.కృష్ణమూర్తి, ప్లాట్ నం. 207, 2-7-580, సెంట్రల్ ఎక్సైజ్ కాలనీ, హనుమకొండ-506001.

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్న యెడల టోల్ ఫ్రీ నెంబర్‌కు ఉ. 7.00 గం.ల నుండి రా. 8.00 గం.ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును. టోల్ ఫ్రీ నం: 1800 425 9899

సాక్షి ఫ్యామిలీ
నల్లగొండ
సోమవారం ॥ 16-3-2020

నేను రోబో కాదు
సినిమా పేజీలో

అవని కూతురు

ప్రమీలక్క

పులి ముందుకు వెళ్లాలంటే వేటగాడికి తుపాకీ కావాలి. తుపాకీ లేకుండా వెళ్లాలంటే ధైర్యం కావాలి. ధైర్యం కూడా లేకుండా వెళ్లాలంటే 'ప్రేమ' కావాలి. పులిపై ప్రేమ! ప్రమీలకు ప్రేమ మాత్రమే కాదు, పులితో ఏదో బంధం కూడా ఉన్నట్లుంది. 'అవని' పులితో కూతురి బంధం, అవని కూనలతో అక్క బంధం.

● మాధవ్ శింగరాజు

మనిషిని మెడ దగ్గర నోట కరుచుకుని వెళ్లడానికి నెత్తురు రుచి మరిగిన పులికి ఒక్క అంగ చాలు. పులికి రెండు మూడు అంగల దూరంలో మాత్రమే ఉంది ప్రమీల! మొదట పులే ఆమెను చూసింది. కొన్ని క్షణాలకు పులిని ఆమె చూసింది. పులిని చూడ్డం కాదు, పులి తననే చూస్తుండటం చూసింది. పైగా ప్రమీల ఉన్న చోటుకు పులి వచ్చేయలేదు. పులి ఉన్న చోటుకే ప్రమీల వెళ్లింది. అడవి అది. కాసేపట్లో చీకటి అడవి అవుతుంది. ఈమె వన్య సంరక్షకురాలు. ఆమె (ఆడపులి) అరణ్య సంచారి. ప్రమీల మనిషి కాకుండా పులి అయివున్నా, పులి.. పులి కాకుండా మనిషి అయివున్నా ఇద్దరూ తల్లీకూతుళ్లలా ఉండేవారు. ప్రమీల వయసు ఇరవై ఆరేళ్లు. పులి వయసు ఆరేళ్లు. ఆరేళ్లంటే మనుషుల్లో యాభై ఏళ్లు. అలా చూసినా ప్రమీల పులికి కూతురవుతుంది.

అప్పటికే పది మంది మనుషుల్ని చంపేసిన ఆ పులి.. ప్రమీలను చూసి కూడా చూడనట్లు వెళ్లిపోయింది! పది మందిని చంపేసిన పులి అదే అని ప్రమీలకు తెలియదు. తను చూసింది పులిని మాత్రమే అనుకుంది. అక్కడి నుంచి వచ్చేశాకే.. మనుషుల్ని చంపడానికి అలవాటు పడిన 'టీ1' పులి అదేనని తెలిసింది. పులుల జాడ కోసం అడవిలో కెమెరా ట్రాప్‌లను అమర్చే పనిలో ఉంది ప్రమీల ఆ రోజు. కెమెరాలెందుకు నేరుగానే కనిపిస్తున్నా కదా అన్నట్లు ఎదురొచ్చింది ఆ పులి! డ్యూటీ

ప్రమీల |
'అవని'కూనల అక్కఒడి

అవని | 2018 నవంబర్ 2
వేటగాడి తూటాకు బలైన ఆడపులి

ముగించుకుని చీకటి పడే వేళకు తను ఉంటున్న అంజి ఫారెస్ట్ రేంజ్ కార్యాలయ నివాసానికి చేరుకుంది ప్రమీల. అంజి రేంజ్ మహారాష్ట్రలోని యావత్మల్ పర్వత శ్రేణుల కిందికి వస్తుంది. చీకటితో పాటే ఆ చుట్టుపక్కల ఇళ్ల తలుపులకు గడియలు పడుతున్నాయి. గాలొచ్చి తలుపు తట్టినా, 'టీ1' పులి వచ్చి తడుతున్నట్లే ఉలిక్కిపడుతున్నారు.

రాత్రి పూట పులి చూపు మనిషి చూపు కన్నా ఆరు రెట్లు చురుగ్గా ఉంటుంది. పగటి పూట అన్ని రెట్లు ఉండదు. అందుకేనా ప్రమీల తనకసలు కనిపించనే లేదన్నట్లు పులి వెళ్లిపోయింది! లేక, పూర్వ బంధంలా ఏదైనా అపూర్వ బంధంతో 'ఈ తల్లీకూతుళ్ల'ను కలపాలని యాభై వేల చదరపు కి.మీ. విస్తీర్ణంలోని ఆ అటవీ ప్రాంతం తనకు తానుగా సంకల్పించుకుందా! అంజి రేంజ్‌లో రెండు వందల ఎకరాల అటవీ ఆవరణలో ప్రమీల డ్యూటీ. ఆ ఆవరణలోనే పులి తనను చూసింది. చూసి వదిలేసింది.

'టీ1' అనేది పులికి అధికారులు పెట్టిన పేరు. వన్యప్రాణి ప్రేమికులు పెట్టుకున్న పేరు 'అవని'. అవని చంపిన మనుషుల సంఖ్య పద మూడుకు చేరాక.. ఓ రోజు హైదరాబాద్ నుంచి వెళ్లిన హంటర్.. అవనిని చంపేశాడు. అడవిలో ప్రమీల అవనిని చూసింది 2017

> ప్రమీల ఫారెస్ట్ గార్డ్. ఆమెతో పాటు ఐదుగురు మగ గార్డులు 'అవని' పిల్లల్ని వెతికి, సంరక్షించేందుకు ఏడాదిన్నరగా అడవిని గాలిస్తున్నారు. చివరికి ప్రమీలకు మాత్రమే ఆ రెండు కూనలు కనిపించాయి! 'మదర్‌లీ ఇన్‌స్టింక్ట్' అంటారు. పిల్లల కోసం 'అవని' పులి గుండె ప్రమీలలో కొట్టుకుందా? ఆ చప్పుడును అవని పిల్లలు వినగలిగాయా! అందుకే ఆమెకు మాత్రమే కనిపించాయా!

సెప్టెంబర్ లో. అవనిని హంటర్ చంపేసింది 2018 నవంబర్‌లో. చనిపోయే నాటికి అవనికి రెండు పిల్లలు ఉన్నాయి. తుపాకీ తూటాకు తల్లి నేలకొరుగుతున్న సమయంలో అవి తల్లి దగ్గర లేవు. ఉండి ఉంటే, తల్లి కోసం అవి ఏమైనా చేసి ఉండేవి. ఏమీ చేయలేకపోయినా హంటర్‌ని అవి గుర్తుపెట్టుకుని ఉండేవి. చెప్పలేం, ఆ హంటర్‌కి వాటి చేతుల్లో ఏనాటికైనా ఏమైనా రాసి పెట్టి ఉందేమో. పులులకు చూపు తీక్షణతే కాదు, జ్ఞాపకశక్తి కూడా ఎక్కువే.

అవని పిల్లల్లో ఒకటి ఆడ కూన. ఒకటి మగ కూన. తల్లి చనిపోవడంతో పది నెలల వయసులోనే అనాథలయ్యాయి. ఆ కూనల జాడలు కనిపెట్టి వాటిని సంరక్షించే పనిని మగ గార్డుల మీద పెట్టింది ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్! ''నేను కూడా వెళ్లి వెతుకుతాను సర్'' అంది ప్రమీల. అధికారులు వెళ్లనివ్వలేదు. ''పగటి పూట అడవిలోకి వెళ్లడం వేరు. రాత్రి పూట వెళ్లడం వేరు. ఎందుకమ్మాయ్ రిస్కు?'' అన్నారు. అభర్ణ అనే మహిళా డిప్యూటీ కన్జర్వేటర్ బదిలీపై అక్కడికి వచ్చే వరకు కంప్యూటర్ ఆపరేటర్‌గానే ఉండి పోయింది ప్రమీల. ఆమె 'ఎస్' అనగానే.. దారితప్పి జనారణ్యంలోకి వచ్చి, మళ్లీ ఏ విధంగానో తనుండే అరణ్యంలోకి దారి కనుక్కున్న పులిలా నైట్ డ్యూటీలోకి దుమికింది ప్రమీల. అప్పటికే ఐదుగురు మగ గార్డులు కూనల కోసం గాలిస్తున్నారు. చివరికి ప్రమీల మాత్రమే వాటిని గుర్తించగలిగింది! అడవిలో మూల మూలలా ఎరలు వేసి, పంజా ముద్రలు పడే మెత్తలు (పబ్ ఇంప్రెషన్ ప్యాడ్స్) పరిచి, కిలో మీటర్ల కొద్దీ నడిచీ.. రేయింబవళ్లు శ్రమించిన ఏడాదిన్నరకు ప్రమీలకు మొదట.. ఆడకూన కనిపించింది! మిగతా మగ గార్డులకు కనిపించని ఆడకూన ప్రమీలకు కనిపించింది. తల్లి బిడ్డను ఒడిలోకి తీసుకున్నట్లుగా ఆ కూనను తన సంరక్షణలోకి తీసుకుంది ప్రమీల.

రెండున్నరేళ్ల వయసు వచ్చేవరకు పులి పిల్లలు తల్లితోనే ఉంటాయి. అప్పటికి ఆ కూన వయసు పద్దెనిమిది నెలలు. అవని పులికి ప్రమీల కూతురు అనుకుంటే, అవని పులి పిల్లలకు ప్రమీలను అక్క అనుకోవాలి. తనకు పుట్టబోయే బిడ్డల కోసమే ఆ రోజు ప్రమీలను ఏం చేయకుండా వదిలేసిందా.. అవని?! ఆడ కూన కనిపించిన కొన్నాళ్లకే జూన్‌లో మగకూన కూడా కనిపించింది. అదీ ప్రమీలకే. అయితే ఇలా కనిపించి, అలా మాయమైంది. అసలైతే క్షేమంగానే ఉంది. అదీ సంతోషం. దాన్నిప్పుడు పట్టి, భద్రంగా చేతుల్లోకి తీసుకునే వేదకులాటలో ఉంది ప్రమీల. తల్లి లేని బిడ్డల్ని అక్కడికీ ఇక్కడికీ కాకుండా.. నేరుగా తల్లి లాంటి వాళ్ల చెంతకి చేర్చే శక్తి ఒకటి పనిచేస్తూ ఉంటుందేమో ప్రకృతి యంత్రాంగంలో!

అవనిపులి పిల్లలకు అక్కలా దొరికిన ప్రమీలకు ఈ నెల 21న 'అంతర్జాతీయ అడవుల దినోత్సవం' రోజు రెండు ఐదొందల నోట్ల కట్టలను జాతీయ పులుల సంరక్షణ సంస్థ బహుమతిగా ఇవ్వబోతోంది. ●

గడప దాటని రోజులు

హైదరాబాద్‌లోని రవీంద్రభారతి ప్రాంగణం ఈనెల ఎనిమిదవ తేదీన కొత్త కళను సంతరించుకుంది. ఆ తెలుగు వెలుగుల కళాప్రాంగణం.. అంతర్జాతీయ మహిళా దినోత్సవ సంబరాలకు వేదికైంది. రాష్ట్రంలోని ఆడబిడ్డల గౌరవార్థం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న వేడుకలవి. 'ఉమెన్ అచీవర్ అవార్డు - 2020' పురస్కారాల ప్రదానం జరుగుతోంది. వేదిక మీద నుంచి అచీవర్ అవార్డు విజేతలైన మహిళలకు ఆహ్వానం పలుకుతున్నారు. తెల్లటి ధోవతి కట్టుకుని, కాషాయం రంగు చొక్కా ధరించి, తలకు ఎర్రటి తలపాగా చుట్టుకున్న ఓ డెబ్బై ఐదేళ్ల వ్యక్తి వేదిక మీదకు వెళ్లడం కనిపించింది. ఇది మహిళలకు జరుగుతున్న పురస్కారం, వేదిక మీదకు వెళ్తున్న దెవరు? అందరిలో సందేహం. వేదికపైకి రమ్మని పిలుపు వచ్చిన పేరు స్త్రీదా పురుషుడిదా? ఆ సందేహానికి తగిన కారణమే ఉంది. అవార్డు అందుకోవడం కోసం వేదికపైకి వెళుతున్న ఆ వ్యక్తి పురుషుడి వస్త్రధారణలో ఉన్న మహిళ. తొలి ఒగ్గు కథా కళాకారిణి.. జమ్మ మల్లారి.

జమ్మ మల్లారి

రంగారెడ్డి జిల్లా, యాచారం మండలం, నక్కర్త మేడిపల్లి.. జమ్మ మల్లారి స్వగ్రామం. తెలుగు రాష్ట్రాల్లో ఒగ్గు కథ చెప్పిన తొలి మహిళ ఆమె. అప్పటి వరకు మగవాళ్లే కథకులు. లయబద్ధంగా పాడుతూ, ప్రేక్షకుల్లో ఉత్సాహం ఉరకలెత్తేటట్లు మధ్య మధ్య హూంకరిస్తూ ఒగ్గు కథ చెప్పడం మగవాళ్లకే పరిమితమైన రోజులవి. ఆ ఒగ్గు కథను చూడడానికి కూడా ఇంటి గడపదాటి రావడానికి ఆడవాళ్లకు అనుమతి లేని రోజుల్లో ఒక మహిళ ఏకంగా కథ చెప్పడానికి వేదిక మీదకు రావడమే ఓ సాహసం. అంతటి సాహసానికి నాంది వేసింది తన తండ్రి అని చెప్పారు మల్లారి.

నాయన వెంట వెళ్లేదాన్ని

''మా నాయన గుండాలు, అమ్మ చెన్నమ్మ. ఆరుగురు అక్కచెల్లెళ్లు, ముగ్గురు అన్నదమ్ములు మొత్తం తొమ్మిది మంది సంతానం. మా నాయనకు వారసత్వంగా వచ్చిన కళకు నన్ను కూడా వారసురాలిని చేశారాయన. నాయన కథ చెప్తుంటే ఇష్టంగా ఆయన వెంట వెళ్లేదాన్ని. మా అమ్మ కోప్పడేది. మగపిల్లల్లెక్క చొక్కా, ధోవతి కట్టుకునే దాన్ని. మా అమ్మ చీర కట్టినా సరే దాన్ని ధోవతి లెక్క గోచి పెట్టుకుని బర్రెలు తోలుకుని పొలం పోయేదాన్ని. మా నాయన నా ఇష్టాన్ని గమనించి మా అన్నదమ్ములతోపాటు నాకు కూడా తాళం వేయడం, డోలు వాయించడం, కథ చెప్పడం నేర్పించారు. పదహారేళ్ల వయసులో సొంతంగా ఎవరి సహాయమూ లేకుండా కథ చెప్పాను. బీరప్ప, మల్లన్న, ఎల్లమ్మ కథలను చెప్పేదాన్ని. ఒక్కో కథను కొన్ని వందలసార్లు చెప్పి ఉంటాను.

ఆలకించారు.. ఆదరించారు

మా చిన్నప్పుడు 'మగవాడు ఇంటిపట్టున ఉంటే పనికి రాని వాడైపోతాడు. ఆడవాళ్లు గడప దాటితే గౌరవాన్ని కోల్పోతారు' అనే ఒక నానుడి ఉండేది. ఆడవాళ్ల మీద అన్నేసి ఆంక్షలున్న అలాటి రోజుల్లో కూడా... అంటే అరవై ఏళ్ల కిందట నేను ఒగ్గు కథ చెబుతుంటే ఎవరూ అడ్డుకోలేదు. కథ చెప్పడంలో నేను ఎంత సంతోషాన్ని పొందేదాన్నో.. నా కథను వినడానికి జనం కూడా అంతే ఇష్టపడేవాళ్లు. నన్ను చూసి చాలా మంది ఒగ్గు కథ చెప్పడం నేర్చుకున్నారు. కానీ వాళ్ల ఇళ్లలో సరైన సహకారం లేకపోవడం వల్ల ఇందులో కొనసాగలేకపోయారు. ఆంక్షల వల్ల కళ ఉండి కూడా ఎంతో మంది ఆడవాళ్లు ఆ కళను ప్రదర్శించలేక, సాధన కొనసాగించలేక పోయారు. ఇప్పటి అమ్మాయిలకు ఒకటే చెబుతున్నాను. ఇది గొప్ప కళ. అంతరించిపోవడానికి దగ్గరగా ఉంది. మగవాళ్లు నేర్చుకున్నా నేర్చుకోకపోయినా... ఆడపిల్లలు మాత్రం తప్పకుండా నేర్చుకోవాలి. ఆడపిల్లలు నేర్చుకుంటే ఆ కళను తమ పిల్లలకు కూడా నేర్పిస్తారు. దాంతో ఈ కళ అందరి నాలుకల మీద నాట్యమాడుతుంది. తరతరాలు బతికి ఉంటుంది'' అని చెప్పారు మల్లారి.

జమ్మ మల్లారి ఒగ్గు కథ కోసం రంగారెడ్డి, నల్గొండ, మహబూబ్‌నగర్, వరంగల్ జిల్లాలతో పాటు హైదరాబాద్ నుంచి కూడా మేడిపల్లికి వస్తారు. ప్రస్తుతం వార్ధక్యం కారణంగా నడవలేకపోతున్న మల్లారిని కారులో సగౌరవంగా వాళ్ల ఊరికి తీసుకెళ్లి వాళ్ల కార్యక్రమం పూర్తయిన తర్వాత అంతే మర్యాదలతో ఇంట్లో దిగబెడతారు.

– వాకా మంజులారెడ్డి

ఫొటోలు: తాండ్ర శ్రీశైలం, సాక్షి, యాచారం

సంతోషంగా వెళ్లదీశాను

నేను చిన్నప్పుడు పాలు తాగకుంటే మా నాయన 'ఈ బిడ్డను బతికించు సామీ! నీకే అంకితం చేస్తాం' అని మల్లన్న (మల్లికార్జునస్వామి)కు మొక్కినాడంట. ఆ మొక్కు కోసం నన్ను పదకొండేళ్లకే మల్లన్నకిచ్చి పెళ్లి చేశారు. అప్పటి నుంచి ప్రతి ఆదివారం మల్లన్న పూజ చేసుకోవడం అలవాటైంది. కథలు చెప్పడంలో మునిగిపోవడంతో నాకు ప్రత్యేకంగా మరో జీవితం కావాలని కూడా అనిపించలేదు. మా అన్నదమ్ములు సేద్యం చేసుకుంటూ ఒగ్గు కథ చెప్పేవాళ్లు. నేను మల్లన్న సేవలో ఒగ్గుకథ చెప్పుకుంటూ జీవితాన్ని సంతోషంగా వెళ్లదీశాను. మా గొల్ల కురుమలు ఇప్పటికీ ఇళ్లలో ఏ వేడుకైనా నన్ను తీసుకెళ్లి పూజలు, పిల్లల పెళ్లిళ్లు చేయించుకుంటారు. పానం ఉన్నంత కాలం కథ చెబుతా. అప్పట్లో చిందేసి చెప్పిన దాన్ని. ఇప్పుడు ఓపిక తగ్గింది. కథ మొత్తం నిలబడి చెప్పలేక, కూర్చుని చెబుతున్నాను.

- జమ్మ మల్లారి, ఒగ్గు కథాకళాకారిణి

మల్లారి ఒగ్గు కథ బృందం

కునుకు కాదు

చిన్న బ్రేక్

కరోనా ధాటికి ప్రపంచ దేశాలన్నీ చేతులు ఎత్తేశాయి. మరోవైపు ప్రపంచంలోని నర్సులంతా కరోనాపై రెండు చేతులతో యుద్ధం చేస్తున్నారు. మాస్కులు కట్టుకుని క్షణం తీరిక లేకుండా పరుగులు తీస్తున్నారు. చిన్న బ్రేక్ తీసుకోవడం కూడా పెద్ద శ్వాస తీసుకున్నట్లే అవుతోంది పాపం వాళ్లకు. నెలలుగా ముఖానికి మాస్కులు కట్టుకుని ఆ ఒత్తిడికి ముఖం వాచిన, ముఖం కందిపోయిన, ముఖంపై రక్తం చిట్లిన నర్సుల ఫొటోలను చూశాం. తాజాగా ఇప్పుడు మరో ఫొటో బయటికి వచ్చింది. మీరిక్కడ చూస్తున్నదే ఆ ఫోటో. ఇందులో.. చిన్న దిండును అడ్డుగా పెట్టుకుని కంప్యూటర్ కీ బోర్డు మీద వాలిపోయిన నర్సు పేరు ఎలీనా పగ్లియారిని. ఇటలీలోని మిలన్ పట్టణ సమీపంలో ఉన్న క్రెమోనా ఆసుపత్రిలో నర్సు. నిజానికి వాలిపోవడం కాదు. నిస్సత్తువతో ఆమె పడిపోయారు. వేళకు తిండి లేదు. నీళ్లు లేవు. తిండి తిని, నీళ్లు తాగే సమయంలో ఇంకో రోగిని బ్రతికించవచ్చు కదా అని ఎలీనా వంటి నర్సులు ఏకధాటిగా పని చేస్తూనే ఉన్నారు. ఈ ఫొటోను చూసి ఎలీనాను సోషల్ మీడియాలో అంతా అభినందిస్తున్నారు. ఆ అభినందనలు మిగతా నర్సులకు కూడా.

నర్సు ఎలీనా (40)



డబ్బులుండేవి కావు

అమ్మ కష్టం

తల్లి సుజాతతో క్రికెటర్ అజింక్యా రహానే

'టెక్నికల్లీ సౌండ్' అనే మాట ఆటల్లో వినిపిస్తుంటుంది. ఎక్కువగా క్రికెట్‌లో. ఒడుపు తెలిసిన ఆటగాళ్లను అంటారు టెక్నికల్లీ సౌండ్ అని. 'సౌండ్ పార్టీ' అని ఇంకో మాట ఉంది. ఆర్థికంగా మంచి స్థితిలో ఉన్న వ్యక్తిని అంటుంటారు. అజింక్యా రహానే ఇప్పుడు టెక్నికల్‌గా, ఆర్థికంగా కూడా మంచి స్థితిలో ఉన్నాడు. ముంబై కుర్రాడు. తొమ్మిదేళ్ల క్రితం క్రికెట్‌లోకి వచ్చాడు. 64 టెస్ట్ మ్యాచ్‌లు ఆడాడు. టెస్ట్ వైస్ కెప్టెన్‌గా కూడా ఉన్నాడు. క్రికెట్ అంటే ప్రాణం. కష్టపడి పైకొచ్చాడు. కష్టపడి పైకొచ్చిన ఇలాంటి కుర్రాళ్లంతా, ఇంట్లో వాళ్లనూ కష్టపెట్టే ఉంటారు!

'ఇన్‌స్పిరేషన్' అని ఇండియా టుడే టీవీలో ఒక స్పోర్ట్స్ ప్రోగ్రామ్ వస్తుంటుంది. ఆ ప్రోగ్రామ్‌లో రహానే చెప్పిన విషయాలు వింటే, వెంటనే ముంబై వెళ్లి అతడి తల్లిదండ్రులను కలిసి కాసేపు మాట్లాడి వస్తే బాగుండనిపిస్తుంది.

> 'మనం ఎందుకు రిక్షాలో వెళ్లలేం అమ్మా' అని మూలుగుతూ అడిగేవాడిని. అమ్మ దగ్గర సమాధానం ఉండేది కాదు.'

పేదరికంలో ఉన్న పిల్లలు బాగా అభివృద్ధిలోకి వచ్చి నలుగురికీ తెలిశారంటే.. వాళ్ల వెనుక వాళ్ల అమ్మానాన్న చేసిన త్యాగాలు కచ్చితంగా ఉంటాయి. ముంబై దగ్గరి డోంబివ్లీలో ఉండేది రహానే కుటుంబం. తండ్రి మధుకర్ బాబూరావ్ రహానే. తల్లి సుజాత. తమ్ముడు శశాంక్, చెల్లి అపూర్వ. ''నాకు బాగా గుర్తు. అప్పుడు నాకు ఏడేళ్లు. ఒక చేత్తో నా కిట్ బ్యాగుని, ఇంకో చేత్తో తమ్ముణ్ని మోస్తూ అమ్మ ఏడెనిమిది కి.మీ నడిచి నన్ను డోంబివ్లీలోనే కోచింగ్ సెంటర్‌కి తీసుకెళ్లేది. రిక్షాలో వెళ్లడానికి మా దగ్గర డబ్బులు ఉండేవి కాదు. తిరిగి వచ్చేటప్పుడూ అంతే. నేను నడవలేకపోయేవాడిని. ''మనం ఎందుకు రిక్షాలో వెళ్లలేం అమ్మా'' అని మూలుగుతూ అడిగేవాడిని. అమ్మ దగ్గర సమాధానం ఉండేది కాదు. వారానికి ఒక రోజు మాత్రం రిక్షాలో వెళ్లొచ్చేవాళ్లం'' అని టీవీ ప్రోగ్రామ్‌లో చెప్పాడు రహానే. వాళ్ల నాన్న కూడా తక్కువ శ్రమేమీ పడలేదు.

ఆ ఏడేళ్ల వయసులోనే రహానే కోచింగ్ సెంటర్ మారవలసి వచ్చింది. దోంబివ్లీ నుంచి సిఎస్‌టికి. అంటే ఛత్రపతి శివాజీ టెర్మినస్. ఇక్కడ ట్రైన్ ఎక్కి అక్కడ దిగాలి. ప్రాక్టీస్ అయ్యాక అక్కడ ట్రైన్ ఎక్కి, ఇక్కడ దిగాలి. అమ్మకు బదులుగా నాన్న రావడం మొదలు పెట్టాడు. అయితే రైలు ప్రయాణం అలవాటు అవడానికి ఒక రోజు వస్తాను. రెండో రోజు నుంచి నువ్వే వెళ్లి వస్తుండాలి అని చెప్పాడు. ఒక రోజు అయింది. గంటన్నర ప్రయాణం. వెళ్లడానికి గంటన్నర, రావడానికి గంటన్నర. రెండో రోజు రహానే ఒక్కణ్ణే ట్రైన్ ఎక్కించి తను ఆగిపోయాడు. ''నాన్న ఆగిపోయారనే అనుకున్నాను. కానీ తర్వాత తెలిసింది. వెనక బోగీలో ఎక్కి నాన్నగారు నన్ను ఫాలో అయ్యేవారని!'' అని కళ్లు చెమ్మగిల్లుతుండగా చెప్పాడు రహానే.

''నేను ఈరోజు ఈ స్థాయిలో ఉన్నానంటే అది మా అమ్మానాన్న వల్లనే. కోచింగ్ తీసుకుంటున్నప్పుడు, తర్వాత టీమ్‌లోకి వచ్చినప్పుడూ.. ఎప్పుడూ కూడా వాళ్లు గెలుపు ఓటముల కళ్లతో నన్ను చూడలేదు. నన్ను మాత్రమే చూశారు. వాళ్ల కొడుకుగా'' అన్నాడు రహానే.

నో జల్సా

ఆదివారం వస్తోందంటే చాలు అమితాబ్ బచ్చన్ అభిమానులకు జల్సానే జల్సా. ఎందుకంటే ఆయన ముంబైలో ఉంటే కచ్చితంగా తన అభిమానులను కలుస్తారు. 'జల్సాకి రండి.. జాలీగా కబుర్లు చెప్పుకుందాం' అని అభిమానులను ఆహ్వానిస్తారు. ఈసారి 'నో జల్సా' అంటూ ఫ్యాన్స్‌ని నిరుత్సాహపరిచారు. అయితే వారి క్షేమం కోసమే. కరోనా వ్యాప్తి కారణంగా స్కూళ్లు, సినిమా హాళ్లు, షాపింగ్ మాల్స్ బంద్ అయ్యాయి. ఎక్కువగా జనాలు గుమిగూడటం మంచిది కాదనే పరిస్థితి. అందుకే ఫ్యాన్స్‌తో మీటింగ్‌ని అమితాబ్ క్యాన్సిల్ చేశారు. ''నా అభిమానులకు, శ్రేయోభిలాషులందరికీ ఓ విన్నపం. దయచేసి జల్సా (అమితాబ్ ఇంటి పేరు జల్సా) గేట్ దగ్గరకు రావొద్దు. ఆదివారం మీటింగ్‌కి నేను రాను. అందరూ జాగ్రత్తలు తీసుకోండి. సేఫ్‌గా ఉండండి'' అని అమితాబ్ సోషల్ మీడియా ద్వారా పేర్కొన్నారు.


అమితాబ్

నేను రోబో కాదు

ఆలియా భట్

''రోజులో ఎంత బిజీగా ఉన్నా మనకంటూ కొంత సమయం కేటాయించుకోవాలి'' అంటున్నారు ఆలియా భట్. ఈ విషయం గురించి ఇంకా వివరంగా చెబుతూ – ''ఎప్పుడూ పని పని అంటూ ఓ రోబోలా మెకానికల్‌గా ఉండటం నాకు ఇష్టం లేదు. వ్యక్తిగత జీవితం గురించి చాలా శ్రద్ధ తీసుకుంటాను. ప్రతి రోజూ నా గురించి నేను కొంత ఆలోచించుకుంటాను. ఇందుకోసం టైమ్ కేటాయించుకుంటాను. అలా చేయడం వల్ల రీచార్జ్ అవుతాను. నేటి బిజీ లైఫ్‌లో మన కోసం కొంచెం టైమ్ తీసుకోవాలి. అలాగే కొందరు ఇతరులకు నచ్చేలా ఉండటం కోసం తమకు ఇష్టం లేని లుక్స్‌ని ట్రై చేస్తుంటారు. నేను అలా చేయను. ఎందుకంటే ముందు మనకు మనం నచ్చినప్పుడే ఇతరులకు నచ్చుతామని నా అభిప్రాయం'' అని చెప్పుకొచ్చారు ఆలియా.

స్క్రీన్ ఉంది.. సీన్ లేదు



ఒకప్పుడు 'నేడే చూడండి... మీ అభిమాన హీరో సినిమా' అంటూ రిక్షాల్లో తిరుగుతూ మైకుల్లో చెప్పేవారు. రిక్షా వెనకాల పిల్లలు పరిగెత్తుతూ సందడి సందడి చేసేవారు. ఇప్పుడు టీవీ, రేడియా, సోషల్ మీడియా ఇలా సినిమా ప్రమోషన్‌కి చాలా ఉన్నాయి. థియేటర్ ముందు అయితే భారీ కటౌట్లు, గజమాలలు, పాలాభిషేకాలతో ఫ్యాన్స్ సందడి సందడి చేస్తుంటారు. ఇప్పుడు కరోనా ప్రభావంతో థియేటర్ల ముందు సందడి లేదు. వెండితెర వెలవెలబోతోంది. 'స్క్రీన్ ఉంది.. సీన్ లేదు'. "సినిమా చరిత్రలో ఇలా పదీ పదిహేను రోజులు 'థియేటర్లు బంద్' కావడం నాకు తెలిసి ఇదే ఫస్ట్ టైమ్ అని" నైజాం ప్రముఖ పంపిణీదారుడు చారి పేర్కొన్నారు. దాదాపు పది రోజులు థియేటర్లు మూసివేయడం ద్వారా 'సింగిల్ థియేటర్'కి ఏర్పడే నష్టం ఐదారు లక్షలు ఉంటుందని, మల్టీప్లెక్స్‌కి ఇంకా ఎక్కువ ఉంటుందని ఓ పంపిణీదారుడు తెలిపారు. అయితే సినిమా ఆడినప్పుడు సింగిల్ థియేటర్‌తో పోల్చితే మల్టీప్లెక్స్‌కి రాబడి ఎక్కువ ఉంటుందని మరో పంపిణీదారుడు అన్నారు. థియేటర్ల నిర్వహణ గురించి కొందరు ఎగ్జిబిటర్లు, డిస్ట్రిబ్యూటర్లు ఇచ్చిన సమాచారంలోకి వెళదాం...

- ఈ మధ్య 'సింగిల్ థియేటర్'కి అన్నీ నష్టాలే. ఎందుకంటే సినిమా రిలీజులు పెద్దగా లేవు. చిన్న సినిమాలు మంచి టాక్ తెచ్చుకుని ఓ మూడు నాలుగు వారాలు ఆడితే అప్పుడు లాభాలు చూడొచ్చు. ఇక పెద్ద హీరోల సినిమాలను ఎక్కువ థియేటర్లలో రిలీజ్ చేస్తారు. దాంతో ఫస్ట్ వీక్, సెకండ్ వీక్ మంచి వసూళ్లతో థియేటర్ నడుస్తుంది. థర్డ్ వీక్ నుంచి వసూళ్లు పడిపోతుంటాయి.
- మల్టీప్లెక్స్‌లో అయితే ఉన్న మూడు నాలుగు స్క్రీన్స్‌లోనూ పెద్ద సినిమాని ప్రదర్శిస్తారు. వాళ్లకు పర్సంటేజ్ సిస్టమ్ ఉంటుంది. మొదటి వారం వచ్చే వసూళ్లలో డిస్ట్రిబ్యూటర్ 55 శాతం, ఎగ్జిబిటర్ 45 శాతం తీసుకుంటారు. రెండో వారానికి రివర్స్. 55 ఎగ్జిబిటర్ (సినిమా ప్రదర్శించేవాళ్లు), 45 శాతం డిస్ట్రిబ్యూటర్ తీసుకుంటారు. అలా చివర్లో డిస్ట్రిబ్యూర్ 30, ఎగ్జిబిటర్ 70 శాతం తీసుకుంటారు.
- సింగిల్ థియేటర్ అయితే సినిమాని పర్సంటేజ్ పద్ధతిలో కాకుండా రెంటల్ సిస్టమ్‌కి ఇస్తారు. ఏరియాని బట్టి వారానికి నాలుగు లక్షలు రెంట్ ఉంటుంది. ఒకవేళ వసూళ్లు నామమాత్రంగా ఉంటే అప్పుడు డిస్ట్రిబ్యూటర్లు రెంటల్ విధానంలో కాకుండా పర్సంటేజ్ విధానంలో ఎగ్జిబిటర్ నుంచి డబ్బు తీసుకుంటారు. అది ఎప్పుడూ అంటే ఒక షోకి 50 వేలు వసూలు అయితే.. వారానికి సుమారు 10 లక్షలు కలెక్ట్ అవుతాయి. అప్పుడు డిస్ట్రిబ్యూటర్ 2 లక్షలు రెంట్ ఇచ్చేసి, మిగతా 8 లక్షలు తీసుకుంటారు. అదే వారం మొత్తం 2 లక్షలే వస్తే... ఎగ్జిబిటర్‌కి మొత్తం 2 లక్షలు రెంట్ ఇవ్వకుండా వచ్చిన వసూళ్లలో సగం తీసుకుంటారట పంపిణీదారుడు. అదే మల్టీప్లెక్స్ అయితే పర్సంటేజ్ సిస్టమే.
- అసలు ఒక థియేటర్ నెల మెయింటెనెన్స్ ఎంత అవుతుంది? అంటే.. బాగా నీట్‌గా మెయింటైన్ చేసే సింగిల్ థియేటర్‌కి ఐదున్నర నుంచి ఆరు లక్షలవుతుందట. ప్రొజెక్టర్ ఖర్చు, ప్రొజెక్టర్ బల్బ్, టాయ్‌లెట్, ఫ్లోర్ క్లీనింగ్, సీట్స్, కరెంట్ బిల్... ఇలాంటివన్నీ ఈ ఆరు లక్షల్లో ఉంటాయి. ప్రొజెక్టర్ నెల రెంట్ 30 వేలు అయితే, బల్బ్ దర 90 వేల నుంచి లక్ష వరకూ ఉంటుంది. రెండు మూడు నెలలకోసారి కొత్త బల్బ్ మార్చాల్సి ఉంటుంది. ఇది సింగిల్ థియేటర్ ఖర్చు. మల్టీప్లెక్స్‌కి వేరే విధంగా ఉంటుంది. అయితే సింగిల్ థియేటర్‌లో మూడు టికెట్ కౌంటర్లు ఉంటే.. మల్టీప్లెక్స్‌లోనూ దాదాపు అన్నే ఉంటాయని ఓ ఎగ్జిబిటర్ అన్నారు. కాకపోతే మల్టీప్లెక్స్‌లో స్టాఫ్ తక్కువ.. స్క్రీన్లు ఎక్కువ ఉంటాయి. అలాగే సింగిల్ థియేటర్‌లో సినిమా బాగా ఆడకపోతే క్యాంటీన్ రెవెన్యూ కూడా తగ్గుతుంది. కానీ మల్టీప్లెక్స్‌లో వేరే వేరే సినిమాలు స్క్రీనింగ్ చేసుకోవచ్చు కాబట్టి క్యాంటీన్ రన్ బాగానే ఉంటుంది. బాగున్న సినిమాని రెండు మూడు స్క్రీన్స్‌లో ప్రదర్శించే వీలు మల్టీప్లెక్స్‌కి ఉంటుంది. అయితే మల్టీప్లెక్స్‌వాళ్లకు ఉండే కష్టాలు వాళ్లకూ ఉంటాయి కానీ సింగిల్ థియేటర్స్‌కే నష్టం ఎక్కువ అని లెక్కలు చెబుతున్నారు కొందరు ఎగ్జిబిటర్లు.
- మరి ఈ పరిస్థితిలో థియేటర్‌ని ఎందుకు కంటిన్యూ చేయడం అంటే.. ఎప్పుడో థియేటర్స్ కట్టి ఉన్నాయి. వాటిని ఏం చేయాలన్నా కోట్లు పెట్టుబడి పెట్టాలి. ఉమ్మడి ప్రాపర్టీ అయితే పెట్టుబడి ఎవరు పెట్టాలి? అనే విషయంలో వివాదం వచ్చే అవకాశం ఉంది. ఇక పిల్లలు విదేశాల్లో సెటిల్ అయితే ఇక్కడున్న ప్రాపర్టీ మీద పెద్దగా దృష్టి పెట్టరు. అందుకని ఎలాగూ ఉన్నాయి కదా అని థియేటర్స్‌ని నడుపుతున్న ఎగ్జిబిటర్లే ఎక్కువ శాతం ఉన్నారని చారి పేర్కొన్నారు.
- ఇంతకీ పది రోజులు థియేటర్లు మూసేస్తే వచ్చే నష్టం ఎంతా అంటే 'మినిమమ్ ఐదారు లక్షలు' అంటున్నారు. ఏరియాని బట్టి ఈ లెక్కలో హెచ్చు తగ్గులుంటాయి. పైగా మార్కెట్లో దొరికే వస్తువులు ఇవాళ కాకపోతే రేపు అమ్ముడవుతాయి. కానీ ఆ రోజు సినిమా చూడాలనుకున్న ప్రేక్షకులు థియేటర్‌కి రాకపోతే ఆ మర్నాడు వస్తారన్న గ్యారంటీ లేదు. ఓ వారం తర్వాత ఆ సినిమా థియేటర్లో ఉంటుందన్న గ్యారంటీ కూడా లేదు. గత శుక్రవారం అర్జున, ప్రేమ పిపాసి', 302, యురేక, మేద వంటి సినిమాలు విడుదలయ్యాయి. ఆ మర్నాటి నుంచే థియేటర్ల మూతను ప్రభుత్వం ప్రకటించింది. దీనివల్ల నిర్మాతలు, డిస్ట్రిబ్యూటర్లు, ఎగ్జిబిటర్లు నష్టపోయే అవకాశం ఉంది. అయితే బాగా వినిపిస్తున్న మాట ఏంటంటే... కరోనా కారణంగా ప్రేక్షకులు పెద్దగా థియేటర్లకు రావడంలేదు. అందుకని ఇప్పుడు థియేటర్లు మూసినా పెద్దగా నష్టం వాటిల్లదనే చెబుతున్నారు. దానికి ఓ ఉదాహరణ చెప్పాలంటే... ఓ మల్టీప్లెక్స్ థియేటర్‌లో 3600 టికెట్లు బుక్ అయితే.. 600 మంది ప్రేక్షకులు అసలు థియేటర్‌కి రాలేదట. బుక్ చేసుకుని మరీ రాలేదంటే కరోనా ఎంత భయపెడుతోందో ఊహించుకోవచ్చు.

షూటింగ్ బంద్ కరో

కరోనా వైరస్ ప్రభావం అన్ని రాష్ట్రాల చిత్ర పరిశ్రమలపై తీవ్ర ప్రతికూల ప్రభావం చూపుతోంది. తాజాగా తెలుగు రాష్ట్రాల్లో సినిమాల చిత్రీకరణలను నిలిపివేస్తున్నట్లు తెలుగు చలనచిత్ర వాణిజ్య మండలి, నటీనటుల సంఘం, నిర్మాతల మండలి సంయుక్తంగా ప్రకటించాయి. ఈ సందర్భంగా ఆదివారం హైదరాబాద్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో తెలుగు ఫిలిం చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు నారాయణదాస్ నారంగ్ మాట్లాడుతూ – ''ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో షూటింగ్స్‌ను నిలిపి వేయాలని తెలుగు ఫిలిం చాంబర్ ఆఫ్ కామర్స్ నిర్ణయం తీసుకుంది. కరోనా కారణంగానే ఈ నిర్ణయం తీసుకోవడం జరిగింది'' అన్నారు.

''తెలంగాణ ఫిలిం ఛాంబర్ ఆఫ్ కామర్స్, మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్‌లు సంయుక్తంగా చిత్రీకరణలను నిలిపివేయాలని నిర్ణయం తీసుకోవడం జరిగింది. కొందరు నిర్మాతలకు ఇబ్బందిగా ఉన్నా సరే మా ఈ నిర్ణయానికి అందరూ సహకరించాలని కోరుతున్నాం. కరోనా కారణంగా తెలంగాణలో ఎక్కడా షూటింగ్స్ జరగవు'' అన్నారు ప్రొడ్యూసర్ కౌన్సిల్ సెక్రటరీ దామోదర్ ప్రసాద్.

''కరోనా వైరస్ చాలా భయంకరమైనది కాబట్టి తెలంగాణ ప్రభుత్వం థియేటర్స్, మాల్స్ బంద్ ప్రకటించడం జరిగింది. అదే విధంగా షూటింగ్ నిలిపివేయాలని నిర్మాతల మండలి నిర్ణయం తీసుకుంది'' అన్నారు మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్ యాక్టింగ్ ప్రెసిడెంట్ బెనర్జీ.

''తెలంగాణ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని మేము స్వాగతిస్తున్నాం. ఎవ్వరికీ ఇబ్బంది లేకుండా తీసుకున్న నిర్ణయం ఇది. థియేటర్స్ బంద్‌తోపాటు షూటింగ్స్ కూడా నిలిపివేయాలనేది అందరూ మాట్లాడుకుని తీసుకున్న నిర్ణయం. ప్రస్తుతం తెలంగాణలో జరుగుతున్న చిత్రీకరణలు ఒక్కొక్కటిగా ఆగిపోతున్నాయి. అభ్యంతరం లేని ఆంధ్రా ప్రాంతాల్లో షూటింగ్స్ జరుగుతున్నాయి'' అన్నారు ప్రొడ్యూసర్ కౌన్సిల్ అధ్యక్షుడు సి. కల్యాణ్.

''షూటింగ్స్‌లో వందలమంది పాల్గొంటుంటారు. వారి ఆరోగ్య దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకోవడం జరిగింది. సామాజిక బాధ్యతతో తెలంగాణ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ఇది. అందరం దీన్ని సమర్థిస్తున్నాం'' అన్నారు మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్ సెక్రటరీ జీవితా రాజశేఖర్.

''ప్రభుత్వం మళ్లీ షూటింగ్స్ జరుపుకోవచ్చని తెలియజేసినప్పుడు చిత్రీకరణలు పునరావృతం అవుతాయి. ఈ నిర్ణయాన్ని నిర్మాతలందరూ స్వాగతించాలి'' అన్నారు ప్రొడ్యూసర్ కౌన్సిల్ సెక్రటరీ ప్రసన్నకుమార్. ఈ సమావేశంలో నిర్మాతలు శ్యామ్ ప్రసాద్, ఠాగూర్ మధు, నట్టికుమార్, రామసత్యానారాయణ, సురేందర్ రెడ్డి, కొమర వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

సి. కల్యాణ్, ప్రసన్నకుమార్, జీవిత, వెంకటేష్, నారాయణదాస్, బెనర్జీ, దామోదర ప్రసాద్, మధు

తెలుగు పాలాలు

యాక్షన్ కింగ్‌గా పేరు తెచ్చుకున్న అర్జున్ ఇప్పుడు ఓ పెద్ద ప్లాన్‌లో ఉన్నారు. తన కుమార్తె ఐశ్వర్యా అర్జున్‌ని తెలుగుకి పరిచయం చేయాలన్నదే ఆ ప్లాన్. అర్జున్ కన్నడ అయినప్పటికీ తెలుగులోనూ మంచి మంచి సినిమాలు చేశారు. ఇప్పుడు క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గానూ తెలుగు సినిమాలు చేస్తున్నారాయన. తెలుగు ఇండస్ట్రీ అంటే తనకు ప్రత్యేకమైన అభిమానం అంటున్న అర్జున్ తన కుమార్తె ఐశ్వర్యా అర్జున్‌ని తెలుగులోకి పరిచయం చేయాలనుకుంటున్నారు. ఐశ్వర్య హీరోయిన్‌గా అర్జున్ తెలుగులో ఓ సినిమా నిర్మించడానికి సన్నాహాలు చేస్తున్నారని సమాచారం. ఓ అగ్ర తెలుగు నిర్మాతతో కలిసి ఆయన ఈ సినిమా రూపొందించనున్నారట. ఈ సినిమా కోసమే ఐశ్వర్య తెలుగు నేర్చుకుంటున్నారని తెలిసింది. ఇప్పటికే తమిళ, కన్నడ చిత్రాల్లో కథానాయికగా నటించి, మంచి నటి అనిపించుకున్న ఐశ్వర్య ఇప్పుడు టాలీవుడ్‌లో తనను ప్రూవ్ చేసుకోవాలనుకుంటున్నారట. ప్రస్తుతం మలయాళ 'ఇష్క్' కన్నడ రీమేక్‌లో నటిస్తున్నారు ఐశ్వర్య. ఇక టాలీవుడ్ ఎంట్రీ గురించి త్వరలో అధికారికంగా ప్రకటించాలనుకుంటున్నారట.

రాహుల్ సిప్లిగంజ్, అనూప్, రాధామోహన్, సునీల్ రావు, రాజ్ తరుణ్, విజయ్‌కుమార్

నవ్వించడమే పనిగా పెట్టుకున్నాం

- కొండా విజయ్‌కుమార్

రాజ్ తరుణ్, మాళవికా నాయర్ జంటగా విజయ్‌కుమార్ కొండా దర్శకత్వంలో కేకే రాధామోహన్ నిర్మించిన చిత్రం 'ఒరేయ్ బుజ్జిగా..' కరీంనగర్‌లో జరిగిన ఈ సినిమా ప్రీ–రిలీజ్ వేడుకలో సునీల్‌రావు (కరీంనగర్ మేయర్) ముఖ్య అతిథిగా హాజరై 'ఒరేయ్ బుజ్జిగా..' ఆడియో బిగ్ సీడీని విడుదల చేశారు. నిర్మాత కేకే రాధామోహన్ మాట్లాడుతూ – ''నిర్మాతగా ఇది నా ఎనిమిదో సినిమా. ఫుల్ లెంగ్త్ ఎంటర్‌టైనర్. టీమ్ అందరి సహకారం వల్ల సినిమా బాగా వచ్చింది. ముందుగా ఉగాది కానుకగా ఈ సినిమాను మార్చి 25న విడుదల చేద్దామనుకున్నాం. కరోనా వైరస్ వల్ల ప్రభుత్వ ఆదేశానుసారం ఈ నెల 21వరకు థియేటర్స్ మూసివేస్తున్నారు. తిరిగి సినిమా థియేటర్స్ ఓపెన్ చేయగానే విడుదల తేదీని ప్రకటిస్తాం'' అన్నారు. ''ఇది క్లీన్ ఎంటర్‌టైనర్. రెండున్నర గంటలు ప్రేక్షకులను నవ్వించడమే పనిగా పెట్టుకున్నాం. రాజ్‌తరుణ్ ఫైట్స్, డ్యాన్స్‌లు ఇరగదీశాడు. రాధామోహన్‌గారు ఎక్కడా కాంప్రమైజ్ కాకుండా ఈ చిత్రాన్ని నిర్మించారు'' అన్నారు విజయ్‌కుమార్ కొండా. ''థియేటర్‌కు వచ్చి ఫ్యామిలీ అంతా రెండున్నర గంటలు హ్యాపీగా నవ్వుకునే సినిమా ఇది'' అన్నారు రాజ్ తరుణ్. ''గుండెజారి గల్లంతయ్యిందే', 'ఒక లైలా కోసం' తర్వాత డైరెక్టర్ విజయ్‌కుమార్‌గారితో ఇది నా హ్యాట్రిక్ ఫిల్మ్. రాజ్ తరుణ్ ఎనర్జీ నాకు బాగా నచ్చుతుంది. రాజ్ తరుణ్‌తో నాకిది రెండో సినిమా'' అన్నారు సంగీత దర్శకుడు అనూప్ రూబెన్స్. నటుడు మధుసూధన్, సింగర్ రాహుల్ సిప్లిగంజ్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ రమేష్, కార్పొరేటర్ బోనాల శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

సైంటిస్ట్ షారుక్

'బ్రహ్మాస్త్ర' కోసం సైంటిస్ట్‌గా మారారు షారుక్ ఖాన్. రణ్‌బీర్ కపూర్, ఆలియా భట్ జంటగా అయాన్ ముఖర్జీ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'బ్రహ్మాస్త్ర'. ఇందులో అమితాబ్ బచ్చన్, నాగార్జున, డింపుల్ కపాడియా కీలక పాత్రలు చేస్తున్నారు. ఈ చిత్రంలో షారుక్ ఖాన్ సైంటిస్ట్‌గా ఓ గెస్ట్ రోల్ చేశారని బాలీవుడ్ సమాచారం. షారుక్ సన్నివేశాలతోనే ఈ చిత్రం మొదలవుతుందట. కరోనా వైరస్ ప్రభావంతో ఈ సినిమా చిత్రీకరణ ప్రస్తుతం వాయిదా పడింది. మరోవైపు 'జీరో' (2018) చిత్రం తర్వాత షారుక్ ఖాన్ హీరోగా నటించే చిత్రంపై ఇప్పటివరకు సరైన స్పష్టత రాలేదు. తమిళ దర్శకుడు అట్లీతో ఓ హిందీ సినిమాకి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని సమాచారం.

షారుక్

ఏనుగు పోయె

కేపీ రెడ్డి, రాజ్ కందుకూరి, ఎం. రాజేంద్రన్

ఒక ఏనుగు, చిన్న పిల్లల మధ్య జరిగే సన్నివేశాలతో కేపీ రెడ్డి దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'పోయే ఏనుగు పో'. పీకేఎన్ క్రియేషన్స్ పతాకంపై ఎం. రాజేంద్రన్ తెలుగు, తమిళంలో నిర్మిస్తున్నారు. తమిళంలో 'పో యానైకుట్టియే పో' పేరుతో రూపొందుతోంది. ఈ చిత్రం తెలుగు టైటిల్ లోగో, బేనర్ లోగోను నిర్మాత రాజ్ కందుకూరి విడుదల చేసి, మాట్లాడుతూ– ''పోయే ఏనుగు పో' టైటిల్ చాలా కొత్తగా ఉంది. మంచి కథ, మాటలతో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ఈ సినిమా తప్పకుండా పెద్ద విజయం సాధించాలని కోరుకుంటున్నా'' అన్నారు. ఎం.రాజేంద్రన్ మాట్లాడుతూ– ''మంచి కుటుంబ కథా చిత్రమిది. ఏనుగు, చిన్న పిల్లల మధ్య జరిగే మంచి సన్నివేశాలతో మా దర్శకుడు ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. అన్ని వర్గాల వారిని ఆకట్టుకుంటుందనే నమ్మకం ఉంది. త్వరలోనే తెలుగు, తమిళ భాషల్లో విడుదల చేస్తాం'' అన్నారు. ఈ చిత్రానికి కెమెరా: అమర్. జి, సంగీతం: భీమ్స్ సిసిరోలియో.

సరికొత్త ప్రేమ

దేవదాస్ హీరోగా చందు అజ్మీర దర్శకత్వంలో సాయిదత్తా ఆర్ట్ క్రియేషన్స్ బ్యానర్‌పై కె. శైలజ నిర్మిస్తున్న చిత్రం పాటల రికార్డింగ్ ప్రారంభమైంది. ఇందులో హాసిని కథానాయిక. శైలజ కె. మాట్లాడుతూ – ''చందు చెప్పిన కథ బాగుంది. ప్రస్తుత పరిస్థితులకు అద్దం పట్టేలా ఉంది. దేవదాస్‌లో మంచి ప్రతిభ ఉంది. ఈ నెల చివరి వారంలో రెగ్యులర్ షూటింగ్ ఆరంభించి, రెండు షెడ్యూల్స్‌లో సినిమాని పూర్తి చేయాలనుకుంటున్నాం'' అన్నారు. ''మాస్, క్లాస్ ఆడియన్స్‌కు నచ్చేలా ప్రేమను సరికొత్త రూపంలో చూపించబోతున్నాం. సినిమాలో నాలుగు పాటలు, ఐదు ఫైట్లు ఉన్నాయి'' అన్నారు చందు అజ్మీర. ''అవకాశం ఇచ్చిన దర్శక–నిర్మాతలకు థ్యాంక్స్. మంచి పాత్ర చేస్తున్నా'' అన్నారు దేవదాస్. ఈ సినిమాకు సంగీతం: డేవిడ్ జి. పాటలు: చంద్రబోస్, సుద్ధాల అశోక్ తేజ.

దేవదాస్

కోవిడ్ 19 ఫ్యాక్ట్స్

గుండెజబ్బులూ, షుగర్, ఆస్తమా ఉన్నాయా?

మరింత అప్రమత్తంగా ఉండండి

ఇటీవల కరోనా వైరస్ భయం ప్రజలందరినీ బెంబేలెత్తిస్తోంది. ఆరోగ్యవంతులు దీని గురించి అంతగా ఆందోళన చెందక్కర్లేదు. కానీ... ఇప్పటికే గుండెజబ్బులు, డయాబెటిస్, ఆస్తమా లేదా ఇతర రుగ్మతలతో బాధపడుతున్నవారు మాత్రం మరింత జాగ్రత్తగా ఉండాల్సిందే అంటున్నారు వైద్యనిపుణులూ, పరిశోధకులు. వీళ్లు కూడా అప్రమత్తంగా ఉంటే చాలు... ఆందోళన పడాల్సిన అవసరం లేదని గణాంకాలే చెబుతున్నాయి.



ఇటీవల చైనాలో కరోనా వైరస్‌తో సంభవించిన మరణాలను విశ్లేషిస్తే గుండెజబ్బులతో బాధపడుతున్నవారు దీనివల్ల ఎక్కువగా ప్రభావితమైనట్లు తేటతెల్లమవుతోంది. చైనాలోని వైద్యపరిశోధకులు, అధ్యయనవేత్తలు కరోనా వైరస్ బారిన పడ్డ 72,000 మందిని పరిశీలించగా... గుండెజబ్బులు ఉన్నవారిలో 10.5% మంది మృతి చెందినట్లు తెలిసింది. ఈ వివరాలు వినగానే గుండెల్లో గుబులు పుట్టాల్సిన అవసరమేమీ లేదు. ఎందుకంటే... దాదాపు 90% మంది (కచ్చితంగా చెప్పాలంటే 89.5% మంది) గుండెజబ్బులు ఉన్నవారు మళ్లీ పూర్తిగా కోలుకున్నారు. అయితే మిగతా జబ్బులతో బాధపడుతున్నవారి కంటే వీరి సంఖ్య కాస్తంత ఎక్కువ. అలాగే డయాబెటిస్‌తో బాధపడుతున్న వారిలో 7.3% మంది మృత్యువు పాలయ్యారు. ఇక్కడ కూడా ఇదే భరోసా వర్తిస్తుంది. అంటే డయాబెటిస్ ఉన్నప్పటికీ 93% మంది సురక్షితంగా ఉన్నారు. ఇక ఆ తర్వాతి స్థానంలో ఆస్తమా రోగులు ఉన్నారు. మొత్తం ఆస్తమా రోగులు లేదా ఇతర శ్వాసకోశవ్యాధులతో బాధపడుతున్నవారిలో 6.3% మంది మరణించారు. విచిత్రం ఏమిటంటే... శ్వాసకోశ సమస్య ద్వారా ప్రమాదాన్ని తెచ్చిపెట్టే కోవిడ్-19 బారిన పడి మృతి చెందిన వారిలో గుండెజబ్బులు, డయాబెటిస్‌తో బాధపడే వారి తర్వాతి స్థానంలోనే ఆస్తమా రోగులు ఉన్నారు. ఆ తర్వాతి స్థానాల్లో హైపర్‌టెన్షన్ (హైబీపీ)తో బాధపడేవారిలో మృత్యువు పాలైనవారు 6% మంది, క్యాన్సర్‌తో బాదపడుతున్నవారిలో 5.6% మంది ఉన్నారు. ఇక ఏ జబ్బూ లేని ఆరోగ్యవంతుల్లో ఈ వ్యాధి బారినపడి మరణించిన వారు కేవలం 0.9% మంది మాత్రమే. అంటే ఒక శాతం కంటే కూడా తక్కువేనన్నమాట.

ఈ గణాంకాల వల్ల తెలిసే విశేషం ఏమిటంటే... మనం అత్యంత అప్రమత్తంగా ఉంటే చాలు... అప్పటికే ఏవైనా జబ్బులతో బాధపడుతూ ఉన్నప్పటికీ, మన వ్యాధి నిరోధకత బాగుంటే మనకు ఎలాంటి ప్రమాదమూ జరగకపోవడానికే అవకాశాలు ఎక్కువ. అందుకే అనవసరమైన ఆందోళనలు వదిలేసి, వ్యాధినిరోధక శక్తి పెంపొందేలా మంచి ఆహారం, ఆరోగ్యకరమైన జీవనశైలిని అనుసరిస్తే చాలు. మనం సురక్షితమే అంటున్నారు నిపుణులు.

పరిచయం చింతకింది నర్సవ్వ

అవ్వ దాచిన అపురూప చీర

చీనీ చీనాంబరాలు, పట్టు పీతాంబరాలు అనే మాట విని ఉంటాం.
కానీ పీతాంబరాలను ఈ తరం చూసి ఉండకపోవచ్చు.
ఎందుకంటే దాదాపు అంతరించిపోయాయి.
అయితే వందేళ్ల కిందటి ఆ భారతీయ వస్త్ర కళావైభవానికి ఒక్క ఆనవాలు అయినా దొరక్కపోతుందా అనే ఆశ. దొరుకుతుందిలే అనే ఓ నమ్మకం.
చివరికి ఆ నమ్మకమే గెలిచింది.
తెలంగాణ జిల్లాలన్నింటినీ దుర్భిణీ వేసి గాలించగా జనగామ్‌లో దొరికిందా పీతాంబరం.
ఆ పీతాంబరధారి చింతకింది నర్సవ్వ.

నర్సవ్వ పుట్టింది పెరిగింది జనగామ్‌లో. అత్తగారిల్లు కూడా అదే. వాళ్లది ఒక మోస్తరు సంపన్న కుటుంబమే. నర్సవ్వకు ఎదురింట్లో ఉన్న ఉప్పలయ్యతో పెళ్లైంది. నర్సవ్వ మామగారు ఆగయ్య.. కోడలికి పెళ్లికి పీతాంబరం చీర పెట్టాడు. పట్టుదారం, వెండి జరీతో తయారు చేసిన చీర ఇది. నర్సవ్వ పెళ్లి జరిగింది 1953లో. అప్పటికి నర్సవ్వ వయసు పదకొండేళ్లు. అంటే 67 ఏళ్ల కిందటిది ఈ పీతాంబరం చీర. చీర బరువు ఎంతో తెలుసా? ఒక కిలో ఆరు వందల గ్రాములు. అప్పుడు ఈ చీర ధర నలభై రూపాయలు. చీరలో 650 గ్రాముల వెండి ఉంది. యాదాద్రి భువనగిరి జిల్లాలోని రాజంపేట నేతకారుల నైపుణ్యానికి ప్రతీక ఈ చీర. 'నా మామ ఆగయ్య అప్పట్లో కౌన్సిలర్, పద్మసాలి సంఘం జిల్లా అధ్యక్షుడు కూడా కావడంతో జిల్లాలో ఎక్కడ ఎలాంటి పనితనం ఉందో ఆయనకు బాగా తెలుసు. అందుకే నా పెళ్లికి అంత గొప్ప చీరను తెప్పించాడ'ని చెప్పింది నర్సవ్వ.

ఉతకు లేదు.. ఇస్త్రీ లేదు

పీతాంబరాన్ని ఇన్నేళ్లుగా నీటిలో ముంచలేదని చెప్పింది నర్సవ్వ. ''చీర కట్టుకుని తీసిన తర్వాత ఒక రోజంతా గాలికి ఆరవేయాలి. చక్కగా చేత్తో సాపు చేసి, మెత్తటి నూలు గుడ్డలో చుట్టి పెట్టెలో పెట్టేదాన్ని. లోపల ధోవతి కట్టుకుని, పైన చీరకట్టేట్లోళ్లం. చీరను ఇస్త్రీ కూడా చేయలేదు. అయినా సరే ఎక్కడా ముడత పడలేదింత వరకు. నా పెద్ద కూతురు ఈ చీరిమ్మని అడిగింది. కానీ 'నేనివ్వ' అని చెప్పా. కావాలంటే కట్టుకోండి.. మళ్లీ తెచ్చి నా పెట్టెలో పెట్టండి. అంతే తప్ప ఎవరికీ ఇచ్చుడు లేదు. నా పానం పోయిన తర్వాత నా మీద ఈ చీరనే కప్పాలి అని గట్టిగా చెప్పాను. మా పెద్ద కోడలు ఒకసారి బతుకమ్మ ఆడడానికి ఈ చీర కట్టుకున్నది. 'ఇంత బరువు నా వల్ల కాద'ని మళ్లీ ఆ చీరను ముట్టుకోలే. కోడళ్లు, కూతుళ్లలో ముగ్గురు కట్టిన్రు. ఇక ఇద్దరు కట్టుకోవాలె. నా కళ్ల ముందే కట్టుకుని చూపించండంటే వాళ్లకు పట్టడమే లేదు'' అని చెప్పింది నర్సవ్వ.

తెలంగాణ సంస్కృతిలో భాగం ఈ పీతాంబరం. ధర ఎక్కువ కావడంతో సంపన్న కుటుంబాలకు మాత్రమే అందుబాటులో ఉండేది. ఈ చీర ప్రస్థానం పెళ్లితో మొదలై అంత్యక్రియలతో ముగుస్తుంది. అందువల్లనే ఈ చీరలు ఆనవాలుకు కూడా మిగలకుండా అంతరించి పోయాయి. తెలంగాణ ప్రభుత్వం ఆ చీరలను పునరుద్ధరించడానికి కంకణం కట్టుకుంది. ఆ ప్రయత్నంలో నర్సవ్వ పీతాంబరం చీర వెలుగు చూసింది.

– వాకా మంజులారెడ్డి

పల్లకీలో ఊరేగాను

నా పెళ్లికి మా మామ పెట్టిన ఇరవై తులాల బంగారు నగలు ధరించి, ఈ పీతాంబరం చీర కట్టుకుని నా భర్తతో కలిసి పల్లకీలో ఊరేగాను. ఆ తరవాత నోములకు, బంధువుల పెళ్లిళ్లకు కట్టుకునేదాన్ని. నా ఇద్దరు కొడుకులు, ముగ్గురు బిడ్డల (కూతుళ్లు) పెళ్లిళ్లకూ కట్టుకున్నాను. ఈ చీరతో ఎక్కడికి వెళ్లినా అందరూ చీర గురించి మాట్లాడుడే. మా ఆయనతోపాటు అన్ని వేడుకల్లోనూ దంపతుల గౌరవాన్ని అందుకున్నది ఈ చీరతోనే. ఆయన పోయి ఇరవై మూడేళ్లయింది. ఇక ఆ చీరను ముట్టనేలేదు. ఇప్పుడు మళ్లీ సర్కారోళ్లు వచ్చి ఇలాంటి పీతాంబరాల్ని మళ్లీ నేయిస్తామని చీరను ఓసారి నాకు కట్టబెట్టి, పట్టుకెళ్లారు. కేసీఆరు, కేటీఆరు గిట్లంటి వాటిని చేయించమని పట్టుపడుతున్నరంట.

– నర్సవ్వ

ఈ సంస్కృతి తమిళనాడులోనూ ఉంది

సిద్దిపేట, మెదక్ జిల్లాల్లోని నేతకారులు వెండి జరీ చీరలను ఎక్కువగా నేసేవారు. అవి బనారస్ చీరల్లాగ ఉంటాయి. ముదురు గులాబీరంగులోనే నేసేవారు. సుమంగళిగా పోయినప్పుడు ఆ మహిళకు అంతిమ సంస్కారాలను కూడా ఆ చీరతోనే నిర్వహించేవారు. ఈ సంస్కృతి ఉత్తర తెలంగాణతోపాటు తమిళనాడులోని కొన్ని ప్రాంతాల్లో కూడా ఉంది. అక్కడ కూడా ఇదే రంగు చీరను తొమ్మిది గజాల్లో నేస్తారు. ఇక్కడ ఉన్నట్లే తమిళనాడులో కూడా పెళ్లి చీరతోనే కర్మకాండలు నిర్వహించే ఆచారం ఉంది. మేమిప్పుడు పీతాంబరం చీరతోపాటు హిమ్రూ వస్త్రాలను పునరుద్ధరించడానికి కూడా ప్రయత్నాలు మొదలు పెట్టాం. హిమ్రూ వస్త్రాలు రెండు వైపులా ఒకే రకంగా ఉంటాయి. వీటి నేతకు ప్రత్యేకమైన నైపుణ్యం కావాలి. వస్త్రాలను నిజాం కాలంలో రాజులు, రాజ కుటుంబీకులు ధరించేవారు. ఔరంగాబాద్‌లో నేసేవారు. మన దగ్గర వరంగల్‌లో కార్పెట్ తయారీదారులకు ఈ హిమ్రూ నేతలో శిక్షణనిప్పిస్తున్నాం. ఇక హిమ్రూ వస్త్రాలను మన దగ్గరే తయారు చేయిస్తాం.

– శైలజా రామయ్యర్, ఐఏఎస్,
డైరెక్టర్, హ్యాండ్‌లూమ్ అండ్ టెక్స్‌టైల్స్ అండ్ అపారెల్ ఎక్స్‌పోర్ట్ పార్క్స్ (ఎఫ్ఏసీ)

మన దేశపు యోగ ఆ దేశపు గురువు



ఉక్రెయిన్ దేశానికి చెందిన ఆర్టెమ్ మైనానెన్కో మన దేశపు యోగా పట్ల ఆకర్షితుడై మహా యోగసాధకుడిగా మారాడు. ప్రపంచదేశాలలో యోగాను ప్రచారం చేస్తున్నాడు.

ఏ దేశంలో జన్మిస్తేనేం మన దేశ సంస్కృతి, సంప్రదాయాల పట్ల ఆకర్షితుడైనాడు. కులం, మతం ఏదైనా మన పురాణేతిహాసాలను ఔపోసన పట్టాడు. వాటిల్లోని అంతరార్థాన్ని యోగాలో మేళవించి ప్రపంచదేశాలకు చాటి చెప్పాలని లక్ష్యంగా పెట్టుకున్నాడు. అతనే ఉక్రెయిన్ దేశానికి చెందిన యోగా గురువు ఆర్టెమ్ మైరానెన్కొ. ప్రస్తుతం భారత్‌లో పర్యటిస్తూ చెన్నైకు చేరుకుని యోగా తరగతులు నిర్వహిస్తున్న ఆర్టెమ్ మైరానెన్కొను 'సాక్షి' పలకరించింది. 28 ఏళ్ల వయస్సులోని తన జీవన గమనాల గురించి ఇలా చెప్పుకొచ్చాడు.

'నేను మా దేశంలో 'ఆత్మమార్గ్' పేరుతో యోగ శాల స్థాపించాను. మా అమ్మ ట్రిని ఉక్రెయిన్‌లో ఆయుర్వేద వైద్యురాలు. ఆమె తన 19వ ఏట నుంచే ఇస్కాన్ ఆధ్యాత్మిక కార్యక్రమాలకు అంకితమైంది. ఆధ్యాత్మికత ఉన్న కొడుకు పుట్టాలని గర్భిణిగా ఉన్నప్పుడు ఇస్కాన్ ఆశ్రమం, మందిరానికి వచ్చే భక్తులకు సేవలు అందించేది. నేను పుట్టాక ఇస్కాన్ మందిరం, ఆశ్రమాలకు వెళ్లేపుడు తప్పనిసరిగా వెంట తీసుకుని వెళ్లేది.

దాంతో నేను ఆరేళ్ల ప్రాయం నుంచే వేదమంత్రాలు నేర్చుకోవడం ప్రారంభించాను. 6వ తరగతి చదువుతున్నపుడు అమ్మతో కలిసి భారత్‌లోని పుణ్యక్షేత్రాలను సందర్శించాను. ఇస్కాన్ వ్యవస్థాపకులు చైతన్య మహాప్రభు ప్రబోధలు నన్ను ఎంతో ప్రభావితం చేశాయి. హఠయోగ ప్రదీపన, ఘిరంద సంహిత పుస్తకాలు చదివాను. 12వ ఏట ఇస్కాన్‌లో ఉండగానే భక్తి యోగ, జ్ఞానయోగ, కర్మయోగ, రాజయోగాలను అధ్యయనం చేశాను. స్వామి శివానంద పుస్తకాలు చదివాను. నేను చదివిన పురాణాలు, ఇతర ఆధ్యాత్మిక రచనలపై ఒకటిన్నర ఏడాదిపాటూ అధ్యయనం చేశాను. దైనందిన జీవితంలో అందరూ ఎంతో తపన పడే ఆస్తి, అంతస్తు, ధనం, సంసార బంధం ఏవీ వెంట రావని చిన్నతనంలోనే అర్థం చేసుకున్నాను. ప్రాపంచిక సుఖాలు అశాశ్వతం, ఆధ్యాత్మిక తత్వమే ముక్తికి మార్గం అని అర్థమైంది. తొలిరోజుల్లోనే అద్భుతమైన అనుభవాలను చవి చూసాను.

యోగా అంటే వ్యాయామం కాదు

యోగా వల్ల మానసిక పరిణితి సాధించకుంటే కేవలం ఆరోగ్య సాధనగానే మిగిలిపోతుంది. యోగా వల్ల మానవుడు దేవుడు కావచ్చు. యోగా మనిషిని అంతర్ముఖులను చేయాలి. మానవ జన్మలోని పరమార్థాన్ని తెలుసుకోగలగాలి. యోగా అంటే మాయలు, మహిమలు కావు. మీలో అంతర్లీనమై ఉన్న అతీతమైన శక్తిని వెలికి తీయడమే. కళ్లు అనేవి లెన్స్ వంటివి. బాహ్యప్రపంచాన్ని మాత్రమే కాదు అంతర్ముఖంగా నీలో నిగూఢమై ఉన్న మంచిని చూడగలగాలి. దాన్ని ఆచరణలో పెట్టడం ద్వారా సమాజానికి మేలు చేయాలి. దృష్టి, ఆసనం ఒకటిగా ఉండాలి. అవి వేర్వేరుగా ఉన్నపుడు అది కేవలం ఒక వ్యాయామంగా మాత్రమే ఉపయోగ పడుతుంది. యోగా అభ్యసించడంలో ఆహారపు అలవాట్లు మార్చుకోవడం ఎంతో ముఖ్యం. యోగా వల్ల మానసిక పరివర్తన రావాలి. యోగాలోని అంతరార్థం, పరమార్థం తెలుసుకోకుండా కొందరు ఆచరిస్తున్నారు. కొన్ని యోగా కేంద్రాల్లో సైతం సరైనమార్గం బోధించకుండా కేవలం శిక్షణాకేంద్రాలుగా మారుస్తున్నారు. దురదృష్టవశాత్తు యోగాపై కొందరు మిడిమిడి జ్ఞానంతో కొత్త కొత్త భాష్యాలు చెబుతున్నారు. యోగాలో ఎన్నో క్లిష్టతరమైన ఆసనాలు అందరికీ సాధ్యమే. కానీ అందరికీ అవసరం మాత్రం కాదు. స్పిరిట్చువల్ ఫోకస్ లేని వారు కూడా యోగావల్ల సత్ఫలితాలు అందుకుంటారు. ఒకప్పుడు ఇది హిందువులకు మాత్రమే అనుకునేవారు. కానీ కాలక్రమేణా సర్వమత సంప్రదాయంగా విస్తరిస్తోంది. అసలైన అనుసరణీయమైన యోగాను ప్రజలకు చాటిచెప్పాలని 18 ఏళ్ల వయస్సులోనే శిక్షణలు ఇవ్వడం ప్రారంభించాను. ప్రపంచమంతా పర్యటించాలి. యోగా ఆవశ్యకతలను అందరికీ చాటాలనేదే నా లక్ష్యం.

– కొట్రా నందగోపాల్,
సాక్షి ప్రతినిధి, చెన్నై



లైఫ్

డ్రైవర్ కల్పన

బస్సును నడుపుతున్న కల్పన

కోల్‌కతాలో బస్సు నడపడం అంత తేలికైన పనికాదు. ఇరుకైన రోడ్లు, ట్రాఫిక్, రద్దీగా ఉండే నివాస-మార్కెట్ ప్రాంతాలు.. ప్రతి ట్రిప్‌ని కష్టంగా మారుస్తాయి. అయినా సరే ఆ వీధుల్లో పీ.. పీ.. పీ.. అని హారన్ కొడుతూ ఒడుపుగా స్టీరింగ్ తిప్పుతూ బస్సు నడుపుతోంది బక్కపల్చగా ఉన్న ఓ యువతి. ఆమె పేరు కల్పనా మొండల్. వయసు 21. ఆమెను చూసిన ప్రయాణికులు ఒక మహిళ అయి ఉండి బస్సు ఎలా నడిపిస్తుంది అని ఆసక్తిగా తెలుసుకునే ప్రయత్నం చేస్తుంటారు. ఇంతకీ ఎవరీ కల్పన? ఆమె ఎందుకు బస్సు నడిపిస్తోంది?

కల్పనా మొండల్ గురించి మనకు పెద్దగా తెలియదు. కానీ, సోషల్ మీడియాలో బాగా ప్రాచుర్యం పొందిన బస్సు డ్రైవర్. కోల్‌కతా శివారులోని నోసారిలో కల్పన కుటుంబం ఉంది. ఆర్థిక పరిస్థితుల కారణంగా తను చదువుకోలేదు. కుటుంబంలో నలుగురు సభ్యులు. అక్క, తల్లి, తండ్రి, తను. అందరూ ఇంటిలాంటి ఒక గదిలో ఉంటున్నారు. కల్పన తండ్రి సుభాష్ ప్రైవేట్ బస్సు డ్రైవర్‌గా పని చేసేవాడు. చిన్నప్పుడు తండ్రికి సాయంగా ఉండటానికి తరచూ కల్పన కూడా బస్సులో వెళ్లేది. తండ్రి రోజుకు రెండు రూపాయలు ఇచ్చేవాడు. ఆ డబ్బులతో కల్పన మిఠాయి కొనుక్కొనేది. బస్సు డ్రైవింగ్ చేయగా వచ్చే తండ్రి ఆదాయంతోనే నడిచే ఆ కుటుంబం ఓ రోజు పెద్ద కుదుపుకు లోనయ్యింది.

తండ్రికి ధైర్యం చెప్పి..

రెండేళ్ల క్రితం కల్పన తండ్రి ప్రమాదానికి గురయ్యాడు. ఆ ప్రమాదంలో రెండు కాళ్లకు ఆపరేషన్ అయ్యి మెటల్ ప్లేట్స్ వేశారు. కుటుంబం గడిచే పరిస్థితి లేక కల్పన తనే కుటుంబాన్ని పోషించాలని నిర్ణయించుకుంది. 'డ్రైవింగ్ నేర్చుకొని ముందు కాలనీలోనే ట్రక్కులు నడిపేది. గోడౌన్లకు లోడు చేర్చేది. మేజర్ అయిన తర్వాత లైసెన్స్ తీసుకొని బస్సు నడపడం నేర్చుకుంది. నాకు వెన్నుదన్నుగా నిలిచింది' అంటూ కూతురు గురించి గొప్పగా ఉత్సాహంగా చెబుతూ ఉంటాడు సుభాష్, 'ఆపరేషన్ అయ్యాక మేటల్ ప్లేట్స్ కారణంగా నా కాళ్లను వంచలేకపోయాను. దీంతో మానసికంగా చాలా కృంగిపోయాను. అలాంటి సమయంలో నా కూతురు కల్పన హామీ ఇచ్చింది నేను కుటుంబాన్ని నడుపుతాను అని. అప్పటికే చుట్టుపక్కల కాలనీలలో రాత్రిపూట కొన్నాళ్లపాటు డ్రైవింగ్ నేర్చుకుంటూ ప్రయత్నించింది. బాగా నేర్చుకున్నప్పటికీ 34సి మార్గంలో (ఎస్‌ప్లానేడ్-బరానగర్) బస్సు యజమాని కల్పనకు బస్సు ఇవ్వడానికి అంగీకరించలేదు. ఎందుకంటే అది చాలా రద్దీ రూటు. వాళ్లు అంగీకరించేవరకు ప్రయత్నించి సాధించింది. అప్పుడు తిరస్కరించినవాళ్ల బస్సునే ఆమె ఇప్పుడు చాకచక్యంగా నడపడం చూస్తుంటే నాకు గర్వంగా ఉంది. కుటుంబ శ్రేయస్సు కోసం తన భవిష్యత్తు త్యాగం చేసింది నా తల్లి కల్పన' అంటూ కూతురి గొప్పతనం చెబుతాడు సుభాష్. తల్లి మంగళ మాట్లాడుతూ -'మొదట్లో తండ్రి (సుభాష్) కల్పన వెనకాల కూర్చొని సూచనలు ఇస్తూ ఉండేవాడు. కానీ, ఎప్పుడూ తన చేతిని పట్టుకొని నేర్పలేదు' అంటారు ఆమె.

టైర్ చెక్ చేస్తూ...

పోలీసులు సెల్ఫీలు తీసుకుంటారు!

ఇక కల్పన మాట్లాడుతూ 'ట్రాఫిక్ పోలీసులు నన్ను రద్దీ దారుల్లో నడపమని ప్రోత్సహిస్తుంటారు. ఇంకొంతమంది నాతో సెల్ఫీలు దిగి ఆసక్తిగా నా గురించి అడుగుతుంటారు' అంటుంది. అంతేకాదు, ఇప్పుడామెకు డ్రైవింగ్ స్కూల్ పెట్టుకోవడానికి కూడా అనుమతి వచ్చింది. ''ప్రయాణీకులు కొందరు బస్సు ఎక్కినప్పుడు ముందు నన్ను చూడరు. కానీ, ఆ తర్వాత నేను ఓ మహిళనని గమనించి ఆసక్తిగా చూస్తూ ఉండటాన్ని నేను నా డ్రైవింగ్ సీట్ నుంచే అద్దంలో చూసి తెలుసుకుంటుంటాను' సంబరంగా చెబుతుంది కల్పన.

కనీసం పదోతరగతి కూడా పాస్‌కాని కల్పన ఇప్పుడు ప్రైవేట్‌గా చదువుకొని పదవ తరగతి పరీక్షలు రాయాలనుకుంటోంది. 'అప్పుడైతే ప్రభుత్వంలో డ్రైవర్ పోస్ట్ కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. నా తండ్రి కలనే నేను నెరవేర్చాలనుకుంటున్నాను' అని ఉత్సాహంగా చెబుతుండటం చూస్తుంటే ముచ్చటేస్తుంది.

కుటుంబానికి కష్టం వస్తే పెద్దవాళ్లు చూసుకుంటారులే అనుకోకుండా తానే కుటుంబానికి అండగా నిలబడ్డ కల్పన తన తోటి అమ్మాయిలకే కాదు, యువకులకూ రోల్‌మోడల్.

– నిర్మలారెడ్డి చిలకమర్రి

సాక్షి భవిత
సోమవారం నుంచి శుక్రవారం వరకు
స్వర్థయా వర్ధతే విద్య
సోమవారం
16-3-2020

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

ఇన్‌స్టిట్యూట్ స్థాయిలో పరిశోధనలకు ఎంహెచ్‌ఆర్‌డీ ప్రోత్సాహం

టెక్నికల్ నుంచి ట్రెడిషనల్ ఇన్‌స్టిట్యూట్స్ వరకు అన్నింటికీ అవకాశం

కెరీర్ కౌన్సెలింగ్ Q A

» ఎంటెక్ సాఫ్ట్‌వేర్ ఇంజనీరింగ్ పూర్తిచేశాను. ఐటీలో స్థిరపడాలంటే.. తాజా ట్రెండ్స్‌కు అనుగుణంగా నేర్చుకోవాల్సిన టాప్ ఐటీ కోర్సులేవో తెలపండి? –అనూష

✦ ప్రస్తుతం జాబ్ మార్కెట్‌లో.. జాబ్ ఓరియెంటెడ్ కోర్సులకు ప్రాధాన్యం పెరిగింది. కంపెనీలకు కావాల్సిన నైపుణ్యాలే లక్ష్యంగా ఆయా కోర్సులు అందిస్తుండటమే దీనికి ప్రధాన కారణం. ఎంటెక్ సాఫ్ట్‌వేర్ ఇంజనీరింగ్ పూర్తి చేసిన వారికి పలు ఐటీ కోర్సులు అందుబాటులో ఉన్నాయి. ఆయా కోర్సుల వ్యవధి రెండు నెలల నుంచి ఏడాదిన్నర వరకు ఉంటుంది. ఐటీలో స్థిరపడాలనుకొనే అభ్యర్థులు ఆయా కోర్సుల్లో చేరడం లాభిస్తుంది. ఈ దిశగా వెబ్‌సైట్ అడ్మిన్ ప్లస్(డబ్ల్యూ ఎంపీ), వెబ్ ప్రీమియం-అడ్వాన్స్‌డ్ యూఐ డెవలప్‌మెంట్, రెస్పాన్సివ్ వెబ్ డిజైన్ మాస్టర్, జావా స్క్రిప్ట్ మాస్టర్ అండ్ జావా స్క్రిప్ట్ మాస్టర్ ప్లస్, హెచ్‌టీఎంఎల్ 5 అండ్ సీఎస్‌ఎస్3 మాస్టర్, బూట్‌స్ట్రాప్ మాస్టర్, జేక్వెరీ మాస్టర్, నోడ్ జేఎస్ మాస్టర్ కోర్సులకు ప్రస్తుతం జాబ్ మార్కెట్‌లో డిమాండ్ ఉంది.

» అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ నుంచి బికామ్ పూర్తిచేశాను. ఇప్పుడు నాకు అందుబాటులో ఉన్న ఉన్నత విద్య, ఉద్యోగావకాశాల గురించి చెప్పండి?

✦ బీకామ్ తర్వాత ఉన్నత విద్య పరంగా ఎంకామ్‌లో చేరొచ్చు. ఈ కోర్సు అన్ని వర్సిటీలు, కాలేజీల్లో అందుబాటులో ఉంది. ఇందులో ప్రవేశాలకు వర్సిటీలు ప్రవేశ పరీక్షలు నిర్వహిస్తాయి. సదరు ఎంట్రెన్స్ టెస్టులో మంచి ర్యాంకు పొందితే క్యాంపస్ కాలేజీల్లో ఎంకామ్ పూర్తి చేసే అవకాశం దక్కుతుంది. ఎంకామ్‌లో చేరడం ఇష్టం లేని వాళ్లు ఎంబీఏ వైపు వెళ్లొచ్చు. దీనికి రాష్ట్ర స్థాయిలో నిర్వహించే ఐసెట్‌కు హాజరవ్వాల్సి ఉంటుంది. ఎంబీఏ, ఎంకామ్ చదివే ఆర్థిక స్థోమత లేకుంటే.. టాలీ, అకౌంటింగ్ తదితర షార్ట్‌టర్మ్ కోర్సులను నేర్చుకోవచ్చు. ఎంకామ్ పూర్తి చేసిన వారికి అకౌంట్స్, బోధనా రంగంలో ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయి. ఎంబీఏ పూర్తిచేసిన వారికి ఫైనాన్స్, మార్కెటింగ్‌తోపాటు పలు విభాగాల్లో ఉద్యోగ అవకాశాలు ఉంటాయి.

ఎక్స్‌క్లూసివ్

సెంటర్స్ ఆఫ్ ఎక్స్‌లెన్స్

పరిశోధనలకు ప్రోత్సాహం

జాతీయ స్థాయిలో ఎన్నో ఇన్‌స్టిట్యూట్‌లు.. వాటిలో వేల మంది విద్యార్థులు.. వందల సంఖ్యలో ఫ్యాకల్టీ సభ్యులు! వారిలో..పరిశోధనల పట్ల ఆసక్తి ఉన్న వారు ఎందరో! సామాజిక, సాంకేతిక సమస్యలకు.. తమ పరిశోధనల ద్వారా పరిష్కారం కనుగొనాలని.. దానిద్వారా ప్రగతికి తోడ్పడాలని భావించే వారు మరెందరో! ఇలాంటి వారికి ఎదురవుతున్న ప్రధాన సమస్య.. సదుపాయాల లేమి.. ఆర్థిక ప్రోత్సాహకాలు లేకపోవడం! దాంతో పరిశోధనలపై ఆసక్తి ఉన్నా.. ఆర్థిక సమస్యల కారణంగా ముందడుగు వేయలేకపోతున్న వైనం. వీరికోసం కేంద్ర మానవ వనరుల మంత్రిత్వ శాఖ రూపొందించిన పథకమే...సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్! ఈ నేపథ్యంలో.. సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్ ప్రధాన ఉద్దేశం, ప్రతిపాదనలు, దానిద్వారా ప్రోత్సాహకాలు పొందడం ఎలా? తదితర అంశాలపై విశ్లేషణ..

ఫాస్ట్ అంటే

ఇన్‌స్టిట్యూట్ స్థాయిలో పరిశోధనలు చేయాలనుకునే వారికి ప్రోత్సాహం అందించడమే ఈ పథకం ముఖ్య ఉద్దేశం. ఇందుకోసం ఇన్‌స్టిట్యూట్‌ల ప్రమాణాలు, సదుపాయాలను పరిగణనలోకి తీసుకుంటూ.. ఎంపికైన ఇన్‌స్టిట్యూట్‌కు సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్ హోదా కల్పిస్తోంది. ఎంహెచ్‌ఆర్‌డీ ప్రారంభించిన సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్ ప్రధాన ఉద్దేశం.. ఇన్‌స్టిట్యూట్ స్థాయిలో అత్యున్నత స్థాయి పరిశోధకుల బృందం నిర్దిష్టంగా ఒక అంశంపై పరిశోధనలు కొనసాగించడం. ఇందుకోసం ట్రైనింగ్ అండ్ రీసెర్చ్ ఇన్ ఫ్రాంటియర్ ఏరియాస్ ఆఫ్ సైన్స్ టెక్నాలజీ (ఫాస్ట్) పేరుతో ఈ పథకాన్ని ప్రారంభించింది.

అయిదు రకాలుగా విభజన

సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను నిర్ణయించే విషయంలో ఎంహెచ్‌ఆర్‌డీ.. మొత్తం అయిదు రకాలుగా ఇన్‌స్టిట్యూట్‌లను, యూనివర్సిటీలను పేర్కొంది. ఇందులో టెక్నికల్ ఇన్‌స్టిట్యూట్స్, ట్రెడిషనల్ యూనివర్సిటీలు అన్నీ ఉన్నాయి. టెక్నికల్ ఇన్‌స్టిట్యూట్స్ పరంగా.. టెకిప్ (టీఈక్యూఐపీ) విధానంలో, ఫాస్ట్ విధానంలో ఇన్‌స్టిట్యూట్‌లను వర్గీకరించింది. అదే విధంగా సంప్రదాయ కోర్సుల పరంగా.. యూనివర్సిటీస్ విత్ పొటెన్షియల్ ఫర్ ఎక్స్‌లెన్స్, సెంటర్స్ విత్ పొటెన్షియల్ ఫర్ ఎక్స్‌లెన్స్ ఇన్ పర్టిక్యులర్ ఏరియా, కాలేజెస్ విత్ పొటెన్షియల్ ఎక్స్‌లెన్స్ పేరుతో వర్గీకరించింది.

నాలుగు విభాగాలకు ప్రాధాన్యం

సెంటర్స్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ స్కీమ్‌లో భాగంగా ఒక ఇన్‌స్టిట్యూట్‌కు ఆ హోదా ఇవ్వాలంటే.. సదరు ఇన్‌స్టిట్యూట్ నిర్దిష్టంగా కొన్ని విభాగాల్లో పరిశోధనలపై ప్రత్యేక దృష్టి సారించాల్సి ఉంటుంది. ప్రస్తుతం వెలుగులోకి వస్తున్న కొత్త టెక్నాలజీ, జాతీయ వృద్ధి లక్ష్యాలకు సరితూగే మల్టీ డిసిప్లినరీ, ట్రాన్స్‌షనల్ రీసెర్చ్ కార్యకలాపాలు నిర్వహించాల్సి ఉంటుంది. సెంటర్స్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ ద్వారా రీసెర్చ్ యాక్టివిటీస్‌కు ప్రోత్సాహం ఇచ్చే దిశగా నాలుగు విభాగాలకు ప్రాధాన్యం ఇస్తోంది. అవి.. ఎనర్జీ, వాటర్, క్లీన్ ఎన్విరాన్‌మెంట్, స్మార్ట్ మెటీరియల్స్.

ఇన్‌స్టిట్యూట్ ఎంపిక ఎలా

ఒక ఇన్‌స్టిట్యూట్‌ను సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్‌గా ఎంపిక చేసేందుకు పలు అంశాలను ఎంహెచ్‌ఆర్‌డీ పరిగణనలోకి తీసుకుంటుంది. నిర్దిష్ట ఇన్‌స్టిట్యూట్‌లో అప్పటికే ఆర్ అండ్ డీ విభాగాల్లో కీలకంగా వ్యవహరిస్తూ ఉండాలి. అదే విధంగా రీసెర్చ్ ఫలితాలను వాస్తవ పరిస్థితుల్లో అమలు చేయడంలో ప్రగతి, కొలాబరేటివ్, స్పాన్సర్డ్ రీసెర్చ్, ప్రముఖ జాతీయ, అంతర్జాతీయ జర్నల్స్, కాన్ఫరెన్స్‌లలో ప్రచురణలు సమర్పించడం.. అప్పటికే ఇన్‌స్టిట్యూట్ పొందిన పేటెంట్స్, ఇన్నోవేషన్స్.. ఇన్‌స్టిట్యూట్ స్థాయిలో పరిశోధనల ద్వారా రూపొందిన వాణిజ్య ఉత్పత్తులు.. పీజీ, పీహెచ్‌డీ స్థాయిలో ఎన్‌రోల్‌మెంట్స్‌ను కూడా పరిగణనలోకి తీసుకుని.. సదరు ఇన్‌స్టిట్యూట్‌కు సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ హోదా ఇవ్వాలా?వద్దా?అనే నిర్ణయం తీసుకుంటుంది.

నిధుల మంజూరు

సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్‌గా ఎంపికైన ఇన్‌స్టిట్యూట్‌లు, వాటిలో పరిశోధన విభాగాలకు నిధులు మంజూరు చేసే క్రమంలో.. పరిశోధనలు, ప్రతిపాదనల ఆధారంగా ఆయా మొత్తాలను నిర్ణయిస్తుంది. దీనిద్వారా అప్పటికే చేస్తున్న పరిశోధనలను మరింత ముందుకు తీసుకెళ్లడానికి వీలు కలుగుతుంది. ఇప్పటికే సాంకేతిక విభాగాల్లో టెకిప్-2 కింద నిధులు పొందుతున్న ఇన్‌స్టిట్యూట్‌లకు ఈ అవకాశం లభించదు.

ప్రతిపాదనలు

ప్రతిపాదనల ఎంపిక పరంగా.. పలు ప్రామాణికాలను ఎంహెచ్‌ఆర్‌డీ నిర్దేశించింది. ప్రతిపాదనల అమలు సాధ్యాసాధ్యాలు, నిర్దిష్ట ప్రతిపాదన జాతీయ వృద్ధి లక్ష్యాలకు అనుగుణంగా ఉందా లేదా? చూస్తుంది. ఇన్‌స్టిట్యూట్ స్థాయిలో వ్యక్తమైన సంసిద్ధత, కొలాబరేషన్‌లను పరిశీలిస్తుంది. అలాగే పరిశోధనల వ్యయానికి సంబంధించి కోరిన బడ్జెట్ మొత్తం ఎంతో చూస్తుంది. సాంకేతిక అభివృద్ధి, వాటిని ప్రోటోటైప్స్, పేటెంట్స్, పబ్లికేషన్స్‌కు అన్వయించడం, పీహెచ్‌డీ, పీజీ స్థాయిలో ఎన్‌రోల్‌మెంట్స్‌ను పరిగణనలోకి తీసుకుంటుంది.

ఇవి తప్పనిసరి

సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌గా ఒక ఇన్‌స్టిట్యూట్‌ను ఒక విభాగంలో పరిశోధనలకు ఎంపిక చేసే ముందు పలు నిబంధనలు తప్పనిసరిగా పరిశీలిస్తారు. అవి.. » ఆర్ అండ్ డీ డెవలప్‌మెంట్‌కు ఉపయోగపడే మౌలిక సదుపాయాల సేకరణ » కాంపొనెంట్స్ అండ్ సబ్ సిస్టమ్స్ సేకరణ » ప్రాజెక్ట్ స్టాఫ్ » పార్ట్ టైమ్ కన్సల్టెంట్స్ » టెస్టింగ్ అండ్ ప్రోటోటైప్ డెవలప్‌మెంట్ » డేటాకలెక్షన్, ప్రచురణ, డాక్యుమెంటేషన్ వంటి వాటిని సదరు ఇన్‌స్టిట్యూట్.. ఎంహెచ్‌ఆర్‌డీకి తెలియజేయాల్సి ఉంటుంది. వీటితోపాటు మరికొన్ని అంశాలు కూడా ఒక ఇన్‌స్టిట్యూట్‌కు సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌గా దరఖాస్తు చేసుకునేందుకు తప్పనిసరి. అవి.. » జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఇతర రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్స్‌తో కలిసి పని చేయడం » కెపాసిటీ డెవలప్‌మెంట్ » సెమినార్స్, కాన్ఫరెన్సెస్, వర్క్‌షాప్స్, ఐఈసీ మొదలైనవి.

మార్గదర్శకాలు

నిర్దిష్టంగా ఒక ఇన్‌స్టిట్యూట్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ హోదా కోరుతూ ఏదైనా ఒక అంశంలో రీసెర్చ్ ప్రతిపాదన పంపేందుకు పలు మార్గదర్శకాలను ఎంహెచ్‌ఆర్‌డీ జారీ చేసింది. అవి.. » అంతర్జాతీయ, జాతీయ స్థాయిలో నిర్దిష్ట సాంకేతికత ప్రస్తుత పరిస్థితి » నిర్దిష్ట అంశంపై భారత పరిశ్రమ వర్గాల ఆసక్తి, భాగస్వామ్యం » రీసెర్చ్ బృందం నేపథ్యం, ఇండస్ట్రీ, ఇన్‌స్టిట్యూట్ నుంచి కొలాబరేటివ్ రీసెర్చ్ » ప్రాజెక్ట్ నిబ్బంది, పరికరాలు, పరిశోధన అవసరాల కోసం అయ్యే వ్యయాలు, కాంటింజెన్సీకి సంబంధించి వార్షిక బడ్జెట్‌లను అందించాల్సి ఉంటుంది.

ప్రతిపాదనల ఎంపిక

అన్ని రకాల నిబంధనలకు అనుగుణంగా ప్రతిపాదనలు పంపితే, వాటిని నిపుణుల కమిటీ షార్ట్ లిస్ట్ చేస్తుంది. అవసరమైతే స్టీరింగ్ కమిటీ ముందు ప్రజెంటేషన్ ఇవ్వాల్సి ఉంటుంది. ఇలా తుది దశలో ఎంపికైన వాటికి సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్ హోదా లభిస్తుంది. ప్రతిపాదించిన బడ్జెట్‌కు నూటికి నూరు శాతం ఆమోదం లభించి ఆ మేరకు నిధులు మంజూరు అవుతాయి.

తెలుగు రాష్ట్రాల్లో ఇవే

జాతీయ స్థాయిలో ఇప్పటివరకు సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్, ఫాస్ట్ (టెకిప్-2), యూనివర్సిటీస్ విత్ పొటెన్షియల్ ఫర్ ఎక్స్‌లెన్స్, సెంటర్స్ విత్ పొటెన్షియల్ ఎక్స్‌లెన్స్ ఇన్ పర్టిక్యులర్ ఏరియా, కాలేజెస్ విత్ పొటెన్షియల్ ఎక్స్‌లెన్స్ విభాగాల్లో దాదాపు మూడు వందలకు పైగా ఇన్‌స్టిట్యూట్‌లకు ఈ హోదా లభించింది. వీటిలో తెలుగు రాష్ట్రాలకు చెందిన ఇన్‌స్టిట్యూట్‌లు కూడా ఉన్నాయి.

సీఓఈతో ప్రయోజనాలు

- సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్(సీఓఈ) హోదాతో ఇన్‌స్టిట్యూట్ స్థాయిలో పరిశోధనలకు ప్రోత్సాహం లభిస్తుంది.
- పీజీ, పీహెచ్‌డీ విద్యార్థులకు రీసెర్చ్‌లో భాగస్వామ్యం లభిస్తుంది.
- కొలాబరేటివ్, స్పాన్సర్డ్ రీసెర్చ్‌కు అవకాశం మెరుగవుతుంది.
- ఆర్థిక వనరుల మంజూరవుతాయి.
- జాతీయ స్థాయిలో.. అకడమిక్ స్థాయిలోనే పరిశోధనలు నిర్వహించే అవకాశం ఉంటుంది.

అవి.. » ఆంధ్రా యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ » ఎస్‌వీయూ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ » యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ » ఉస్మానియా యూనివర్సిటీ » శ్రీ వేంకటేశ్వర యూనివర్సిటీ » ఆచార్య నాగార్జున యూనివర్సిటీ » ఆంధ్రా యూనివర్సిటీ » ఆదికవి నన్నయ యూనివర్సిటీ » ట్రిపుల్ ఐటీ హైదరాబాద్ » ఐఐటీ హైదరాబాద్ » జేఎన్‌టీయూ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ (హైదరాబాద్) » ఉస్మానియా యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ » ఎన్ఐటీ-వరంగల్, రాష్ట్రీయ సంస్కృత విద్యా పీఠం.

ఎన్నో వెసులుబాట్లు

సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్ స్కీమ్ ద్వారా.. ఆ హోదా పొందిన ఇన్‌స్టిట్యూట్‌లకు పరిశోధనల కోసం ఎన్నో వెసులుబాట్లు లభిస్తాయి. ముఖ్యంగా రీసెర్చ్ ఫ్యాకల్టీకి.. సదరు పరిశోధనకు అవసరమైన అన్ని రకాల ప్రోత్సాహకాలు అందుతాయి. అదే విధంగా ఇటు విద్యార్థులకు కూడా సదరు పరిశోధనల్లో పాల్పంచుకునే అవకాశం లభిస్తుంది. తద్వారా భవిష్యత్తులో పూర్తి స్థాయిలో పరిశోధనల్లో పాల్పంచుకోవడం వంటివి కూడా సానుకూల అంశాలుగా పేర్కొనొచ్చు.

–ప్రొఫెసర్ సి.వి.జవహర్,
డీన్(ఆర్ అండ్ డీ), ఐఐఐటీ-హైదరాబాద్

మెట్రో వాటర్ బోర్డులో..

93 మేనేజర్ పోస్టులు

» నోటిఫికేషన్ విడుదల చేసిన టీఎస్‌పీఎస్సీ
» దరఖాస్తులకు చివరి తేది: 31.03.2020

హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ సప్లయ్ అండ్ సీవరేజ్ బోర్డులో మేనేజర్ పోస్టుల భర్తీకి తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ నోటిఫికేషన్ (టీఎస్‌పీఎస్సీ) విడుదల చేసింది. వాటర్ బోర్డులోని వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న ఈ పోస్టులకు ఇంజనీరింగ్ పూర్తి చేసిన అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ నేపథ్యంలో... టీఎస్‌పీఎస్సీ ఉద్యోగాలు.. అర్హతలు.. ఎంపిక ప్రక్రియ గురించి తెలుసుకుందాం...

ఎగ్జామినేషన్స్ జాబ్స్

మొత్తం పోస్టులు

హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ సప్లయ్ అండ్ సీవరేజ్ బోర్డులోని వివిధ విభాగాలలో మొత్తం 93 పోస్టులు ఖాళీ ఉన్నాయి. ఇందులో సివిల్ విభాగం-79, మెకానికల్- 06, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్- 04, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్- 03, కంప్యూటర్‌సైన్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ-01.

వేతనాలు

» **ఎంపికైన వారికి జీతం స్కేల్:** రూ.37,100- 91,450 లభిస్తుంది.
» **అర్హతలు:** ఏఐసీటీఈ గుర్తింపు పొందిన విద్యా సంస్థ నుంచి ఆయా విభాగాల్లో ఇంజనీరింగ్ డిగ్రీ పూర్తి చేసినవారు అర్హులు.
» **వయసు:** అభ్యర్థుల వయసు 18 నుంచి 34 సంవత్సరాల మధ్య ఉండాలి. అంటే జూలై 1, 2002 నుంచి జూలై 2, 1986 మధ్య పుట్టిన వారు అర్హులు. అయితే, ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఆయా వర్గాలకు రిజర్వేషన్లు వర్తిస్తాయి.
» రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు 5 ఏళ్లు (టీఎస్‌ఆర్టీసీ/కార్పొరేషన్/మున్సిపాలిటీ తదితర విభాగాల ఉద్యోగులకు వర్తించదు) » ఎక్స్ సర్వీస్ మెన్/ఎన్‌సీసీ ఇన్‌స్ట్రక్టర్స్‌కు 3 ఏళ్లు -ఎస్సీ/ఎస్టీ/బీసీలకు 5 ఏళ్లు » విద్యాంగులకు 10 ఏళ్లు వయోపరిమితిలో సడలింపు ఉంటుంది.

పరీక్ష విధానం

పరీక్ష ఆబ్జెక్టివ్ విధానంలో ఉంటుంది. జనరల్ స్టడీస్ అండ్ జనరల్ ఎబిలిటీస్ 150 మార్కులు, సంబంధిత సబ్జెక్ట్ 300 మార్కులు, ఇంటర్వ్యూ 50 మార్కులు.. మొత్తం 500 మార్కులకు నిర్వహిస్తారు. జనరల్ స్టడీస్ అండ్ జనరల్ ఎబిలిటీస్ పేపర్ తెలుగు, ఇంగ్లిష్ భాషల్లో ఉండగా, సబ్జెక్ట్ ప్రశ్నపత్రం మాత్రం ఇంగ్లిష్‌లో మాత్రమే ఉంటుంది. సిలబస్, పరీక్ష విధానం కోసం సర్వీస్ కమిషన్ వెబ్‌సైట్‌లో చూడవచ్చు.

దరఖాస్తు విధానం

దరఖాస్తు చేయడానికి ముందు, అధికారిక వెబ్‌సైట్‌లో 'వన్ టైమ్ రిజిస్ట్రేషన్'(ఓటీఆర్) కోసం వివరాలు నమోదు చేసుకోవాలి. ఇప్పటికే ఓటీఆర్ నమోదు చేసుకున్నవారు టీఎస్‌పీఎస్సీ ఐడీ, పుట్టిన తేదీతో ప్రొఫైల్‌కు లాగిన్ అయ్యి దరఖాస్తు చేసుకోవాలి.

ఫీజు వివరాలు

ఆన్‌లైన్ ప్రాసెసింగ్ ఫీజు రూ.200 చెల్లించాలి. ఇదికాకుండా పరీక్ష ఫీజు రూ.120 చెల్లించాల్సి ఉంటుంది. రాష్ట్రానికి చెందిన బీసీ/ఎస్సీ/ఎస్టీ/దివ్యాంగులు/ఎక్స్ సర్వీస్ అభ్యర్థులు/34ఏళ్ల లోపు వయసున్న నిరుద్యోగులు పరీక్ష ఫీజు(రూ.120) చెల్లించనవసరం లేదు. ఇతర రాష్ట్రాలకు చెందిన (నాన్‌లోకల్) అభ్యర్థులు మాత్రం ఫీజు చెల్లించడం తప్పనిసరి.
» **దరఖాస్తు గడువు:** మార్చి 16 నుంచి 31వ తేదీ వరకు ఆన్‌లైన్ విధానంలో దరఖాస్తు చేసుకోవచ్చు.
» **వివరాలకు www.tspsc.gov.in**

జనరల్ స్టడీస్ సిలబస్

» కరెంట్ అఫైర్స్-స్థానిక, జాతీయ అంతర్జాతీయ అంశాలు
» అంతర్జాతీయ సంబంధాలు, సంఘటనలు
» జనరల్ సైన్స్, సైన్స్ అండ్ టెక్నాలజీలో భారత దేశం సాధించిన విజయాలు
» పర్యావరణ సమస్యలు, విపత్తు నిర్వహణ-నివారణ విధానాలు
» భారతదేశం- తెలంగాణ ఆర్థిక, సామాజిక అభివృద్ధి
» భారతదేశం-భౌతిక, సామాజిక, ఆర్థిక విధానం
» తెలంగాణ- భౌతిక, సామాజిక, ఆర్థిక భౌగోళి పరిస్థితి- జనాభా
» ఆధునిక భారతదేశ సామాజిక-ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక చరిత్ర.. భారత జాతీయ ఉద్యమం
» తెలంగాణ సామాజిక-ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక చరిత్ర, ప్రత్యేక రాష్ట్ర ఉద్యమం-ప్రాధాన్యం
» భారత రాజ్యాంగం- రాజకీయ వ్యవస్థ, పరిపాలన, ప్రజా విధానం
» లింగ, కులం, తెగ, వైకల్యం తదితరుల హక్కులు, ఎదుర్కొంటున్న సమస్యలు- సామాజిక మినహాయింపు
» తెలంగాణ సమాజం, సంస్కృతి, సంప్రదాయాలు, సాహిత్యం
» తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విధానాలు
» లాజికల్ రీజనింగ్, అనలిటిక్ ఎబిలిటీ, డేటా ఇంటర్‌ప్రిటేషన్
» 10వ తరగతి స్థాయిలో బేసిక్ ఇంగ్లిష్
» ఆయా ఇంజినీరింగ్ సబ్జెక్టుల సిలబస్ కోసం వెబ్‌సైట్‌లో చూడవచ్చు.

నేటి టాబ్లాయిడ్ విద్య పేజీల్లో...
10th Class
SRIGAYATRI EDUCATIONAL INSTITUTIONS
TELUGU

ఇగ్నోలో ఎంబీఏ

ఎగ్జామినేషన్స్ జాబ్స్

అంతర్జాతీయంగా పేరున్న ఇందిరా గాంధీ నేషనల్ ఓపెన్ యూనివర్సిటీ (ఇగ్నో) రెండేళ్ల ఎంబీఏ కోర్సులో ప్రవేశాలకు ప్రకటన వెలువడింది. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్టీఏ) ఆధ్వర్యంలో ఏడాదికి రెండుసార్లు నిర్వహించే ఓపెన్ మ్యాట్ పరీక్ష ద్వారా ఇగ్నో ఎంబీఏలో ప్రవేశాలను కల్పిస్తోంది. 2020కి సంబంధించి ఎన్టీఏ ఓపెన్ మ్యాట్-2020 నోటిఫికేషన్ విడుదలైన నేపథ్యంలో.. పరీక్ష, దరఖాస్తు విధానం, సిలబస్ వివరాలు..

ఇగ్నో

సమాజంలోని అన్ని వర్గాల వారికి నాణ్యమైన ఉన్నత విద్యావకాశాలను దూర విద్య ద్వారా అందించాలనే లక్ష్యంతో ఇందిరా గాంధీ నేషనల్ ఓపెన్ యూనివర్సిటీ (ఇగ్నో)ని ఏర్పాటు చేశారు. 1985లో ఇగ్నో యాక్ట్ ద్వారా న్యూఢిల్లీ కేంద్రంగా మాజీ ప్రధాని ఇందిరాగాంధీ పేరు మీదుగా ఈ యూనివర్సిటీని స్థాపించారు. ప్రపంచంలోనే పెద్ద యూనివర్సిటీగా గుర్తింపు పొందిన ఇగ్నో పలు యూజీ, పీజీ, పీహెచ్‌డీ తదితర కోర్సులతో పాటు ఎంబీఏనూ అందిస్తోంది.

ఓపెన్ మ్యాట్

ఇగ్నో అందించే ఎంబీఏ కోర్సుల్లో ప్రవేశాలకు జాతీయ స్థాయిలో నిర్వహించే పరీక్ష.. ఓపెన్ మ్యాట్. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) ఈ పరీక్ష నిర్వహణ బాధ్యతలను చూస్తోంది. ఆన్‌లైన్ (కంప్యూటర్ బేస్డ్ టెస్ట్) విధానంలో జరిగే ఓపెన్ మ్యాట్‌లో ప్రతిభ చూపిన అభ్యర్థులకు ఇగ్నో రెండేళ్ల ఎంబీఏ కోర్సులో ప్రవేశం లభిస్తుంది.

అర్హతలు

జనరల్ అభ్యర్థులు 50 శాతం మార్కులు, ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు 45 శాతం మార్కులతో డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి.

ఎంబీఏ స్పెషలైజేషన్స్

ఇగ్నో ఎంబీఏలో పలు రకాల స్పెషలైజేషన్స్‌ను ఆఫర్ చేస్తోంది. హెచ్‌ఆర్ఎం, ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్, ఆపరేషన్స్ మేనేజ్‌మెంట్, మార్కెటింగ్, ఫైనాన్షియల్ మార్కెట్స్ వంటి స్పెషలైజేషన్స్‌తో కోర్సులను అందిస్తోంది.

పరీక్ష విధానం

ఆబ్జెక్టివ్ పద్ధతిలో నిర్వహించే ఈ పరీక్ష పూర్తిగా ఆన్‌లైన్(కంప్యూటర్ బేస్ట్ టెస్ట్) విధానంలో జరుగుతుంది. జనరల్ అవేర్‌నెస్, ఇంగ్లిష్ లాంగ్వేజ్, క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్, రీజనింగ్ అంశాల నుంచి 200 ప్రశ్నలకు గాను 200 మార్కులకు పరీక్షను నిర్వహిస్తారు. జనరల్ అవేర్‌నెస్ 30 ప్రశ్నలు-30 మార్కులు, ఇంగ్లిష్ లాంగ్వేజ్ 50 ప్రశ్నలు-50 మార్కులు, క్వాంటిటేటివ్ అప్టిట్యూడ్ 50 ప్రశ్నలు-50 మార్కులు, రీజనింగ్ 70-70 మార్కులకు పరీక్ష ఉంటుంది. పరీక్ష సమయం 3 గంటలు. ఎటువంటి నెగిటివ్ మార్కులు లేవు.

సిలబస్

పరీక్ష ప్రిపరేషన్ మొదలు పెట్టేముందు అభ్యర్థులు సిలబస్ గురించి పూర్తిగా తెలుసుకోవాలి. ఈ పరీక్ష సంబంధించి మొత్తం నాలుగు సబ్జెక్టుల నుంచి ప్రశ్నలు అడుగుతారు.

జనరల్ అవేర్‌నెస్

ప్రస్తుత ప్రపంచ వ్యాప్తంగా జరుగుతున్న సంఘటనలు, ప్రముఖుల పేర్లు, రాజ్యాంగం, చట్టాలు, రాష్ట్రాలు, చరిత్ర, ఆర్థిక వ్యవస్థ, భౌగోళిక అంశాలు, శిఖరాలు, రాజకీయాలు, దేశాలు, ప్రపంచ ఆర్థిక వ్యవస్థ, ప్రముఖ నాయకులు, ఫిజిక్స్, బయాలజీ, కెమిస్ట్రీ ప్రాథమిక అంశాలు, విదేశాల నుంచి దిగుమతి, ఎగుమతి చేసే వస్తువులు, దేశ వ్యాపార, వాణిజ్య ఒప్పందాలు వంటి వాటిపై అవగాహన పెంచుకోవాలి.

రీజనింగ్

సింబల్ బేస్డ్ ప్రాబ్లమ్స్, ఫ్యామిలీ ట్రీ, స్టేట్‌మెంట్స్ అండ్ కన్‌క్లూజన్స్, అసెర్షన్ అండ్ రీజన్స్, కాస్ అండ్ ఎఫెక్ట్, విజువల్ రీజనింగ్, కోడింగ్ అండ్ డీకోడింగ్, క్రిటికల్ రీజనింగ్ అంశాలపై దృష్టి పెట్టాలి.

క్వాంటిటేటివ్ ఎబిలిటీ

నంబర్ సిస్టమ్స్, రేషియో అండ్ ప్రపోర్షన్స్, ఎల్‌సీఎమ్, హెచ్‌సీఎఫ్, యావరేజెస్, ప్రాఫిట్ అండ్ లాస్, మీన్, మోడ్, మీడియన్, ఆల్‌జీబ్రా, స్టాటిస్టిక్స్, పర్ముటేషన్, కాంబినేషన్, అర్థమెటిక్, ప్రొగ్రెషన్, జామెట్రి, జామెట్రిక్ ప్రొగ్రెషన్, ట్రిగ్నోమెట్రి తదితర అంశాలను ప్రాక్టీస్ చేయాలి.

ఇంగ్లిష్ లాంగ్వేజ్

ఫిల్ ఇన్ ద బ్లాంక్స్, గ్రామర్, సెంటెన్స్ కరెక్షన్, వొకాబ్యులరీ, రీడింగ్ కాంప్రహెన్షన్, ఎర్రర్ ఫైండింగ్, జంబుల్డ్ సెంటెన్స్, ప్రిపోజిషన్, వన్ వర్డ్ సబ్‌స్ట్యూషన్, యాక్టివ్ వాయిస్, పాసివ్ వాయిస్, సినోనియమ్స్, యాంటోనియమ్స్ అంశాలకు ప్రాధాన్యత ఇవ్వాలి.

» ఓపెన్ మ్యాట్-2020 ఎన్‌టీఏ నోటిఫికేషన్ విడుదల
» దరఖాస్తులకు చివరి తేది: 23 మార్చి 2020

ప్రిపరేషన్ ఇలా

ఓపెన్ మ్యాట్ పరీక్షకు అర్హత సాధించాలని కోరకునే వారు తొలుత పరీక్ష తీరుతెన్నులను తెలుసుకోవాలి. పరీక్ష సిలబస్ ప్రకార

నిరీక్షణకు తెర...

- పదేళ్ల తర్వాత శరత్ కమల్ ఖాతాలో మరో అంతర్జాతీయ టైటిల్
- ఒమన్ ఓపెన్ టీటీ టోర్నీలో విజేత
- ఫైనల్లో టాప్ సీడ్ మార్కోస్‌పై గెలుపు

మస్కట్: ఒకటి కాదు... రెండు కాదు... మూడు కాదు... ఏకంగా పదేళ్ల నిరీక్షణకు భారత అగ్రశ్రేణి టేబుల్ టెన్నిస్ (టీటీ) క్రీడాకారుడు ఆచంట శరత్ కమల్ తెర దించాడు. అంతర్జాతీయ టేబుల్ టెన్నిస్ సమాఖ్య (ఐటీటీఎఫ్) ఆధ్వర్యంలో జరిగిన ఒమన్ ఓపెన్ చాలెంజర్ ప్లస్ టోర్నమెంట్‌లో విజేతగా నిలిచాడు. ఆదివారం ముగిసిన ఈ టోర్నీలో పురుషుల సింగిల్స్ విభాగంలో శరత్ కమల్ చాంపియన్ అయ్యాడు. హోరాహోరీగా సాగిన ఫైనల్లో 37 ఏళ్ల శరత్ కమల్ 6-11, 11-8, 12-10, 11-9, 3-11, 17-15తో టాప్ సీడ్ ఫ్రెటాస్ మార్కోస్ (పోర్చుగల్)ను బోల్తా కొట్టించాడు. ఏథెన్స్, బీజింగ్, రియో ఒలింపిక్స్ క్రీడల్లో భారత్‌కు ప్రాతినిధ్యం వహించిన శరత్ కమల్ చివరిసారి అంతర్జాతీయస్థాయిలో 2010లో ఈజిప్ట్ ఓపెన్ టైటిల్ సాధించాడు. ఆ తర్వాత అతను రెండు టోర్నమెంట్‌లలో (మొరాకో ఓపెన్-2011; ఇండియా ఓపెన్-2017) సెమీఫైనల్ చేరి ఓడిపోయాడు. అంతకుముందు జరిగిన సెమీఫైనల్లో శరత్ 11-13, 11-13, 13-11, 11-9, 13-11, 8-11, 11-7తో కిరిల్ స్కచ్కోవ్ (రష్యా)పై గెలవగా... మరో భారత ఆటగాడు హర్మీత్ దేశాయ్ 11-5, 9-11, 11-6, 11-6, 8-11, 11-13, 3-11తో మార్కోస్ చేతిలో ఓడాడు.

ఈ ప్రయాణం బహు భారం!

దక్షిణాఫ్రికా క్రికెట్ జట్టు వెతలు

న్యూఢిల్లీ: దక్షిణాఫ్రికా జట్టు రెండో వన్డే ఆడేందుకు శుక్రవారమే లక్నో చేరుకుంది. ఆ తర్వాతే సిరీస్‌ను రద్దు చేస్తున్నట్లు బీసీసీఐ ప్రకటించింది. నిజానికి స్వదేశం వెళ్లాలంటే అత్యంత సమీప అంతర్జాతీయ విమానాశ్రయం ఢిల్లీకి వెళ్లి అటు నుంచి సఫారీ ఆటగాళ్లు దక్షిణాఫ్రికా బయల్దేరాలి. లేదంటే ఎక్కువ విమానాలు అందుబాటులో ఉన్న ముంబై నుంచి కానీ వెళ్లాలి. అయితే అలా జరగలేదు. ఢిల్లీ, ముంబైలలో కరోనా వైరస్ విస్తరిస్తోందంటూ వచ్చిన వార్తల నేపథ్యంలో డి కాక్ బృందం దేశ రాజధాని వెళ్లడానికి నిరాకరించింది. ప్రస్తుతం దేశంలో ఒక్క కోవిడ్-19 కేసు కూడా నమోదు కాని సురక్షిత నగరానికి ముందు తమను తీసుకెళ్లమని కోరింది! అప్పటి వరకు జట్టు సభ్యులంతా హోటల్ గదుల నుంచి బయటకు రాకుండా లక్నోలోనే ఉండిపోయారు. దాంతో అధికారులు అన్నీ చూసి కోల్‌కతాను అందు కోసం ఎంపిక చేశారు. ఇప్పుడు వారు సోమవారం కోల్‌కతాకు వెళ్లి మరుసటి రోజు దుబాయ్ మీదుగా స్వదేశానికి బయల్దేరతారు. దక్షిణాఫ్రికా క్రికెటర్లను పంపించేందుకు ప్రభుత్వ సహాయంతో ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు బెంగాల్ క్రికెట్ సంఘం (క్యాబ్) అధ్యక్షుడు అవిషేక్ దాల్మియా వెల్లడించారు. 'విమానాశ్రయానికి దగ్గరలోనే వారి బస ఏర్పాటు చేశాం. రాష్ట్ర ముఖ్యమంత్రితో కూడా ఈ విషయంపై చర్చించాం. వారు మా అతిథులు. అన్ని రకాలుగా సహకరించి దక్షిణాఫ్రికా జట్టును వారి దేశానికి పంపిస్తాం' అని ఆయన చెప్పారు.

ధోని 'ఆట' ముగిసింది!



చెన్నై: ఐపీఎల్‌లో వీరాభిమానుల గురించి చెప్పాల్సి వస్తే ముందు వరుసలో చెన్నై సూపర్ కింగ్స్ ఫ్యాన్సే ఉంటారు. ఐపీఎల్ సన్నాహాల్లో భాగంగా ఇటీవల చెన్నై సూపర్ కింగ్స్ సాధన చేస్తుంటే జనం విరగబడి వచ్చారు. ఒక మ్యాచ్‌కు వచ్చినట్లుగా తలపించే రీతిలో ప్రాక్టీస్ సెషన్లకు ప్రేక్షకులు కనిపించారు. ఇదంతా తమ ఆరాధ్య ఆటగాడు ధోని కోసమే! గత ఏడాది జులైలో ప్రపంచకప్ ముగిసిన తర్వాత మళ్లీ మ్యాచ్ ఆడని ధోని ఐపీఎల్‌లో బరిలోకి దిగుతుండటంతో వారిలో ఉత్సాహం రెట్టింపయింది. ఐపీఎల్‌లో మెరుపులకు ముందు ప్రత్యక్షంగా ధోని బ్యాటింగ్‌ను చూసేందుకు తరలి వచ్చారు. అయితే ఇప్పుడు తాజా పరిణామాల నేపథ్యంలో ధోని సాధన ముగిసింది. ఐపీఎల్ ఎప్పుడు జరుగుతుందో తెలియని స్థితిలో ఫ్రాంచైజీ తమ సన్నాహాలను నిలిపివేసింది. దాంతో ధోని కూడా ఆదివారం రాంచీకి బయల్దేరాడు. ధోనికి వీడ్కోలు చెబుతున్నట్లుగా ఫ్రాంచైజీ వీడియో పోస్ట్ చేసింది. అన్నట్లు ధోని భవిష్యత్తు, ప్రపంచ కప్ జట్టులో చోటు వంటివి ఐపీఎల్ ప్రదర్శనతో ముడిపడి ఉన్నాయని గత కొంతకాలంగా కోచ్, సెలక్టర్లు పదే పదే చెబుతూ వచ్చారు. మరి ఐపీఎల్ జరగకపోతే ధోని ఫామ్‌ను, ప్రదర్శనను ఎలా అంచనా వేస్తారో!

కాస్త జలుబు చేసిందంతే

కివీస్ పేసర్ ఫెర్గూసన్ వివరణ

ఆక్లాండ్: కరోనా విస్తరిస్తున్న నేపథ్యంలో ఇప్పుడు కాస్త జలుబు చేసినా సరే నానా హైరానా పడిపోవడం చూస్తూనే ఉన్నాం. ఇదే పరిస్థితి న్యూజిలాండ్ పేస్ బౌలర్ లోకీ ఫెర్గూసన్‌కు కూడా ఎదురైంది. ఆస్ట్రేలియాతో సిడ్నీలో తొలి వన్డే ఆడిన తర్వాత అతనికి కొంత అనారోగ్యంగా కనిపించడంతో కివీస్ బోర్డు వెంటనే స్పందించింది. కరోనా వైరస్‌కు సంబంధించి పరీక్షలకు పంపడంతో పాటు 24 గంటల పాటు ఎవరితో కలవకుండా హోటల్ రూమ్‌లోనే ఉండాలని నిర్బంధించింది. శనివారం అతని రిపోర్ట్‌లు నెగెటివ్‌గా రావడంతో ఊపిరి పీల్చుకొని ఫెర్గూసన్ ఆక్లాండ్‌లోని తన ఇంటికి చేరుకున్నాడు. దీనిపై అతను స్పందిస్తూ తనకు జరిగిన అనుభవాన్ని వివరించాడు. కరోనా విషయంలో అతి చేసినట్లు అనిపించిందని వ్యాఖ్యానించాడు. 'నా ఆరోగ్యంపై చాలా మంది ఆందోళన చెందారు. నేను బాగానే ఉన్నానని వారందరికీ సమాధానమిచ్చా. నాకు కాస్త జలుబు చేసిందంతే. అంతకుమించి ఏమీ కాలేదు. టీమ్ వైద్యులు నిబంధనలు అమలు చేశారు కాబట్టి అర్థం చేసుకోగలను. కానీ మొత్తంగా చూస్తే అంతా అతి చేసినట్లు అనిపిస్తోంది.' అని ఫెర్గూసన్ అన్నాడు. మరోవైపు కరోనా కారణంగా మరో రెండు క్రికెట్ ఈవెంట్లు రద్దయ్యాయి. జింబాబ్వేలో పర్యటిస్తోన్న ఇంగ్లండ్ కౌంటీ జట్టు డెర్బీషైర్ టూర్‌ను రద్దు చేసుకొని ఇంగ్లండ్‌కు తిరిగి వెళ్లిపోయింది. ఆస్ట్రేలియా అగ్రశ్రేణి టోర్నీ షెఫీల్డ్ షీల్డ్ చివరి రౌండ్ మ్యాచ్‌లు కూడా రద్దయ్యాయి.

చాంప్స్ తై జు యింగ్, అక్సెల్‌సన్



బర్మింగ్‌హామ్: ప్రతిష్టాత్మక ఆల్ ఇంగ్లండ్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో పురుషుల సింగిల్స్‌లో ప్రపంచ మాజీ నంబర్‌వన్ విక్టర్ అక్సెల్‌సన్ (డెన్మార్క్)... మహిళల సింగిల్స్‌లో ప్రపంచ రెండో ర్యాంకర్ తై జు యింగ్ (చైనీస్ తైపీ) చాంపియన్స్‌గా నిలిచారు. 120 ఏళ్ల చరిత్ర కలిగిన ఈ టోర్నమెంట్‌లో ఆదివారం జరిగిన ఫైనల్స్‌లో అక్సెల్‌సన్ 21-13, 21-14తో ప్రపంచ రెండో ర్యాంకర్, టాప్ సీడ్ చౌ తియెన్ చెన్ (చైనీస్ తైపీ)పై నెగ్గగా... తై జు యింగ్ 21-19, 21-15తో టాప్ సీడ్, ప్రపంచ నంబర్‌వన్ చెన్ యుఫె (చైనా)ను బోల్తా కొట్టించింది. 1999లో పీటర్ గేడ్ తర్వాత ఆల్ ఇంగ్లండ్ ఓపెన్ టైటిల్‌ను గెలిచిన తొలి డెన్మార్క్ ప్లేయర్‌గా అక్సెల్‌సన్ గుర్తింపు పొందాడు. సింగిల్స్ టైటిల్స్ నెగ్గిన అక్సెల్‌సన్, తై జు యింగ్‌లకు 77 వేల డాలర్ల చొప్పున (రూ. 57 లక్షలు) ప్రైజ్‌మనీ లభించింది.

సమష్టి మంత్రం... స్వప్నం సాకారం

- నిలకడగా రాణించినందుకు సౌరాష్ట్ర జట్టుకు లభించిన ప్రతిఫలం
- స్టార్ ఆటగాళ్లు లేకున్నా రంజీ ట్రోఫీ టైటిల్ సొంతం
- జట్టును ముందుండి నడిపించిన కెప్టెన్ జైదేవ్ ఉనాద్కట్

ఒకరిద్దరు మినహా భారత్‌కు ఆడిన ఆటగాళ్లెవరూ ఆ జట్టులో లేరు. అయినా దేశవాళీ క్రికెట్‌లో ఈసారి ఆ జట్టు అద్భుతమే చేసింది. ఆద్యంతం నిలకడగా రాణించింది. తమ చిరకాల స్వప్నాన్ని సాకారం చేసుకుంది. నాలుగో ప్రయత్నంలో రంజీ ట్రోఫీ చాంపియన్‌గా అవతరించింది. ప్రత్యర్థి ఎవరైనా, పరిస్థితులు ఎలా ఉన్నా, పిచ్ ఎలాంటిదైనా ... పక్కా ప్రణాళికతో ఆడితే తుది ఫలితం కోరుకున్నట్లు ఉంటుందని నిరూపించిన జట్టే సౌరాష్ట్ర. గత ఏడాది రన్నరప్ ట్రోఫీతో సరిపెట్టుకున్నా... నిరాశ చెందకుండా ఈసారి మరింత పకడ్బందీగా ఆడిన సౌరాష్ట్ర చాంపియన్‌గా నిలిచి ఔరా అనిపించింది.

> భారత జట్టులోకి పునరాగమనం చేయగల సత్తా నాలో ఉంది. ఆ పట్టుదలే ఈ సీజన్‌లో నేను అద్భుతంగా ఆడేలా ప్రేరేపించింది. దాదాపు ప్రతీ మ్యాచ్‌లో సుదీర్ఘ స్పెల్‌లు వేయాల్సి రావడం శారీరకంగా కూడా నన్ను తీవ్ర శ్రమకు గురి చేసింది. అయితే మేం ఈసారి రంజీ ట్రోఫీ గెలవగలిగాం. ప్రపంచంలో ఇప్పుడు అందరికంటే ఎక్కువగా నేనే సంతోషంగా ఉన్నట్లు అనిపిస్తోంది. ఐపీఎల్‌లో భారీ మొత్తాలకు అమ్ముడుపోయిన ఆటగాడిగానే చాలా మంది నా గురించి మాట్లాడుతుంటారు. అయితే ఆడేటప్పుడు ఐపీఎల్ గురించి ఆలోచన రాదు. ఒక క్రికెటర్‌గా దేశంలో చాలా మందిలాగే మైదానంలో నేనూ కష్టపడతాను. ఇప్పుడు నా రాష్ట్ర జట్టు తరఫున రంజీ గెలవడంతో నా సుదీర్ఘకాల స్వప్నం సాకారమైంది.
>
> *-జైదేవ్ ఉనాద్కట్, సౌరాష్ట్ర కెప్టెన్*

సాక్షి క్రీడా విభాగం

రంజీ సీజన్ ప్రారంభమైన మొదట్లో సౌరాష్ట్ర జట్టు చాంపియన్‌గా అవతరిస్తుందని ఎవరూ ఊహించలేదు. కర్ణాటక, తమిళనాడు, ముంబై, విదర్భ జట్లలో ఒకటి విజేతగా నిలుస్తుందని అంచనా వేశారు. కానీ సౌరాష్ట్ర జట్టు అందర్నీ ఆశ్చర్యపరుస్తూ రంజీ ట్రోఫీ టైటిల్‌ను ఎగరేసుకుపోయింది. దేశవాళీ క్రికెట్‌లో సౌరాష్ట్ర జట్టుకు ఆడే భారత స్టార్ ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా ఒక్క మ్యాచ్ లోనూ అందుబాటులో లేకుండా పోయాడు. భారత టెస్టు స్పెషలిస్ట్ చతేశ్వర్ పుజారా కేవలం ఆరు మ్యాచ్‌ల్లో సౌరాష్ట్రకు ఆడాడు. వీరిద్దరి సేవలు పూర్తిస్థాయిలో అందుబాటులో లేకున్నా సౌరాష్ట్ర సీజన్ మొత్తం నిలకడగా రాణించింది. బ్యాటింగ్‌లో, బౌలింగ్‌లో మెరిపించి ప్రత్యర్థుల ఆట కట్టించింది. భారత క్రికెటర్, జట్టు కెప్టెన్ జైదేవ్ ఉనాద్కట్ అన్నీ తానై సౌరాష్ట్రను ముందుండి నడిపించాడు.

శుభారంభంతో...

గత ఏడాది రన్నరప్‌గా నిలిచిన సౌరాష్ట్ర 2019-2020 సీజన్‌ను వరుసగా రెండు విజయాలతో ప్రారంభించింది. తొలి మ్యాచ్‌లో హిమాచల్‌ప్రదేశ్‌పై ఐదు వికెట్ల తేడాతో... రెండో మ్యాచ్‌లో రైల్వేస్‌పై ఇన్నింగ్స్ 90 పరుగుల ఆధిక్యంతో గెలిచింది. అయితే ఉత్తర్‌ప్రదేశ్‌తో జరిగిన మ్యాచ్‌లో సౌరాష్ట్రకు ఇన్నింగ్స్ 72 పరుగుల తేడాతో ఓటమి ఎదురైంది. ఈ రంజీ సీజన్‌లో సౌరాష్ట్ర ఓడిన ఏకైక మ్యాచ్ ఇదే కావడం గమనార్హం. ఉత్తర్‌ప్రదేశ్ చేతిలో ఓటమి ఎదురయ్యాక సౌరాష్ట్ర లీగ్ దశలో ఆడిన మిగతా ఐదు మ్యాచ్‌ల్లో నాలుంగిటిని 'డ్రా' చేసుకొని మరో మ్యాచ్‌లో గెలిచి 41 పాయింట్లతో 18 జట్లున్న ఎలైట్ 'ఎ అండ్ బి' గ్రూప్‌లో 31 పాయింట్లతో నాలుగో స్థానంలో నిలిచి క్వార్టర్ ఫైనల్‌కు అర్హత సాధించింది. ఈ సీజన్‌లో అద్భుత ఫామ్‌లో ఉన్న ఆంధ్ర జట్టుతో ఒంగోలులో జరిగిన క్వార్టర్ ఫైనల్‌ను సౌరాష్ట్ర 'డ్రా' చేసుకుంది. అయితే తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం సంపాదించి సెమీఫైనల్ బెర్త్‌ను దక్కించుకుంది. ఆంధ్రతో జరిగిన మ్యాచ్‌లో సౌరాష్ట్ర ఒకదశలో తొలి ఇన్నింగ్స్‌లో 140 పరుగులకే ఐదు వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. అయితే లోయర్ ఆర్డర్ బ్యాట్స్‌మెన్ చిరాగ్ జానీ అద్భుత సెంచరీ, ప్రేరక్ మన్కడ్ అర్ధ సెంచరీ చేసి సౌరాష్ట్రకు 419 పరుగుల భారీ స్కోరును అందించారు. అనంతరం బౌలింగ్‌లో జైదేవ్ ఉనాద్కట్ విజృంభణకు ఆంధ్ర తొలి ఇన్నింగ్స్‌లో 136 పరుగులకే ఆలౌటైంది. ప్రత్యర్థిని ఫాలోఆన్ ఆడించే అవకాశం ఉన్నా సౌరాష్ట్ర రిస్క్ తీసుకోకుండా వ్యూహాత్మకంగా రెండో ఇన్నింగ్స్ ఆడి మళ్లీ భారీ స్కోరు చేసింది. మాజీ చాంపియన్ గుజరాత్‌తో జరిగిన సెమీఫైనల్లో సౌరాష్ట్ర కెప్టెన్ జైదేవ్ ఉనాద్కట్ తొలి ఇన్నింగ్స్‌లో మూడు, రెండో ఇన్నింగ్స్‌లో ఏడు వికెట్లు పడగొట్టాడు. ఫైనల్లోనూ మెరిసిన ఉనాద్కట్ సౌరాష్ట్రకు తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం దక్కడంలో కీలకపాత్ర పోషించాడు. ఈ క్రమంలో 28 ఏళ్ల ఉనాద్కట్ ఓవరాల్‌గా ఈ సీజన్‌లో అత్యధికంగా 67 వికెట్లు తీసిన బౌలర్‌గా నిలిచాడు.

ఒకరు కాదంటే మరొకరు....

జట్టు క్రీడ అయిన క్రికెట్‌లో ఏ ఒక్కరితోనో ఎల్లవేళలా విజయాలు సాధించడం సాధ్యం కాదు. సమష్టి ప్రదర్శన చేస్తేనే మంచి ఫలితాలు వస్తాయి. ఈ సీజన్‌లో సౌరాష్ట్ర విషయంలో ఇదే జరిగింది. జట్టు ఒకరిద్దరు ప్రదర్శనపై ఆధారపడలేదు. ఒక మ్యాచ్‌లో ఒకరు మెరిస్తే మరో మ్యాచ్‌లో ఇతర ఆటగాళ్లు అదరగొట్టారు. ముఖ్యంగా ఎడంచేతి వాటం బ్యాట్స్‌మన్ అర్పిత్ వసవాడ సెమీఫైనల్లో, ఫైనల్లో సెంచరీలు చేశాడు. ఓవరాల్‌గా టోర్నీ మొత్తంలో అర్పిత్ నాలుగు సెంచరీలతో కలిపి మొత్తం 763 పరుగులు చేశాడు. ఆల్‌రౌండర్ చిరాగ్ జానీ పలు కీలక ఇన్నింగ్స్ ఆడాడు. ఓపెనర్ హార్విక్ దేశాయ్, వెటరన్ ప్లేయర్ షెల్డన్ జాక్సన్ కూడా తమవంతు పాత్ర పోషించారు. షెల్డన్ జాక్సన్ మొత్తం పది మ్యాచ్‌లు ఆడి మూడు సెంచరీలు, మూడు అర్ధ సెంచరీలతో కలిపి మొత్తం 809 పరుగులు చేసి సౌరాష్ట్ర తరఫున రంజీ సీజన్‌లో టాప్ స్కోరర్‌గా నిలిచాడు. మిగతా బ్యాట్స్‌మెన్ పుజారా 573 పరుగులు... చిరాగ్ జానీ 544 పరుగులు... హార్విక్ దేశాయ్ 597 పరుగులు... ప్రేరక్ మన్కడ్ 445 పరుగులు సాధించారు. స్టార్ ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా లేని లోటును తెలియకుండా మరో లెఫ్టార్మ్ స్పిన్నర్ ధర్మేంద్ర సింగ్ జడేజా ముఖ్యపాత్ర నిర్వర్తించాడు. అతను ఈ సీజన్‌లో 388 పరుగులు చేయడంతోపాటు 32 వికెట్లు తీసి తనదైన ముద్ర వేశాడు. ఈసారి సౌరాష్ట్ర చాంపియన్‌గా అవతరించడానికి సమష్టి ప్రదర్శనే కారణమని ఆ జట్టు కోచ్ నీరజ్ ఒదేద్రా అభిప్రాయపడ్డారు. 'గతంలోనూ సౌరాష్ట్ర బాగా ఆడింది. ఫైనల్స్‌కూ చేరింది. అయితే ఆ సందర్భాల్లో స్టార్ ఆటగాళ్లపైనే పూర్తిగా ఆధారపడింది. స్టార్ ప్లేయర్లు విఫలమైతే ఫలితం మరోలా వచ్చేది. ఈసారి మాత్రం పరిస్థితి మారింది. ప్రతి ఒక్కరూ తమవంతుగా రాణించడంలో సౌరాష్ట్రకు టైటిల్ లభించింది. గత సీజన్‌లో జైదేవ్ ఉనాద్కట్ జట్టు పగ్గాలు చేపట్టాక ఆటగాళ్ల మైండ్‌సెట్‌లోనూ మార్పు వచ్చింది. ఒకప్పుడు సౌరాష్ట్ర జట్టు తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం లభిస్తేనో, 'డ్రా' చేసుకుంటేనో సంతృప్తి పడేది. కానీ ఉనాద్కట్ కెప్టెన్ అయ్యాక సౌరాష్ట్ర ప్రతి మ్యాచ్‌లో విజయమే లక్ష్యంగా పోరాడటం అలవాటు చేసుకుంది' అని నీరజ్ అన్నారు.

ఉనాద్కట్ నిశ్చితార్థం...

సౌరాష్ట్రను రంజీ చాంపియన్‌గా నిలబెట్టిన కెప్టెన్ జైదేవ్ ఉనాద్కట్ త్వరలోనే ఇంటివాడు కానున్నాడు. ఆదివారం రాజ్‌కోట్‌లో తన ప్రియురాలు రిన్నీతో జైదేవ్ వివాహ నిశ్చితార్థం జరిగింది. ఈ కార్యక్రమానికి భారత టెస్టు క్రికెటర్, సౌరాష్ట్ర ఆటగాడు చతేశ్వర్ పుజారాతోపాటు సౌరాష్ట్ర జట్టుకు చెందిన ఇతర సభ్యులు హాజరయ్యారు.

సాక్షి ప్రాఫిట్ ప్లస్
సోమవారం
16-3-2020

స్టాక్ మార్కెట్లు (శుక్రవారం ముగింపు)

దేశీ సూచీలు

సెన్సెక్స్	నిఫ్టీ
1,325	365
34,103	9,955

మరిన్ని వార్తలు, స్టాక్ అప్‌డేట్స్ కోసం... www.sakshibusiness.com చూడండి

విదేశీ సూచీలు

నాస్‌డాక్	7875	673
డోజోన్స్	23,186	1985
ఎఫ్‌టీఎస్‌ఈ 100	5,366	129
డాక్స్	9,232	71
షాంఘై	2,887	36
నికాయ్	17,431	1,129

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎన్‌డీవీ	73.35	75.00
£	బ్రిటన్ పౌండ్	ఎన్‌డీవీ	91.54	94.76
€	యూరో	ఎన్‌డీవీ	81.71	84.71
¥	జపాన్ ఎన్ (100)	ఎన్‌డీవీ	68.96	71.53
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎన్‌డీవీ	45.77	47.89
S$	సింగపూర్ డాలర్	ఎన్‌డీవీ	51.78	53.53
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	18.65	20.51
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	18.78	21.01
¥	చైనా యువాన్	థామస్‌కుక్	9.44	11.21

రిటైర్మెంట్‌కు వీపీఎఫ్ ఆయుధం!

- ఈపీఎఫ్‌కు అదనంగా జమ చేసుకోవచ్చు
- తద్వారా రిటైర్మెంట్ నాటికి అధిక మొత్తం
- రాబడి రేటు ఈపీఎఫ్‌లో మాదిరే
- ఈపీఎఫ్ నిబంధనలే అమలవుతాయి
- పీపీఎఫ్, ఇతర స్థిరాదాయ సాధనాల కంటే అధిక రాబడి
- అత్యవసరాల్లో ఉపసంహరణకు వీలు

రిటైర్మెంట్ తర్వాత జీవితానికి సంబంధించి చాలా మందిలో ప్రణాళిక కనిపించదు. ఎన్నో ఏళ్ల తర్వాత అవసరాల కంటే ప్రస్తుత జీవన అవసరాలే వారికి ప్రాధాన్యంగా ఉంటుంటాయి. ఎక్కువగా మధ్యతరగతి, దిగువ ఆదాయ వర్గాల్లో ఇది చూడొచ్చు. కానీ, 60 ఏళ్ల తర్వాత ఆర్జనా శక్తి తగ్గిపోయిన పరిస్థితుల్లో తమ జీవన అవసరాలు, ఆరోగ్య సంరక్షణ, వైద్య ఖర్చులు భరించాలంటే.. కచ్చితంగా అందుకు చిన్న నాటి నుంచే తగిన ప్రణాళిక కావాలి. అన్ని అవసరాలను తీర్చేంత నిధి సమకూర్చుకోవాలి. దీన్ని విస్మరిస్తే విశ్రాంత జీవనంలో ఇబ్బందులు (స్థిర, చరాస్తులు కలిగిన వారు మినహా) ఎదుర్కోవాల్సి రావచ్చు. ప్రభుత్వ రంగ ఉద్యోగులకు ఎన్‌పీఎస్ నిధి ఎలానూ ఉంటుంది. ప్రైవేటు రంగంలోని వారికి ఈపీఎఫ్ సదుపాయం ఉంది. కానీ, దీని వాటా స్వల్ప మొత్తమే. ఇంకాస్త అదనంగా ఈపీఎఫ్‌కు జమ చేసుకుంటానంటే అందుకు వీలు పడదు. కానీ, ఇటువంటి వారు ఈపీఎఫ్‌కు అదనంగా మరికొంత మొత్తాన్ని ప్రతి నెలా స్వచ్ఛంద భవిష్యనిధి (వీపీఎఫ్) రూపంలో సమకూర్చుకోవచ్చు.

సులభ ప్రక్రియ

ఈపీఎఫ్‌కు కొనసాగింపు వీపీఎఫ్. వేతన జీవులకే ఈ అవకాశం. వీపీఎఫ్‌లో ఇన్వెస్ట్ చేయాలనుకుంటే అది సులభమే. తాము పనిచేస్తున్న సంస్థకు ఆ విషయాన్ని తెలియజేసి రిజిస్ట్రేషన్ ఫామ్‌ను పూర్తి చేసి ఇస్తే సరిపోతుంది. ప్రతి నెలా ఎంత మొత్తాన్ని వీపీఎఫ్‌కు జమ చేయాలన్నది కూడా తెలియజేయాలి. అప్పటి వరకు కొనసాగుతున్న ఈపీఎఫ్ ఖాతాయే వీపీఎఫ్‌కూ వర్తిస్తుంది. వీపీఎఫ్ రూపంలో అదనంగా జమ చేసే మొత్తం కూడా ఈపీఎఫ్ బ్యాలెన్స్‌కే కలుస్తుంది. వీపీఎఫ్‌లో పెట్టుబడుల పరంగా సౌలభ్యం కూడా ఉంది. వీలున్నంత కాలం ఇన్వెస్ట్ చేసి, ఆ తర్వాత కొంత కాలం పాటు నిలిపివేయవచ్చు. అయితే, కొన్ని సంస్థలు ఏడాదికి ఒక్కసారే మార్పులకు అనుమతిస్తున్నాయి.

రిస్క్‌లేని అధిక రాబడులు

రిటైర్మెంట్ తర్వాత అవసరాల కోసం స్థిరాదాయ సాధనాల్లో పొదుపు చేసుకోవాలనుకునే వారికి వీపీఎఫ్ ఒక మంచి సాధనమన్నది నిపుణుల అభిప్రాయం. ఈపీఎఫ్ చందాకు అదనంగా స్వచ్ఛందంగా ఉద్యోగులు ఇందులో జమ చేసుకోవచ్చు. ప్రైవేటు రంగ ఉద్యోగులకు వారి మూల వేతనం, డీఏలో 12 శాతాన్ని ప్రతి నెలా వేతనం నుంచి మినహాయించి వారి ఈపీఎఫ్ ఖాతాకు సంస్థలు జమ చేస్తుంటాయి. ఇంతే మొత్తాన్ని ఉద్యోగి తరఫున సంస్థ కూడా తన వాటాగా అందజేస్తుంది. కానీ, ఈ పరిమితికి మించి ఈపీఎఫ్‌లో ఇన్వెస్ట్ చేసుకునేందుకు అవకాశం లేదు. దీనికి అదనంగా రిటైర్మెంట్ ఫండ్ కోసం మరికొంత పొదుపు చేసుకోవాలని భావించే వారికి వీపీఎఫ్ అనుకూలంగా ఉంటుంది. ఉద్యోగి తన మూలవేతనం, డీఏకు నూరు శాతం సమాన మొత్తాన్ని ప్రతి నెలా వీపీఎఫ్‌లో జమ చేసుకునే అవకాశం ఉంటుంది. ఉదాహరణకు ఒక ఉద్యోగి మూల వేతనం 12,000, డీఏ రూ.3,000 అనుకుంటే అప్పుడు ప్రతి నెలా గరిష్టంగా రూ.15,000ను వీపీఎఫ్‌లో జమ చేసుకోవచ్చు. వీపీఎఫ్ ఎందుకు ఆకర్షణీయం అంటే.. ఈపీఎఫ్ చందాలపై లభించే వడ్డీ రేటే వీపీఎఫ్ నిధికి కూడా వర్తిస్తుంది. ఉద్యోగుల భవిష్యనిధి సంస్థ (ఈపీఎఫ్‌వో) ప్రతీ ఆర్థిక సంవత్సరానికి పెట్టుబడులపై వచ్చిన ఆదాయం, నిధుల లభ్యతకు అనుగుణంగా వడ్డీ రేటును నిర్ణయిస్తుంటుంది. 2018-19 ఆర్థిక సంవత్సరానికి ఈపీఎఫ్ రేటు 8.65 శాతం కాగా, 2019-20 సంవత్సరానికి 8.5 శాతంగా నిర్ణయించింది. స్థిరాదాయ పథకాల్లో ఇది అత్యధిక రేటు. కొంత మంది విడిగా వీపీఎఫ్ ఖాతా తెరిచి ఇన్వెస్ట్ చేస్తుంటారు. కానీ వీపీఎఫ్‌తో పోలిస్తే కనీసం అర శాతానికి పైనే వీపీఎఫ్‌లో వడ్డీ రేటు ఉంటుందని ఆశించొచ్చు. ఈపీఎఫ్, వీపీఎఫ్ రెండూ కూడా క్యుములేటివ్ ఇన్వెస్ట్‌మెంట్ సాధనాలే. అంటే ఇందులో చేసే పెట్టుబడులపై వడ్డీ ఆదాయం ఏటా అసలుకు కలుస్తుంటుంది. దీంతో దీర్ఘకాలంలో మంచి కాంపౌండింగ్ వృద్ధి ఉంటుంది. అయితే, ఈపీఎఫ్ జమలకు వర్తించే లాకిన్, పాక్షిక ఉపసంహరణల నిబంధనలే వీపీఎఫ్‌కూ వర్తిస్తాయి.

రాబడుల వ్యత్యాసం

బ్యాంకు డిపాజిట్లపై ఇప్పుడు వడ్డీ రేటు 6.5% స్థాయిలకు పడిపోయింది. దీంతో వడ్డీ రేటు పరంగా వీపీఎఫ్ ఎంతో ఆకర్షణీయమనే చెప్పొచ్చు. పెద్దల కోసం ఉద్దేశించిన సీనియర్ సిటిజన్ సేవింగ్స్ స్కీమ్ (8.6%)ను మినహాయిస్తే చిన్న మొత్తాల పొదుపు పథకాల రేట్లతో పోల్చి చూసినా వీపీఎఫ్ రేటే అధికం. ఈక్విటీల్లో ఈపీఎఫ్ పెట్టుబడులు పెరుగుతూ ఉండడం, కార్మిక సంఘాల డిమాండ్ల కారణంగా కేంద్ర ప్రభుత్వం ఈపీఎఫ్, వీపీఎఫ్‌పై అధిక వడ్డీ రేటును నిర్ణయించక తప్పడం లేదు. రిటైర్మెంట్ పథకం ఎన్‌పీఎస్‌లో ఈక్విటీలకు గరిష్టంగా 75% కేటాయింపులకు అవకాశం ఉండడంతో దీర్ఘకాలంలో వీపీఎఫ్‌తో పోలిస్తే కొంత అదనపు రాబడులకు వీలుంది. కానీ, గడువు ముగిసిన తర్వాత ఉపసంహరించుకునే విషయంలో పరిమితులున్నాయి. ఆ విధంగా చూసుకుంటే వీపీఎఫ్ ఎంతో సౌలభ్యం. ఈపీఎఫ్/వీపీఎఫ్‌కు చేసే జమలకు కేంద్రం హామీ ఉండడం అదనపు ఆకర్షణ.

పన్ను వర్తించని సాధనం

వీపీఎఫ్‌కు చేసే జమలు, రాబడులు, ఉపసంహరణలు అన్నీ కూడా పన్ను ఆదా ప్రయోజనం కలిగినవి. ఎన్‌పీఎస్‌లో గడువు తీరే నాటికి సమకూరిన నిధిలో 40 శాతంపై పన్ను చెల్లించి ఉపసంహరించుకోవాల్సి ఉంటుంది. ఆ విధంగా చూస్తే, వీపీఎఫ్‌లో జమ అయిన మొత్తాన్ని ఎటువంటి పన్ను లేకుండా వెనక్కి తీసేసుకోవచ్చు. ఇందులో చేసే జమలకు సెక్షన్ 80సీ కింద రూ.1.5 లక్షల వరకు పన్ను లేకుండా చూసుకోవచ్చు. ఏ దశలోనూ పన్ను చెల్లించాల్సిన అవసరం లేదు కనుక.. వాస్తవికంగా పొందే రాబడి రేటు మెరుగైనదిగా భావించాలి. అయితే, వడ్డీ రేటు 9.5 శాతం మించితే అప్పుడు ఆ మొత్తంపై పన్ను చెల్లించాలి. కానీ, ఇటీవలి సంవత్సరాల్లో ఈపీఎఫ్, వీపీఎఫ్‌పై వడ్డీ రేటు 8.5-9 శాతం మధ్యే స్థిరపడడాన్ని చూస్తూనే ఉన్నాం. రిటైర్మెంట్ అనంతరం ఈపీఎఫ్, వీపీఎఫ్ నిధిని పన్ను లేకుండా వెనక్కి తీసేసుకోవచ్చు. ఒకవేళ రిటైర్మెంట్‌కు ముందుగా ప్రత్యేక అవసరాల్లో కొంత వెనక్కి తీసుకున్నా కానీ పన్ను చెల్లించాల్సిన అవసరం ఏర్పడదు. అయితే, కనీసం ఐదేళ్ల సర్వీసు పూర్తి చేసిన తర్వాత తీసుకుంటేనే పన్ను మినహాయింపు ప్రయోజనం వర్తిస్తుంది. ఐదేళ్ల సర్వీసు పూర్తి కాకముందే ఉపసంహరించుకునే మొత్తం రూ.50,000 మించితే 10 శాతాన్ని టీడీఎస్ కింద మినహాయించి ఆదాయపన్ను శాఖకు జమ చేస్తారు. అలాగే, అప్పటి వరకు ఆర్జించిన వడ్డీ రాబడి పైనా పన్ను పడుతుంది.

అవసరాల్లో అక్కరకు..

ఆర్థిక అత్యవసరాల్లో ఈపీఎఫ్‌లో మాదిరే వీపీఎఫ్ బ్యాలెన్స్‌ను కూడా వెనక్కి తీసుకునే వెసులుబాటు ఉంటుంది. పిల్లల వివాహాలు, వారి ఉన్నత విద్య, వైద్య అవసరాల కోసం, గృహ కొనుగోలుకు ఇందులోని బ్యాలెన్స్‌ను వెనక్కి తీసుకునేందుకు ఈపీఎఫ్‌వో అనుమతిస్తుంది. నిర్ణీత కాలం పాటు ఉద్యోగం లేకుండా ఉన్నా బ్యాలెన్స్‌ను ఉపసంహరించుకోవచ్చు. ఒక నెలకు మించి ఉద్యోగం లేకుండా కొనసాగితే, వీపీఎఫ్/ఈపీఎఫ్ బ్యాలెన్స్‌లో 75 శాతాన్ని వెనక్కి తీసుకునే అవకాశం ఉంటుంది. వరుసగా రెండు నెలల పాటు ఉద్యోగం లేని యెడల మిగతా మొత్తాన్ని కూడా వెనక్కి తీసేసుకోవచ్చు. పీపీఎఫ్‌తో పోలిస్తే ఎన్నో విధాలుగా ఈపీఎఫ్, వీపీఎఫ్‌లు ప్రయోజనకరం. పీపీఎఫ్‌లో పాక్షిక ఉపసంహరణలు, అది కూడా ఏడో ఏట నుంచే అవకాశం కల్పిస్తారు. 15 ఏళ్లు పూర్తయిన తర్వాతే పూర్తిగా వెనక్కి తీసుకోగలరు. కానీ, ఈపీఎఫ్/వీపీఎఫ్‌లో ఉపసంహరణల పరంగా సౌలభ్యత ఎక్కువ. పైగా రాబడి రేటు కూడా వీపీఎఫ్‌లో ప్రస్తుతమున్న 7.9 శాతంతో పోలిస్తే ఎక్కువే.

ఒడిదుడుకుల వారం!

- కరోనా పరిణామాలే కీలకం..
- భారీ ఆటుపోట్లకు అవకాశం
- అమెరికా ఫెడ్ సమావేశంపై దృష్టి...
- టోకు ద్రవ్యోల్బణం గణాంకాలు ఈవారంలోనే వెల్లడి...

ముంబై: ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు పెను సవాలుగా మారుతోన్న కోవిడ్-19 (కరోనా) వైరస్ కీలక పరిణామాలే ఈ వారంలోనూ దేశీ స్టాక్ మార్కెట్‌ను నడిపించనున్నాయని దలాల్ స్ట్రీట్ వర్గాలు భావిస్తున్నాయి. వైరస్ విస్తృతి ఆధారంగా సూచీల కదలికలు ఉండనున్నాయని మోతీలాల్ ఓస్వాల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ రిటైల్ రీసెర్చ్ హెడ్ సిద్ధార్థ ఖేమ్కా విశ్లేషించారు. శుక్రవారం ట్రేడింగ్ ప్రారంభంలోనే సెన్సెక్స్ చరిత్రలోనే అత్యధికంగా 3091 పాయింట్లు (10 శాతం) నష్టపోయి.. 45 నిమిషాల హాల్ట్ తరువాత, ట్రేడింగ్ తిరిగి ప్రారంభమైన కొద్ది సేపట్లోనే రికవరీతో పాటు 550 పాయింట్లవరకూ పెరిగింది. ఈ వారం ట్రేడింగ్‌లో కూడా ఇదే తరహాలో భారీ స్థాయి ఒడిదుడుకులకు ఆస్కారం ఉందని అన్నారు. ఇటువంటి ఆటుపోట్లను చూసి ఇన్వెస్టర్లు ఆందోళన చెందవద్దని సిద్ధార్థ సూచించారు. దేశంలో కరోనా బాధితుల సంఖ్య ఆదివారం నాటికి 108కి చేరింది. ముంబై తరువాత కర్ణాటక, కేరళలో వైరస్ తీవ్రత అధికంగా ఉందని వెల్లడైంది. ఇటువంటి పరిణామాలతో ఒడిదుడుకులు భారీ స్థాయిలోనే ఉండేందుకు ఆస్కారం ఉందని జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ పరిశోధనా విభాగం చీఫ్ వినోద్ నాయర్ విశ్లేషించారు. ముఖ్యంగా వైరస్ వ్యాప్తి ఆధారంగానే ఈ వారం మార్కెట్ గమనం ఉంటుందని రెలిగేర్ బ్రోకింగ్ వీపీ రీసెర్చ్ అజిత్ మిశ్రా అన్నారు. మార్కెట్లో ఒడిదుడుకులను సూచించే వోలటాలిటీ ఇండెక్స్ జీవితకాల గరిష్టస్థాయికి చేరినందున భారీ హెచ్చుతగ్గులకు అవకాశం ఉందని తాను భావిస్తున్నట్లు చెప్పారు. మార్కెట్లో బౌన్స్ బ్యాక్ ఉండొచ్చని ఇండియానివేష్ ఇనిస్టిట్యూషనల్ ఈక్విటీస్ హెడ్ వినయ్ పండిట్ తెలిపారు.

ఈ నెల్లో రూ. 37,976 కోట్లు వెనక్కి..

భారత క్యాపిటల్ మార్కెట్లో విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు (ఎఫ్‌పీఐ) ఈ నెల్లో ఇప్పటివరకు రూ. 37,976 కోట్లను ఉపసంహరించుకున్నారు. మార్చి 2-13 మధ్య కాలంలో ఈక్విటీ మార్కెట్ నుంచి రూ. 24,776 కోట్లను, డెట్ మార్కెట్ నుంచి రూ. 13,200 కోట్లను వెనక్కు తీసుకున్నారు.

ఎస్‌బీఐ చీఫ్‌ను అవమానించిన ఆర్థిక మంత్రి!

సోషల్ మీడియాలో వైరల్‌గా ఆడియో క్లిప్

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ దిగ్గజం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) చైర్మన్ రజనీష్ కుమార్‌పై కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తీవ్రమైన వ్యాఖ్యలు చేసిన ఆడియో క్లిప్ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఆడియో క్లిప్ ప్రకారం.. రుణవితరణ పెరగకపోవడానికి .. ముఖ్యంగా అస్సాం తేయాకు తోటల్లో పనిచేసే వారికి రుణాలు లభించకపోవడానికి ప్రధాన కారణం ఆయనేనంటూ నిర్మలా సీతారామన్ తీవ్ర పదజాలంతో తప్పుపట్టారు. ఎస్‌బీఐ జాలి లేని బ్యాంకంటూ ఆక్షేపించారు. ఒక్క మాటలో చెప్పాలంటే రజనీష్ కుమార్‌ను నిర్మలా సీతారామన్ ఘోరంగా అవమానించినట్లు ఆడియో క్లిప్ ద్వారా తెలుస్తోంది. ఫిబ్రవరి 27న గువాహాటిలో ఎస్‌బీఐ నిర్వహించిన కార్యక్రమంలో ఈ ఉదంతం చోటుచేసుకున్నట్లు భావిస్తున్నారు. మరోవైపు, రజనీష్‌పై ఆర్థిక మంత్రి వ్యాఖ్యలను అఖిల భారత బ్యాంక్ ఆఫీసర్ల సమాఖ్య (ఏఐబీవోసీ) ఖండించింది. ఎస్‌బీఐ ప్రతిష్టను దెబ్బతీసేందుకే గుర్తు తెలియని వారెవరో ఆడియో క్లిప్‌ను వైరల్ చేశారని, దీనిపై తక్షణం విచారణ జరపాలని పేర్కొంది.

సెన్సెక్స్ కీలకస్థాయి 34,130 పాయింట్లు

మార్కెట్ పంచాంగం

కరోనావైరస్ వివిధ దేశాలకు శరవేగంగా వ్యాప్తి చెందడం, పలు దేశాలు, కంపెనీలు ట్రావెల్ బ్యాన్స్ ప్రకటించడం, ఎన్నో కంపెనీలు వర్క్ ఫ్రమ్ హోమ్‌ను అమలుచేయడం వంటి పలు కారణాలతో ప్రపంచ ఈక్విటీ మార్కెట్లో 2008 ఆర్థిక సంక్షోభ అనంతరం అతిపెద్ద పతనం సంభవించింది. ఆయా కేంద్ర బ్యాంకులు వ్యవస్థలోకి తక్కువ వడ్డీరేట్లతో పుష్కలంగా విడుదల చేస్తున్న నిధులు కూడా మార్కెట్లను శాంతింపచేయలేకపోతున్నాయి. ఈ నేపథ్యంలో బుధవారం అమెరికా కేంద్ర బ్యాంక్ ఫెడరల్ రిజర్వ్ కమిటీ సమీక్ష సందర్భంగా 0.75-1 శాతం వరకూ వడ్డీ రేట్ల కోత వుండవచ్చన్న అంచనాలు మొదలవడంతో గత శుక్రవారం మార్కెట్ పతనాలకి బ్రేక్‌పడింది. అయితే ఈ వారం కూడా ఫెడ్ కంటే కరోనావైరస్ ప్రభావిత వార్తలే మార్కెట్‌ను నడిపించవచ్చు. ఇక మన సూచీల స్వల్పకాలిక సాంకేతికాలు ఇలా ఉన్నాయి...

సెన్సెక్స్ సాంకేతికాంశాలు...



మార్చి13తో ముగిసిన వారంలో గత మార్కెట్ పంచాంగంలో ప్రస్తావించిన 37,000 పాయింట్ల దిగువకు పడిపోయి నంతనే అనూహ్యపతనాన్ని చవిచూసిన బీఎస్‌ఈ సెన్సెక్స్ 29,388 పాయింట్ల వద్ద కనిష్ట స్థాయిని తాకింది. అటుతర్వాత కాస్త కోలుకుని 34.103 పాయింట్ల వద్ద ముగిసింది. అంతక్రితం వారం ముగింపుతో పోలిస్తే 3,474 పాయింట్ల భారీనష్టాన్ని చవిచూసింది. ఈ వారం కూడా సూచీ భారీగా కదలికల్ని కనపర్చే అవకాశం వుంది. ఈ సందర్భంలో.... జనవరి 20 నాటి రికార్డు గరిష్టస్థాయి అయిన 42,273 పాయింట్ల నుంచి గతవారపు 29,388 పాయింట్ల వరకూ జరిగిన 12,885 పాయింట్ల పతనంలో 38.2 శాతం ఫిబోనకి రిట్రేస్‌మెంట్ స్థాయి అయిన 34,310 పాయింట్ల స్థాయి సెన్సెక్స్‌కు కీలకమైనది. ఈ స్థాయిపైన రిలీఫ్‌ర్యాలీ జరిగే అవకాశాలు...ఈ స్థాయి దిగువన మళ్లీ పతనబాట పట్టే ప్రమాదమూ వుంటుంది. ఈ వారం మార్కెట్ పెరిగితే 34,770-35,260 శ్రేణిని తొలుత అందుకోవొచ్చు. అటుపైన వేగంగా 36,020 పాయింట్ల స్థాయికి చేరవచ్చు. ఆపై గరిష్టంగా 36,950-37,350 పాయింట్ల శ్రేణిని అందుకోవొచ్చు. పైన ప్రస్తావించిన కీలకస్థాయి దిగువన సెన్సెక్స్ వేగంగా 32,490 పాయింట్ల వద్దకు పడిపోవొచ్చు. ఈ స్థాయిని కోల్పోతే 31,220 పాయింట్ల వరకూ క్షీణించవచ్చు. ఈ స్థాయిని సైతం వదులుకుంటే తిరిగి 29,400 పాయింట్ల స్థాయిని పరీక్షించవచ్చు.

నిఫ్టీ కీలకస్థాయి 10,030



క్రితంవారం ఎన్ఎస్ఈ నిఫ్టీ 8,550 పాయింట్ల వరకూ హఠాత్ పతనాన్ని చవిచూసి, చివరకు అంతక్రితంవారంతో పోలిస్తే 1,034 పాయింట్ల భారీ నష్టంతో 9,955 పాయింట్ల వద్ద ముగిసింది. సెన్సెక్స్‌లానే నిఫ్టీకి 38.2 శాతం రిట్రేస్‌మెంట్ స్థాయి అయిన 10,030 పాయింట్ల స్థాయి ఈ వారం కీలకమైనది. ఈ వారం... ఈ స్థాయి ఎగువన తొలుత వేగంగా 10,160-10,335 శ్రేణిని చేరవచ్చు, ఈ శ్రేణిని సైతం అధిగమిస్తే 10,545 పాయింట్ల స్థాయిని అందుకోవొచ్చు. అటుపైన ముగిస్తే కొద్ది రోజుల్లో 10,750-10,950 శ్రేణి వరకూ రిలీఫ్ ర్యాలీ కొనసాగే ఛాన్స్ వుంటుంది. ఈ వారం 10,030 పాయింట్లపైన నిఫ్టీ నిలదొక్కుకోలేకపోతే 9,500 పాయింట్ల వద్ద తొలుత మద్దతు పొందవచ్చు. ఈ లోపున 9,100 వరకూ తగ్గవచ్చు. ఈ లోపున తిరిగి 8,555 స్థాయిని పరీక్షించవచ్చు.

– పి. సత్యప్రసాద్

'యస్'పై 18న మారటోరియం ఎత్తివేత

- అమల్లోకి వచ్చిన పునరుద్ధరణ ప్రణాళిక
- నెలాఖరుకు కొత్త బోర్డు ఏర్పాటు
- సీఈవో, ఎండీగా ప్రశాంత్ కుమార్

న్యూఢిల్లీ: సంక్షోభంలో చిక్కుకున్న ప్రైవేట్ రంగ యస్ బ్యాంక్ పునరుద్ధరణ ప్రణాళిక అమల్లోకి రావడంతో మార్చి 18న బ్యాంకుపై మారటోరియం తొలగిపోనుంది. ప్రస్తుతం ఆర్‌బీఐ నియమిత అడ్మినిస్ట్రేటరుగా ఉన్న ప్రశాంత్ కుమార్ ఆ తర్వాత సీఈవో, ఎండీగా బాధ్యతలు చేపడతారు. ఆయన సారథ్యంలో కొత్త బోర్డు ఏర్పాటవుతుంది. పునర్‌వ్యవస్థీకరించిన బోర్డులో సునీల్ మెహతా (పంజాబ్ నేషనల్ బ్యాంక్ మాజీ నాన్-ఎగ్జిక్యూటివ్ చైర్మన్).. నాన్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్‌గాను, మహేష్ కృష్ణమూర్తి, అతుల్ భెడా నాన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లుగా ఉంటారు. మార్చి 13 నుంచి యస్ బ్యాంక్ పునరుద్ధరణ స్కీమ్ 2020ని అమల్లోకి తెస్తూ జారీ చేసిన నోటిఫికేషన్‌లో ప్రభుత్వం ఈ అంశాలు పొందుపర్చింది. 'ప్రణాళిక అమల్లోకి తెచ్చిన మూడో పని దినం సాయంత్రం 6 గం.లకు మారటోరియం తొలగిపోతుంది. ఆ పైన 7 రోజుల తర్వాత కొత్త బోర్డు ఏర్పాటవుతుంది' అని నోటిఫికేషన్‌లో పేర్కొంది. ఏప్రిల్ 3 దాకా విత్‌డ్రాయల్స్‌ను రూ. 50,000కు పరిమితం చేస్తూ మార్చి 5న యస్ బ్యాంకుపై ఆర్‌బీఐ మారటోరియం విధించిన సంగతి తెలిసిందే.

ఎన్‌పీఏల ఒత్తిడి కొనసాగుతుంది..

మొండిబాకీలు తీవ్రం కావడంతో భారీనష్టాలు ప్రకటించిన యస్ బ్యాంక్ .. వచ్చే ఆర్థిక సంవత్సరంలో కూడా నిరర్థక ఆస్తుల (ఎన్‌పీఏ)పరమైన ఒత్తిడి కొనసాగుతుందని పేర్కొంది. అయితే, కొత్తగా వచ్చే రూ. 10,000 కోట్ల పెట్టుబడులతో బ్యాంక్ నిలదొక్కుకోగలదని, సమస్యలను అధిగమించగలదని ప్రశాంత్ కుమార్ ధీమా వ్యక్తం చేశారు.

షేర్లకు మూడేళ్ల లాకిన్..

పునరుద్ధరణ ప్రణాళిక ప్రకారం.. యస్ బ్యాంక్‌లో 49 శాతం దాకా వాటాలు తీసుకునే స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) వచ్చే మూడేళ్లలో తన వాటాలను 26 శాతం లోపు తగ్గించుకోవడానికి వీల్లేదు. ఇతర ఇన్వెస్టర్లు, ప్రస్తుత షేర్‌హోల్డర్ల పెట్టుబడుల్లో 75 శాతం షేర్లకు మూడేళ్ల లాకిన్ పీరియడ్ ఉంటుంది. తమ దగ్గరున్న మొత్తం షేర్లలో 25 శాతానికి మించి విక్రయించుకోవడానికి వీలు ఉండదు. అయితే, 100 లోపు షేర్లు ఉన్న వారికి ఈ లాకిన్ పీరియడ్ వర్తించదు. నోటిఫికేషన్ ప్రకారం.. యస్ బ్యాంక్‌లో 49% వాటాలు తీసుకునే ఎస్‌బీఐ.. ఇద్దరు డైరెక్టర్లను నామినేట్ చేస్తుంది. రిజర్వ్ బ్యాంక్ ఒకరు లేదా అదనంగా మరింత మంది డైరెక్టర్లను నియమించవచ్చు. ఎస్‌బీఐ మినహా 15 శాతం వోటింగ్ హక్కులు ఉన్న ఇతర ఇన్వెస్టర్లు ఒక్కొక్క డైరెక్టరు చొప్పున యస్ బ్యాంక్ బోర్డుకు నామినేట్ చేయొచ్చు. పునరుదద్ధరణ ప్రణాళిక ప్రకారం.. యస్ బ్యాంక్ అధీకృత మూలధనం రూ. 6,200 కోట్లుగా ఉంటుంది. యస్ బ్యాంక్ ఉద్యోగులు గత జీతభత్యాలు, సర్వీస్ నిబంధనల ప్రకారమే కొనసాగుతారు. అయితే 'మేనేజ్‌మెంట్‌లో కీలక ఉద్యోగుల' సేవలను కొత్త బోర్డు ఎప్పుడైనా ఉపసంహరించవచ్చని నోటిఫికేషన్ పేర్కొంది.

ఏ బ్యాంకు.. ఎంత పెట్టుబడి...

బ్యాంకు	రూ. కోట్లలో
ఎస్‌బీఐ	7,250
హెచ్‌డీఎఫ్‌సీ	1,000
ఐసీఐసీఐ బ్యాంక్	1,000
యాక్సిస్ బ్యాంక్	600
కోటక్ మహీంద్రా బ్యాంక్	500
బంధన్ బ్యాంక్	300
ఫెడరల్ బ్యాంక్	300
ఐడీఎఫ్‌సీ ఫస్ట్	250

క్యూ3 నష్టాలు రూ.18,654 కోట్లు

భారీగా పెరిగిన మొండి భారం

ముంబై: కష్టాల్లో కూరుకుపోయిన యస్ బ్యాంక్ ను తాజాగా ప్రకటించిన ఆర్థిక ఫలితాలు మరింత నిరాశపరిచాయి. ఈ ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికం(2019-20, క్యూ3)లో రూ.18,654 కోట్ల నికర నష్టాలు వచ్చాయి. క్రితం ఏడాది ఇదే కాలంలో రూ.1,009 కోట్ల నికర లాభం నమోదైంది. మొండి బకాయిలు భారీగా పెరిగిపోవడంతో కేటాయింపులు కూడా బాగా పెరగడం, డిపాజిట్లు తరిగిపోవడంతో నికర నష్టాలు ఈ స్థాయిలో పెరిగాయి. కాగా ఈ ఏడాది క్యూ2లో నష్టాలు రూ.600 కోట్లు. స్థూల మొండి బాకీలు ఈ ఏడాది మూడో త్రైమాసికంలో రూ.40,709 కోట్లకు(18.87 శాతం) ఎగిశాయి. నికర మొండి బకాయిలు 5.97 శాతానికి చేరాయి.

బంగారం దిగుమతుల్లో 9% క్షీణత

న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి 11 నెలల కాలంలో (2019 ఏప్రిల్ నుంచి 2020 ఫిబ్రవరి వరకు) 27 బిలియన్ డాలర్లు (రూ.1.90 లక్షల కోట్లు) విలువైన బంగారం భారత్‌లోకి దిగుమతి అయినట్లు కేంద్ర వాణిజ్య శాఖ తాజాగా వెల్లడించిన గణాంకాల ఆధారంగా వెల్లడైంది. అంతక్రితం ఏడాది (2018-19) ఇదేకాలంలో జరిగిన బంగారం దిగుమతులు 29.62 బిలియన్ డాలర్లు కాగా.. ఈ సారి 8.86 శాతం క్షీణత నమోదైంది. పసిడి దిగుమతులు ఈ స్థాయిలో తగ్గడం వల్ల కరెంటు ఖాతా లోటు (క్యాడ్) 143.12 డాలర్లకు తగ్గింది. అంతక్రితం ఏడాది 11 నెలల కాలంలో ఇది 173 బిలియన్ డాలర్లుగా ఉంది.

కోడిగుడ్లు (హోల్‌సేల్ -నెక్/100కు రూ.లలో) 16-3-2020

విశాఖ	300-00
చిత్తూరు	293-00
వరంగల

అత్యవసర నిధి ఏర్పాటు చేద్దాం

సార్క్ దేశాలకు ప్రధాని మోదీ పిలుపు

కోవిడ్‌పై పోరుకు భారత్ కోటి డాలర్ల విరాళం

సార్క్ దేశాధి నేతలతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న ప్రధాని మోదీ

న్యూఢిల్లీ: ప్రపంచాన్ని వణికిస్తున్న కరోనా వైరస్‌పై యుద్ధానికి సార్క్ దేశాలు నడుం బిగించాయి. కరోనాను కట్టడి చేసే దిశగా చర్యలు చేపట్టేందుకు సార్క్ దేశాల నేతలు ఆదివారం వీడియో కాన్ఫెరెన్స్‌లో పాల్గొన్నారు. కరోనాపై పోరుకు 'కోవిడ్-19 ఎమర్జెన్సీ ఫండ్'ను ఏర్పాటు చేయాలన్న భారత ప్రధాని మోదీ ప్రతిపాదనకు సభ్య దేశాల నేతలు ఏకీభావం తెలిపారు. భారత్ తరఫున ఈ ఫండ్ కోసం కోటి డాలర్లను(రూ.73.95 కోట్లు) మోదీ విరాళంగా ప్రకటించారు. 'మనం ముందు కోవిడ్-19 అత్యవసర నిధిని ఏర్పాటు చేయాలని ప్రతిపాదిస్తున్నా. మొదట, భారత్ తరఫున కోటి డాలర్లను ఆ ఫండ్ కోసం ప్రకటిస్తున్నా. ఇతర సభ్య దేశాలు కూడా స్వచ్ఛందంగా విరాళాలు ప్రకటించాలి' అని మోదీ పేర్కొన్నారు. కరోనా వ్యాప్తిని అడ్డుకునేందుకు భారత్‌లో యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టామన్నారు. వైద్య నిపుణులతో ర్యాపిడ్ రెస్పాన్స్ టీమ్స్‌ను ఏర్పాటు చేశామన్నారు. ఇతర వైద్య పరికరాలను, నిర్ధారణ పరీక్షలు జరిపే కిట్స్‌ను సిద్ధంగా ఉంచామన్నారు. అవసరమైతే, సార్క్ సభ్య దేశాలకు కూడా వాటిని సమకూర్చగలమన్నారు. వైరస్ వ్యాప్తిని సమీక్షించేందుకు ప్రత్యేకంగా ఒక పోర్టల్‌ను రూపొందించామన్నారు. ఆ సాఫ్ట్‌వేర్‌ను కూడా సార్క్ దేశాలకు ఇస్తామన్నారు. 'మన దేశాల్లో మొత్తంగా 150 కన్నా తక్కువ కేసులే నమోదయ్యాయి. అయినా, అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది' అని హెచ్చరించారు. వేరువేరుగా కాకుండా, ఒక్కటిగా కరోనా వైరస్‌పై పోరు సాగించాలని సభ్య దేశాలకు ఆయన పిలుపునిచ్చారు. భయాందోళనలకు గురికాకుండా, వైరస్‌ను అడ్డుకునేందుకు ప్రణాళికాబద్ధంగా ముందుకు పోవాలని సూచించారు. వీడియో కాన్ఫెరెన్స్‌లో శ్రీలంక అధ్యక్షుడు రాజపక్స, నేపాల్ ప్రధాని కేపీ శర్మ ఓలి, భూటాన్ ప్రధాని షెరింగ్, బంగ్లాదేశ్ పీఎం షేక్ హసీనా, అఫ్గానిస్తాన్ అధ్యక్షుడు అష్రాఫ్ ఘనీ, మాల్దీవుల అధ్యక్షుడు ఇబ్రహీం మొహమ్మద్ సోలిహ్, పాక్ ప్రధానికి ఆరోగ్య రంగంలో ప్రత్యేక సలహాదారు జాఫర్ మీర్జా పాల్గొన్నారు. కరోనా నిర్మూలన లక్ష్యంతో ఏర్పాటైన ఈ కార్యక్రమంలోనూ పాకిస్తాన్ కశ్మీర్ అంశాన్ని లేవనెత్తింది. కశ్మీర్లో నిర్బంధాలను తొలగించాలని కోరింది. వైరస్‌ను అరికట్టడంలో చైనా గొప్పగా వ్యవహరించిందని పాక్ ప్రశంసించింది. వైరస్‌పై పోరును సమన్వయం చేసేందుకు సార్క్ దేశాలు ఒక మంత్రుల బృందాన్ని ఏర్పాటు చేసుకోవాలని రాజపక్స సూచించారు. ప్రధాని మోదీ సూచనలను, వైరస్ కట్టడికి భారత్ చేపట్టిన చర్యలను సభ్య దేశాల నేతలు ప్రశంసించారు.

కరోనా టీకా కోసం యూఎస్ కుయుక్తులు!

బెర్లిన్: కరోనా వైరస్‌ను నిర్మూలించే టీకాను రూపొందించే పరిశోధనలో ఉన్న ఒక జర్మన్ సంస్థ నుంచి ఆ టీకా హక్కులను పొందేందుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రయత్నిస్తున్నారన్న వార్త యూరప్‌లో హల్‌చల్ చేస్తోంది. దీనిపై జర్మనీ ప్రభుత్వం కూడా స్పందించింది. టీకాను జర్మనీ, యూరోప్‌ల్లోనే ఉత్పత్తి చేయాలనేది జర్మన్ ప్రభుత్వ ఉద్దేశమని స్పష్టం చేసింది. జర్మనీకి చెందిన బయోటెక్ కంపెనీ 'క్యూర్‌వాక్' కరోనావైరస్‌కు టీకాను రూపొందించే పనిలో ఉంది. ఆ సంస్థ నుంచి ఆ టీకాకు సంబంధించిన అన్ని హక్కులను సొంతం చేసుకోవాలని, ఆ టీకా వినియోగాన్ని అమెరికాకు మాత్రమే పరిమితం చేయాలని ట్రంప్ ఆలోచన అని యూరప్ మీడియాలో వార్తలు వచ్చాయి. ఈ వార్తలపై అమెరికా స్పందించింది. 'వ్యాక్సీన్‌ని రూపొందించే పరిశోధనల్లో ఉన్న అనేక కంపెనీలతో అమెరికా సంప్రదింపులు జరుపుతోంది. ఆ టీకాను అమెరికాకే పరిమితం చేసే ఆలోచన లేదు. దాన్ని ప్రపంచంతో పంచుకుంటాం' అని ఆ దేశ ఉన్నతాధికారి ఒకరు వివరించారు.

కోవిడ్ కేసులు 107

కేరళను మించిన మహారాష్ట్ర • ఆందోళన వద్దన్న కేంద్రం • కర్తార్‌పూర్ కారిడార్‌లో రాకపోకలపై నిషేధం

న్యూఢిల్లీ: కోవిడ్ (కరోనా వైరస్) భారత్‌లో స్థానికంగానే వ్యాపిస్తోంది. మొత్తం కేసుల సంఖ్య 107కి పెరిగింది. మహారాష్ట్రలో అత్యధికంగా కేసులు నమోదయ్యాయి. కొత్తగా 12 కేసులు ఆ రాష్ట్రంలోనే నమోదయ్యాయని కేంద్ర ఆరోగ్య శాఖ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపింది. కేసుల సంఖ్య పెరిగినా ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవరం లేదని, అప్రమత్తంగా ఉంటే సరిపోతుందని సూచించింది. ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా శనివారం అర్ధరాత్రి నుంచి అన్ని దేశాల సరిహద్దుల్ని మూసివేసిన కేంద్రం తాజాగా కర్తార్‌పూర్ సాహిబ్ గురుద్వారా మార్గం వెంబడి కూడా రాకపోకలపై నిషేధం విధించింది. ఆ మార్గం ద్వారా సిక్కు భక్తులు పాక్‌కు వెళ్లడానికి తాత్కాలికంగా రిజిస్ట్రేషన్లను నిలిపివేశారు.

ఇరాన్ నుంచి తిరిగి వచ్చిన భారతీయుల లగేజీపై జైసల్మేర్‌లోని ఆర్మీ ఆస్పత్రి వద్ద మందును స్ప్రే చేస్తున్న సిబ్బంది

స్థానికంగా వైరస్ వ్యాప్తి

ప్రస్తుతం కరోనా వ్యాప్తి మన దేశంలో స్థానికంగా ఒకరి నుంచి మరొకరికి సంక్రమించే దశలోనే ఉంది. దీనిని రెండో దశ అంటారు. ఇక మూడో దశలో జన సమూహాలకు సోకి వివిధ ప్రాంతాలకు విస్తరిస్తుంది. ఆ దశ రాకుండానే కేంద్రం, అన్ని రాష్ట్రాలు కరోనాపై యుద్ధం ప్రకటించాయి. పకడ్బందీ చర్యలు చేపట్టడంతో హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించాల్సిన అవసరం ఇంకా రాలేదని కేంద్ర ఆరోగ్య శాఖ అధికారి ఒకరు వెల్లడించారు. అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో జన సందోహాలు గుమికూడకుండా పర్యవేక్షణ, కోవిడ్-19 సోకిందని అనుమానాలున్న వారిని విడిగా ఉంచడం, వైరస్ నుంచి వ్యక్తిగత రక్షణ కోసం మాస్కులు, శానిటైజర్ల వంటివి అందుబాటులో ఉంచడం , సుశిక్షితులైన మానవ వనరులు, చురుగ్గా స్పందించే బృందాలను బలోపేతం చేయడం వంటివి చేస్తున్నామని అన్నారు. 80,50,000 ఎన్95 మాస్కుల కోసం ఆర్డర్ ఇచ్చామని, హెల్త్‌కేర్ వర్కర్స్‌కి అందిస్తామని తెలిపారు.

కరోనా నేపథ్యంలో ఢిల్లీ-జమ్మూ రాజధాని ఎక్స్‌ప్రెస్ బోగీని శుభ్రం చేస్తున్న కార్మికుడు

మహారాష్ట్రలో మరణించిన వ్యక్తికి కరోనా లేదు

మహారాష్ట్రలో బుల్దానాలో ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరణించిన 71 ఏళ్ల వృద్ధుడికి కరోనా సోకలేదని నిర్ధారణ అయినట్టుగా ఆరోగ్య మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. సౌదీ అరేబియా నుంచి తిరిగి వచ్చిన ఆయన మరణించడానికి ముందు సేకరించిన నమూనాలను పరీక్షించి చూస్తే కరోనా సోకలేదని తేలింది. తొలుత ఆ వృద్ధుడు కరోనాతో మరణించాడన్న అనుమానాలు తలెత్తాయి.

రాష్ట్రం	కేసులు
మహారాష్ట్ర	31
కేరళ	22
ఉత్తరప్రదేశ్	11
ఢిల్లీ	7
కర్ణాటక	6
తెలంగాణ	3
లద్దాఖ్	3
కశ్మీర్	2
రాజస్తాన్	2

తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, పంజాబ్‌లో ఒక్కో కేసు నమోదయ్యాయి. ఇవే కాకుండా 17 మంది విదేశీయులు కూడా కోవిడ్-19 వ్యాధి సోకి భారత్‌లోనే చికిత్స పొందుతున్నారు. వారిలో 16 మంది ఇటలీ టూరిస్టులు కాగా, మిగిలిన ఒకరు కెనడావాసి.

ఇరాన్, ఇటలీ నుంచి భారతీయులు వెనక్కి

ఇరాన్ నుంచి మూడో విడత 236 మంది భారతీయుల్ని వెనక్కి తీసుకువచ్చారు. వారందరినీ జైసల్మీర్‌లో ఆర్మీ ఏర్పాటు చేసిన కేంద్రానికి తరలించి వైద్యుల పర్యవేక్షణలో ఉంచారు. చైనా తర్వాత అత్యధికంగా కరోనా దాడి చేసిన ఇటలీ నుంచి 218 మంది భారతీయుల్ని ఆదివారం వెనక్కి తెచ్చారు. వారిలో 211 మంది విద్యార్థులే ఉన్నారు. వీరిని వాయవ్య ఢిల్లీలోని చావ్లా ప్రాంతంలో ఏర్పాటు చేసిన కేంద్రంలో వైద్యుల పర్యవేక్షణలో ఉంచారు. దుబాయ్ నుంచి కేరళకు వచ్చిన 20 మంది ప్రయాణికుల్లో బ్రిటన్‌కు చెందిన వ్యక్తికి కరోనా వైరస్ సోకినట్టు నిర్ధారణ కావడంతో అతడిని కొచ్చి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మహారాష్ట్రలో కేసుల సంఖ్య పెరిగిపోతూ ఉండడంతో స్వదేశీ, విదేశీ టూర్లపై కూడా ముంబై సీపీ నిషేధం విధించారు. తాజాగా తమిళనాడు, అస్సాం, ఉత్తరాఖండ్‌లో పాఠశాలలు, షాపింగ్ మాల్స్ రెండు వారాల పాటు బంద్ చేశారు.


కరోనా విస్తరించకుండా స్పెయిన్ ఎమర్జెన్సీ ప్రకటించి ముందస్తు చర్యలు తీసుకుంటోంది. ప్రజలంతా ఇళ్లకే పరిమితం కావడంతో బార్సెలోనాలోని ఓ రోడ్డు ఇలా నిర్మానుష్యంగా మారింది.

యూరప్ అతలాకుతలం

- విజృంభిస్తున్న కోవిడ్
- ప్రపంచవ్యాప్తంగా ఆరువేలు దాటిన మరణాలు
- స్పెయిన్‌లో కరోనా సైరన్
- ఇటలీలో ఒక్కరోజే 368 మరణాలు
- ట్రంప్‌కి కరోనా సోకలేదు

లండన్/వాషింగ్టన్ : చైనాలో పుట్టిన కరోనా వైరస్ ఐరోపా దేశాలకు విస్తరించి అతలాకుతలం చేస్తోంది. ఇన్నాళ్లూ ఇటలీలో విజృంభించిన ఈ మహమ్మారి, ఇప్పుడు స్పెయిన్‌లో రాత్రికి రాత్రి ఉధృతమైపోయింది. ఒకే రోజు ఏకంగా 2,000 కేసులు నమోదయ్యాయి. మొత్తం కేసులు 8 వేలకి చేరువలో ఉంటే 288 మంది ప్రాణాలు కోల్పోవడంతో ఆరోగ్య అత్యవసర పరిస్థితి విధించారు. నిత్యావసర దుకాణాలు, ఫార్మసీలు మినహాయించి అన్నింటినీ మూసివేస్తున్నట్టు స్పెయిన్ ప్రభుత్వం ప్రకటించింది. రెండు వారాల పాటు ఈ నిషేధం కొనసాగుతుంది. ఐరోపా దేశాల్లో 1,907 మంది ప్రాణాలు కోల్పోయారు. ప్రపంచవ్యాప్తంగా కరోనా కేసులు 1.59 లక్షలకుపైగా నమోదుకాగా, మృతుల సంఖ్య ఆరు వేలు దాటింది.

స్పెయిన్ ప్రధాని భార్యకి కరోనా

సామాన్యుల దగ్గర్నుంచి దేశాధినేతల కుటుంబాల వరకు కరోనా ఎవరినీ విడిచిపెట్టడం లేదు. తాజాగా స్పెయిన్ ప్రధానమంత్రి పెడ్రో సాంచెజ్ భార్య బెగోనా గోమెజ్‌కు కరోనా సోకినట్టు నిర్ధారణ అయింది. దీంతో ఆమె తన గదికే పరిమితమయ్యారు. ఇప్పటికే పెడ్రో కేబినెట్‌లో ఇద్దరు మంత్రులకు కరోనా సోకింది.

ప్రపంచవ్యాప్తంగా కరోనా కేసులు
1,59,844
మృతుల సంఖ్య
6,036
కోలుకున్నవారు
74,000కు పైగా

బ్రిటన్‌లో మరణాలు రెట్టింపు

కేవలం 24 గంటల్లోనే బ్రిటన్‌లో కరోనా మహమ్మారి 10 మంది ప్రాణాలు తీసుకుంది. ఆ దేశంలో మృతుల సంఖ్య 11 నుంచి 21కి చేరుకుంది.కేసులు 1200వరకు పెరిగాయి. ఫ్రాన్స్‌లో కూడా కరోనా బెంబేలెత్తిస్తోంది. నైట్ లైఫ్‌కి పెట్టింది పేరైన ఫ్రాన్స్ అన్ని నైట్ క్లబ్బులు రెస్టారెంట్లు, బార్లు, థియేటర్లు మూసేసింది. అయితే ఆదివారం స్థానిక ఎన్నికల్ని మాత్రం యథావిధిగా నిర్వహించింది. జాగ్రత్తలు ఎన్ని తీసుకున్నా ఇటలీలో కరోనా అదుపులోకి రావడం లేదు. ఒకే రోజు 368 మంది మృతి చెందగా 20% కేసులు పెరిగి 21 వేలు దాటేశాయి. చైనాలో ఆదివారం మరో 10 మంది ప్రాణాలు కోల్పోయారు. దీంతో ఆ దేశంలో మృతుల సంఖ్య 3,199కి చేరుకుంది. ఇరాన్‌లో మరో 113 మంది ప్రాణాలు కోల్పోతే, కేసులు 724 పెరిగాయి.

బకింగ్‌హామ్ ప్యాలెస్ నుంచి ఎలిజబెత్ రాణి తరలింపునకు సన్నాహాలు

కరోనా భయాందోళనలు నెలకొన్న నేపథ్యంలో బ్రిటన్ రాణి ఎలిజబెత్ (93), ఆమె భర్త ప్రిన్స్ ఫిలిప్ (98) దంపతులను లండన్‌లోని బకింగ్‌హామ్ ప్యాలెస్ నుంచి నార్‌ఫోల్క్‌లోని రాయల్ శాండ్రింగమ్ ఎస్టేట్‌కు తరలించనున్నారు. లండన్ నడిబొడ్డున బకింగ్‌హామ్ ప్యాలెస్ ఉండడంతో వచ్చిపోయే అతిథులు, సిబ్బంది ఎక్కువగా ఉంటారు. తొంబై ఏళ్ల వయసు దాటిన రాణిని అంతమంది మధ్యలో ఉంచడం ఇష్టం లేక 70 మంది సిబ్బందితో ఆమెను తరలించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు.

త్వరలో వాట్సాప్‌లో కొత్త ఫీచర్

శాన్‌ఫ్రాన్సిస్కో: ఇటీవల డార్క్ మోడ్‌ను ప్రవేశపెట్టిన వాట్సాప్ త్వరలో స్వీయ అంతర్ధాన సందేశ (సెల్ఫ్ డిస్ట్రక్షన్ మెసేజెస్) వెసులుబాటును అందుబాటులోకి తీసుకురానుంది. ఈ ఫీచర్ అందుబాటులోకి వస్తే యూజర్లు తాము పంపే మెసేజ్‌లను ఆటోమేటిక్‌గా డిలీట్ చేసేలా సెట్టింగు పెట్టుకోవచ్చు. నిర్ణీత కాలం తర్వాత (గంట, రోజు, వారం, నెల, సంవత్సరం) ఆ మెసేజ్‌లు డిలీట్ అయిపోతాయి. ఈ ఫీచర్‌పై వాట్సాప్ డెవలపర్లు కసరత్తులు చేస్తున్నట్లు ఓ టెక్ వెబ్‌సైట్ తెలిపింది. మొదటగా ఈ ఫీచర్‌ను గ్రూపు చాట్‌లకు మాత్రమే పరిమితం చేసే యోచనలో ఉన్నారు. గ్రూపు సెట్టింగ్స్‌లో ఈ ఫీచర్‌కు సంబంధించిన మరిన్ని సెట్టింగులను ఉంచనున్నారు. ఇతర ఫీచర్లలాగే మొదట ఇది వాట్సాప్ బీటా యూజర్లకు వచ్చే అవకాశం ఉంది. పూర్తి పరిశీలన అనంతరం అప్‌డేట్ ద్వారా యూజర్లందరికీ అందిస్తారు.

'సుప్రీం' కాంప్లెక్స్‌లోకి సందర్శకులకు నో

న్యూఢిల్లీ: కోవిడ్ వ్యాప్తి నేపథ్యంలో అత్యున్నత న్యాయస్థానం మరిన్ని తీవ్ర నిర్ణయాలు తీసుకుంది. న్యాయస్థానం ఆవరణలోకి ప్రతి శనివారం సందర్శకులకు బృందాలుగా ఇచ్చే అనుమతులను రద్దు చేసింది. కోర్టు క్యాంటీన్, కెఫేలను మూసివేయాలని ఆదివారం ఆదేశించింది. ఈ నెల 16వ తేదీన మొత్తం 15 ధర్మాసనాలకు గాను 6 మాత్రమే పనిచేస్తాయని, 12 అత్యవసర కేసులను మాత్రమే విచారిస్తాయని ఇప్పటికే సుప్రీంకోర్టు ప్రకటించిన విషయం తెలిసిందే. 'కోర్టు ఆవరణలోకి సాధారణ సందర్శకులను తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు నిలిపివేయాలి. లాయర్లు, కోర్టు సిబ్బంది, చిరు వ్యాపారులు ప్రతి రోజూ సాయంత్రం 5.30 గంటలకల్లా ఆవరణ విడిచి బయటకు వెళ్లిపోవాలి. 6 గంటలకల్లా కోర్టులోని విశ్రాంతి గదులు, కారిడార్లు, మెట్లు తదితరాలను శుభ్రం చేయాలి. లాయర్లు, కక్షిదారులు, గుమాస్తాలు ఆవరణలో గుమి కూడరాదని, విధులు ముగిసిన తక్షణమే వెళ్లిపోవాలి' అని ఆదేశించింది.

నలుగురు ఉగ్రవాదుల హతం

ఎన్‌కౌంటర్ జరిగిన ప్రాంతంలో భద్రతా బలగాలు

జమ్మూకశ్మీర్‌లో భారీ ఎన్‌కౌంటర్

జమ్మూ: ఉగ్రవాదులు నక్కి ఉన్నారన్న పక్కా సమాచారంతో భద్రతాబలగాలు సోదాలు చేపట్టి నలుగురు ఉగ్రవాదులను మట్టుబెట్టిన ఘటన జమ్మూకశ్మీర్‌లో చోటుచేసుకుంది. దక్షిణ కశ్మీర్ జిల్లాలోని దార్ మొహల్లా వాటరిగమ్ ప్రాంతంలో ఆదివారం ఉదయం ఈ ఎదురు కాల్పులు చోటుచేసుకున్నాయి. మరణించిన ఉగ్రవాదులు లష్కరే తోయిబా, హిజ్బుల్ ఉగ్రసంస్థలకు చెందిన ముజఫర్ అహ్మద్ భట్, ఒమర్ అమీన్ భట్, సాజద్ అహ్మద్ భట్, గుల్జార్ అహ్మద్ భట్‌లుగా గుర్తించారు. ఇందులో గుల్జార్ హిజ్బుల్‌కు చెందిన ఉగ్రవాది కాగా, మిగిలిన వారు లష్కరే తోయిబాకు చెందిన వారు. వీరంతా కుల్గామ్ జిల్లాకు చెందిన వారని అధికారులు తెలిపారు. ఘటనా స్థలం నుంచి రెండు ఏకే 47 రైఫిళ్లు, రెండు పిస్తోళ్లు, ఇతర సామగ్రి స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు.

ట్రంప్‌కి కరోనా నెగెటివ్



అమెరికాలో కరోనా వైరస్ ఉధృత రూపం దాలుస్తున్నప్పటికీ ఆ దేశ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కి వైద్య పరీక్షల్లో నెగెటివ్ రావడంతో వైట్ హౌస్ ఊపిరి పీల్చుకుంది. ఫ్లోరిడాలో గత వారం ట్రంప్‌ని కలుసుకున్న బ్రెజిల్ కమ్యూనికేషన్ చీఫ్ ఫాబియోకు కరోనా సోకడంతో ట్రంప్‌కి కూడా ఈ మహమ్మారి సోకుతుందా అన్న సందేహాలు చుట్టుముట్టాయి. ఆయనకు కరోనా లక్షణాలేవీ లేకపోయినప్పటికీ ముందు జాగ్రత్త చర్యగా వైద్యపరీక్షలు చేయించుకున్నారు. ఆ పరీక్షల్లో కరోనా సోకలేదని తేలిందని ట్రంప్ వ్యక్తిగత వైద్యుడు సియాన్ కోన్లీ ఒక ప్రకటనలో వెల్లడించారు. మరోవైపు కరోనా వైరస్‌ను కట్టడి చేయడానికి అమెరికా మరిన్ని చర్యలు చేపట్టింది. బ్రిటన్, ఐర్లాండ్ ప్రయాణాలపై నిషేధం విధించింది. ఇప్పటికే అగ్రరాజ్యంలో 2,100 కేసులు నమోదు కాగా 60 మంది ప్రాణాలు కోల్పోయారు.

ఉగ్రవాదులూ..యూరప్ వెళ్లొద్దు: ఐసిస్

లండన్: యూరప్‌లో దాడులు జరపాలంటూ తన శ్రేణులను పురిగొల్పే ఉగ్రసంస్థ ఇస్లామిక్ స్టేట్(ఐసిస్) కరోనా వైరస్ వ్యాప్తి నేపథ్యంలో ఈసారి మాట మార్చింది. కోవిడ్‌తో సతమతమవుతున్న యూరప్ దేశాలకు ప్రయాణాలను మానుకోవాలని ఐసిస్ తన శ్రేణులను కోరింది. ఈ మేరకు తన పత్రిక 'అల్ నబా'లో ఐసిస్ పలు ఆదేశాలిచ్చిందని 'సండే టైమ్స్'పేర్కొంది. 'అంటువ్యాధుల భూమి యూరప్'వైపు ఆరోగ్యవంతులు వెళ్లరాదు. ఇప్పటికే వ్యాధికి గురైన వారు, ఇతరులకు వ్యాపించకుండా ఉండేందుకు సొంత ప్రదేశం విడిచి బయటకు వెళ్లవద్దు. ముక్కు చీదేటప్పుడు, ఆవులించే సమయంలో నోటికి గుడ్డను, చేతిని అడ్డుపెట్టుకోవాలి. క్రమం తప్పక చేతులు కడుక్కోవాలి'అని సూచించింది. కోవిడ్‌ను మహమ్మారిగా పేర్కొన్న ఐసిస్.. 'ఎవరిని హింసించాలని దేవుడు అనుకున్నాడో అక్కడికే దీనిని పంపాడు'అని పేర్కొంది.

నేడు 'బల నిరూపణ' ఉంటుందా?

- నేటి నుంచి మధ్యప్రదేశ్‌లో అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు
- తొలిరోజే విశ్వాస పరీక్ష జరగాలన్న గవర్నర్
- నిర్ణయం సభలో ప్రకటిస్తానన్న స్పీకర్

మధ్యప్రదేశ్ అసెంబ్లీ వద్ద భారీగా మోహరించిన భద్రతా బలగాలు

భోపాల్: రాజకీయ సంక్షోభం నెలకొన్న మధ్యప్రదేశ్‌లో నేటి(సోమవారం) నుంచి అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ప్రారంభం అవుతున్నాయి. సభను ఉద్దేశించి ఉదయం తాను ప్రసంగించిన అనంతరం విశ్వాస పరీక్షను ఎదుర్కోవాలని కమల్‌నాథ్ నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని గవర్నర్ లాల్జీ టాండన్ శనివారం రాత్రి ఆదేశించారు. 'నా ప్రసంగం ముగియగానే, విశ్వాస పరీక్ష ప్రక్రియను ప్రారంభించాలి. ఎట్టి పరిస్థితుల్లో మార్చి 16న అది జరగాలి. వాయిదా వేయకూడదు' అని ముఖ్యమంత్రి కమల్‌నాథ్‌కు పంపిన లేఖలో ఆయన విస్పష్టంగా పేర్కొన్నారు. అయితే, ప్రభుత్వం విశ్వాస పరీక్షను ఎదుర్కోవడంపై తన నిర్ణయం సోమవారం ప్రకటిస్తానని స్పీకర్ ఎన్పీ ప్రజాపతి వెల్లడించారు. దాంతో సోమవారం విశ్వాస పరీక్ష జరుగుతుందా? అనే విషయంపై ఉత్కంఠ నెలకొంది. కాంగ్రెస్ ఎమ్మెల్యేల్లో 22 మంది రాజీనామా చేయడం, దాంతో మిగిలిన ఎమ్మెల్యేలను రాజస్తాన్ రాజధాని జైపూర్‌కు కాంగ్రెస్ తరలించడం తెలిసిందే. వారంతా బడ్జెట్ సమావేశాల్లో పాల్గొనేందుకు వీలుగా ఆదివారం తిరిగివచ్చారు. వారిని ఇళ్లకు పంపించకుండా, భోపాల్‌లోని ఒక హోటల్‌కు తరలించారు. రాజీనామా చేసిన 22 మంది ఎమ్మెల్యేల్లో ఆరుగురి రాజీనామాలను మాత్రమే స్పీకర్ ఆమోదించారు. కాగా, సభ్యులంతా అసెంబ్లీకి హాజరై, పార్టీ నిర్ణయం మేరకు ఓటేయాలని కాంగ్రెస్, బీజేపీ విప్ జారీ చేశాయి. కాగా, విశ్వాస పరీక్షకు సంబంధించిన విషయం అసెంబ్లీ సెక్రటేరియట్ ఆదివారం రాత్రి విడుదల చేసిన 'సభాకార్యక్రమాల జాబితా'లో లేకపోవడం గమనార్హం. గవర్నర్ ప్రసంగం, ఆ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే అంశాలు మాత్రమే అందులో ఉన్నాయి.

ఈ రోజు డౌటే..: సోమవారం ముఖ్యమంత్రి కమల్‌నాథ్ విశ్వాస పరీక్షను ఎదుర్కోకపోవచ్చని తెలుస్తోంది. సోమవారం బల నిరూపణ చేసుకోవాలని గవర్నర్ ఆదేశించినప్పటికీ.. తుది నిర్ణయాధికారం స్పీకర్‌కే ఉంటుందని రాష్ట్ర మంత్రి పీసీ శర్మ పేర్కొన్నారు. అయితే, ముందుగా ఎమ్మెల్యేలందరికీ కరోనా నిర్ధారణ పరీక్షలు జరపాలన్నారు. ఈ బల నిరూపణ సోమవారం జరగదని, ఈ అంశం కోర్టుకు వెళ్లే అవకాశం ఉందని కాంగ్రెస్ ఎమ్మెల్యే ఒకరు సంకేతాలిచ్చారు. మరోవైపు, గవర్నర్ ప్రసంగం పూర్తి కాగానే, విశ్వాస పరీక్ష జరపాలని డిమాండ్ చేస్తూ, సభాకార్యక్రమాలను బీజేపీ అడ్డుకునే అవకాశముంది. విశ్వాస పరీక్షను ఎదుర్కోవాలని ఆదేశిస్తూ సీఎం కమల్‌నాథ్‌కు గవర్నర్ టాండన్ రాసిన లేఖలో.. ఎలక్ట్రానిక్ ఓటింగ్ విధానంలో మాత్రమే బల నిరూపణ జరగాలని ఆదేశించారు. అసెంబ్లీలో 228 మంది సభ్యులుండగా, ఆరుగురి రాజీనామాలు ఆమోదం పొందడంతో అది 222కి చేరింది. మిగతా 16 మంది ఎమ్మెల్యేల రాజీనామాలూ ఆమోదం పొందితే ఆ సంఖ్య 206కి చేరుతుంది. అప్పుడు మెజారిటీకి అవసరమైన మ్యాజిక్ నంబర్ 104 అవుతుంది. బీజేపీకి 107 మంది ఎమ్మెల్యేలున్నారు. రాజీనామాలకు ముందు సభలో కాంగ్రెస్ బలం 114. అందరి రాజీనామాలు ఆమోదం పొందితే అది 92కి చేరుతుంది. అలాగే, నలుగురు స్వతంత్ర, ఇద్దరు బీఎస్పీ, ఒక ఎస్పీ ఎమ్మెల్యే ఎటువైపు నిలుస్తారన్నదీ ప్రశ్నార్థకమే.

గుజరాత్ లో కాంగ్రెస్‌కు షాక్

అహ్మదాబాద్: రాజ్యసభ ఎన్నికల ముందు కాంగ్రెస్‌కు గుజరాత్‌లో షాక్ తగిలింది. నలుగురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు రాజీనామా చేశారు. ఆ రాజీనామాలను ఆమోదించినట్లు స్పీకర్ త్రివేదీ తెలిపారు. దీంతో సభలో కాంగ్రెస్ బలం 73నుంచి 69కి చేరింది. కాగా, రాజ్యసభ ఎన్నికల్లో తమ ఎమ్మెల్యేలను బీజేపీ ప్రలోభపెట్టే అవకాశముందనే భయంతో కాంగ్రెస్ 14 మంది ఎమ్మెల్యేలను జైపూర్‌కు తరలించింది. గుజరాత్ నుంచి బీజేపీ ముగ్గురు అభ్యర్థులను రాజ్యసభ బరిలో నిలిపింది. అయితే, వారిలో ఇద్దరిని మాత్రమే బీజేపీ గెలిపించుకోగలదు.

రైళ్లలో దుప్పట్లు ఇవ్వం

న్యూఢిల్లీ: కోవిడ్ కలకలం నేపథ్యంలో రైల్వే శాఖ కీలక నిర్ణయం తీసుకుంది. రైళ్లలోని ఏసీ కోచ్‌ల్లో ప్రయాణికులకు కర్టన్లు, కప్పుకునే దుప్పట్లు ఇవ్వకూడదని ఆదేశాలు జారీచేసింది. వాటిల్లో వాడే కర్టన్లు, దుప్పట్లను రోజూ ఉతకడం కుదరదు కాబట్టి ప్రయాణికులకు వాటిని ఇవ్వరాదంది. కోచ్‌ల్లోని బెడ్‌షీట్లు, టవల్స్, పిల్లో కవర్స్‌ను మాత్రం రోజూ ఉతుకుతారని తెలిపింది. ఏసీ కోచ్‌ల్లో కనీస ఉష్ణోగ్రతను 24-25 డిగ్రీల సెల్సియస్ ఉంచాలని అన్ని జోన్లకు సూచించింది. ప్రయాణికులు తమ సొంత దుప్పట్లు తెచ్చుకోవాల్సిందిగా రైల్వే ఎస్ఎమ్ఎస్, ఐవీఆర్ఎస్ ద్వారా తెలియజేస్తామంది.

మేరే పాస్ మా హై...



అలనాటి బాలీవుడ్ సూపర్‌హిట్ మూవీ దీవార్‌లోని ఓ డైలాగ్..
మేరే పాస్ గాడీ హై.. బంగ్లా హై..
క్యా హై తుమ్హారా పాస్..(నా దగ్గర కారుంది.. బంగ్లా ఉంది.. నీ దగ్గరేముంది)
అని ఆవేశంగా ప్రశ్నిస్తాడు అమితాబ్..

అక్కడ సీన్ కట్ చేస్తే..

మేరే పాస్ మా హై.. (నా దగ్గర అమ్మ ఉంది)
అంటాడు శశికపూర్.. కొంచెం గ్యాప్ ఇచ్చి..
థియేటర్లో విజిల్స్..

కొన్ని రోజుల క్రితం..
నమీబియాలోని ఎరిండి సఫారీ పార్క్... ఓ బుల్లి హిప్పో(నీటి ఏనుగు).. పుట్టి కొన్ని రోజులే అయింది..
నీటిలో ఎంచక్కా ఆడుకుంటోంది.. ఇంతలో ఎక్కడ్నుంచి వచ్చిందో..
మృత్యువులా వచ్చింది.. ఓ గున్న ఏనుగు.. ఏమైందో ఏమో గానీ.. కోపంగా దానిపైకి దూసుకొచ్చింది..
తొండంతో దాన్ని నీటిలో తొక్కి చంపేయాలనుకుంది...
ఒక్క క్షణం ఆలస్యమైఉండి ఉంటే ఏం జరిగుండేదో తెలియదుగానీ..
ఇంతలో వచ్చేసింది..ఆ బుల్లి హిప్పో అమ్మ.. ఆపదలో ఉన్న బిడ్డను చూసి అపర కాళికై గర్జించింది..
గజరాజును సైతం గడగడలాడించింది.. తోకముడిచేలా చేసింది..

అందుకే.. ఏ కష్టమైనా రానీ..
చివరికి మృత్యువే ఎదురు కానీ..
భయమెందుకు..
ఎందుకంటే
'అప్నే పాస్ మా హై'

- సాక్షి, సెంట్రల్ డెస్క్

స్మార్ట్ వాష్ రూమ్స్..

టాయిలెట్లు, యూరినల్స్, హ్యాండ్‌వాష్‌లతో ఏర్పాటు
అదనంగా ఏటీఎం, ఇంటర్నెట్, వైఫై, కేఫే సదుపాయం
మీ-సేవా, డాక్యుమెంట్ల ప్రింటింగ్ కూడా..
జనాభాకు తగిన సంఖ్యలో టాయిలెట్లు, యూరినల్స్
పీపీపీ, ఇతర పద్ధతుల్లో నిర్మాణానికి చర్యలు
మున్సిపల్ కమిషనర్లకు పురపాలక శాఖ ఆదేశం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో అన్ని పట్టణ ప్రాంతాల్లో జనాభా అవసరాలకు తగ్గట్టు సమీకృత స్మార్ట్ వాష్ రూమ్స్ ఏర్పాటు చేయాలని రాష్ట్ర పుర పాలక శాఖ నిర్ణయించింది. స్వచ్ఛ భారత్ (అర్బన్) మార్గదర్శకాల మేరకు పబ్లిక్ ప్రైవేటు భాగస్వామ్యం (పీపీపీ) లేదా ఇతర పద్ధతుల్లో టాయిలెట్లు, యూరినల్స్, హ్యాండ్‌వాష్‌ల సదుపాయంతో సమీకృత వాష్‌రూమ్స్ ఏర్పాటుకు చర్యలు ప్రారంభించింది. టాయిలెట్, యూరినల్స్, హ్యాండ్ వాష్‌లు ఒకే సముదాయంలో ఉండనున్నాయి. వీటికి అదనంగా ఏటీఎం, ఫొటో కాపీయింగ్ (జిరాక్స్), వైఫై, ఇంటర్నెట్, ప్రింటర్, మీ-సేవాలతో పాటు ఆహ్లాదకరమైన కేఫే సదుపాయాన్ని కల్పిస్తారు. స్మార్ట్ వాష్ రూమ్‌లో ఏర్పాటు చేసే ఇతర వాణిజ్య సముదాయాలతో పాటు ప్రకటనలతో ఆదాయం వచ్చే మార్గాలుంటే వాష్‌రూమ్‌ల వినియోగానికి చార్జీలు వసూలు చేయరు. హైదరాబాద్‌లో పలు చోట్ల వాష్‌రూమ్స్, ఏటీఎం, కేఫేలతో నిర్మించిన 'లూ కేఫే'లను ఆదర్శంగా తీసుకుని వీటిని ఏర్పాటు చేయబోతున్నారు.

జనాభాకు తగ్గట్టు..

పురుషుల కోసం 100 నుంచి 400 మందికి టాయిలెట్ సీట్ ఏర్పాటు చేయాలని, జన సంచారం 400 మందికి మించి ఉంటే, ఆపై 250 మందికి ఒక టాయిలెట్ ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ప్రతి 50 మందికి ఒక యూరినల్ నిర్మించేందుకు కసరత్తు చేస్తోంది. ప్రతి ఒక్క టాయిలెట్, యూరినల్‌కు ఒక హ్యాండ్‌వాష్‌ను ఏర్పాటు చేయనుంది. మహిళల కోసం 100 నుంచి 200 మందికి రెండు టాయిలెట్ సీట్లు, 200 మందికి మించితే ప్రతి 100 మందికి అదనంగా మరో ఒక టాయిలెట్ సీట్‌ను నిర్మించనుంది. మహిళల కోసం ప్రత్యేకంగా యూరినల్స్, హ్యాండ్ వాష్‌లు ఏర్పాటు చేయరు. సామూహిక మరుగుదొడ్ల విషయానికి వస్తే ప్రతి 35 మంది పురుషులకు ఒకటి, 25 మంది మహిళలకు ఒకటి చొప్పున టాయిలెట్లు నిర్మిస్తారు. వికలాంగులకు ప్రత్యేక సదుపాయాలు ఉండనున్నాయి.

పీపీపీ భాగస్వామ్యంతో..

రాష్ట్రంలోని అన్ని పట్టణాల్లో స్థానికంగా సమీకృత స్మార్ట్ వాష్ రూమ్స్, సామూహిక మరుగుదొడ్లకు ఉన్న అవసరాలను గుర్తించేందుకు అధ్యయనం చేసి అవసరమైన మేరకు టాయిలెట్ల నిర్మాణానికి ప్రణాళికలు తయారు చేయాలని మున్సిపల్ కమిషనర్లను పురపాలక శాఖ డైరెక్టర్ ఎన్.సత్యనారాయణ తాజాగా ఆదేశించారు. పీపీపీ విధానం లేదా ప్రైవేటు వ్యాపారవేత్తల భాగస్వామ్యంతో సుదీర్ఘ కాలం మన్నిక కలిగిన సమీకృత స్మార్ట్ వాష్ రూమ్స్ ఏర్పాటు చేయాలని కమిషనర్లను కోరారు.

మూడు పద్ధతుల్లో నిర్మాణం..

- ప్రైవేటు సంస్థల డిజైన్లకు అనుగుణంగా స్మార్ట్ వాష్ రూమ్స్‌ల నిర్మాణాన్ని అనుమతించనున్నారు. అయితే, డిజైన్లను స్థానిక పురపాలిక/జిల్లా కలెక్టర్ నేతృత్వంలోని జిల్లా కమిటీ ఆమోదించాల్సి ఉంటుంది.
- పురపాలిక/జిల్లా కమిటీ రూపొందించిన డిజైన్ ప్రకారం స్మార్ట్ వాష్ రూమ్స్ ఏర్పాటు చేయవచ్చు. అయితే, స్థానిక లేఅవుట్‌కు తగ్గట్టు డిజైన్‌కు చిన్నచిన్న మార్పులు అనుమతిస్తారు.
- ఇప్పటికే ఉన్న పాత టాయిలెట్ సముదాయాల స్థానంలో కొత్తగా స్మార్ట్ వాష్ రూమ్స్‌ను నిర్మిస్తారు.

సమయ పాలన..

సామూహిక టాయిలెట్లు ఉదయం 5 నుంచి మధ్యాహ్నం వరకు బాగా వినియోగంలో ఉంటాయి. రైల్వే స్టేషన్లు, బస్‌స్టేషన్లు, విమానాశ్రాయాల వద్ద ఉండే స్మార్ట్ వాష్‌రూమ్స్ 24 గంటలు వినియోగంలో ఉంటాయి. ప్రధాన వ్యాపార కూడళ్లలో ఉండే వాటికి ఉదయం 8 నుంచి రాత్రి 10 వరకు డిమాండ్ ఉండనుంది. ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకుని స్మార్ట్ వాష్ రూమ్స్ నిర్వహించనున్నారు.

పీపీపీ భాగస్వామ్యంతో డిజైన్, బిల్ట్, ఫైనాన్స్, ఆపరేట్, ట్రాన్స్‌ఫర్ (డీబీ ఎఫ్‌వోటీ) విధానంలో పుర పాలికల్లోని వాణిజ్యపర ప్రాంతాల్లో స్మార్ట్ వాష్ రూమ్స్ ఏర్పాటు చేసేందుకు, ఇప్పటికే ఉన్న పాత టాయిలెట్ కాంప్లెక్స్‌లను రిహాబిలేట్, ఆపరేట్, ట్రాన్స్‌ఫర్ (ఆర్‌వోటీ) కింద స్మార్ట్‌వాష్ రూమ్స్‌గా పునర్‌నిర్మిం చేందుకు ప్రైవేటు పార్టీలు ఆసక్తితో ఉన్నాయి. ఈ నేపథ్యంలో స్మార్ట్ వాష్ రూమ్స్‌ల ఏర్పాటుకు ఆసక్తి గల ప్రైవేటు సంస్థలు, సొసైటీలు, స్వయం సహాయక సంఘాలు తదితర వాటి నుంచి ఆసక్తి వ్యక్తీకరణను (ఈవోఐ) ఆహ్వానించాలని కమిషనర్లను ఆదేశించారు. స్వచ్ఛ భారత్ మార్గదర్శకాల ప్రకారం ఒక స్మార్ట్ వాష్ రూమ్‌లో ఒక టాయిలెట్ నిర్మాణానికి రూ.98 వేలు, యూరినల్ ఏర్పాటుకు రూ.32 వేల వరకు వ్యయాన్ని అనుమతించనున్నారు.

భద్రాచలం టు బీదర్

రూ.3.10 కోట్ల విలువైన గంజాయి స్వాధీనం
కారు, ట్రక్కు స్వాధీనం.. ఆరుగురి అరెస్టు

సాక్షి, హైదరాబాద్: భద్రాచలం ఏజెన్సీ నుంచి కర్ణాటక రాష్ట్రంలోని బీదర్‌కు గుట్టుచప్పుడు కాకుండా తరలిస్తోన్న గంజాయిని డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డీఆర్ఐ) అధికారులు పట్టుకున్నారు. శనివారం నగర శివారులోని ఎల్‌బీ నగర్ క్రాస్‌రోడ్ వద్ద ట్రక్కు (టీఎస్ 12సీ 5662), కారు (ఏపీ 29ఏబీ 7351) లను తనిఖీ చేశారు. దీనిపై రూ.4,100 పెండింగ్ చలానాలు ఉన్నాయి. ట్రక్కులో పైన ఖాళీ ప్లాస్టిక్ కేసులను ఉంచి, ఎవరికీ అనుమానం రాకుండా అడుగున గంజాయి సంచులను జాగ్రత్తగా అమర్చారు. కానీ, తనిఖీల్లో 1,554 కిలోల 751 గంజాయి సంచులు బయటపడ్డాయి. ఈ ముఠాలోని ఆరుగురు సభ్యులు చాలా చాకచక్యంగా వ్యవహరించారు. పోలీసుల తనిఖీలను ముందుస్తుగానే గుర్తించి, ట్రక్కులోని సరుకును తప్పించేందుకు కారును పైలట్ వాహనంగా వాడారు. కానీ, విశ్వసనీయ సమాచారం అందుకున్న డీఆర్ఐ అధికారులు రెండు వాహనాలను ఆపారు. సరుకు భద్రాచలం సమీపంలోని మోతుగూడెం నుంచి కర్ణాటకలోని బీదర్‌కు తరలిస్తున్నట్లుగా వెల్లడించారు. వీరిని అరెస్టు చేసిన అధికారులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

జయహో బాలికా!

- బాలికల కోసం ఐఐటీల్లో నాలుగేళ్లలో 4,500కుపైగా సీట్లు
- ఇంజనీరింగ్‌లో బాలికల భాగస్వామ్యం పెంచేందుకు చర్యలు
- 2020-21 విద్యా సంవత్సరంలో మరో 2676 కొత్త సీట్లు

సాక్షి, హైదరాబాద్: సాంకేతిక విద్యను అభ్యసించడంలో వెనుకంజలో ఉన్న బాలికల భాగస్వామ్యం పెంచేందుకు కేంద్రం చర్యలు వేగవంతం చేసింది. ఇంజనీరింగ్ విద్యపట్ల బాలికలు పెద్దగా ఆసక్తి చూపడం లేదని, బాలురతో పోల్చుకుంటే బాలికల సంఖ్య చాలా తక్కువగా ఉంటోందని గుర్తించిన కేంద్రం.. వారి సంఖ్యను పెంచేందుకు చర్యలు చేపట్టింది. నాలుగేళ్లలో కనీసం 20 శాతం మంది బాలికలకు అదనంగా సీట్లను ఇవ్వాలని 2017లో నిర్ణయించి అందుకు అనుగుణంగా చర్యలు చేపట్టింది. దీంతో ఐఐటీ కౌన్సిల్ కూడా అదే విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే సీట్ల పెంపుపై నిర్ణయం తీసుకుంది. అయితే పలు ఐఐటీలు అప్పట్లో దీనిపై అభ్యంతరం వ్యక్తం చేశాయి. తగిన మౌలిక సదుపాయాలు లేకుండా సూపర్ న్యూమరీ సీట్లను సృష్టిస్తే నాణ్యతా ప్రమాణాలు దెబ్బతింటాయని ఆందోళన వెలిబుచ్చాయి. దీంతో ఆ ఒక్క సంవత్సరం మాత్రం సదుపాయాలు ఉన్న ఐఐటీల్లో బాలికల కోసం అదనంగా సీట్లను కేటాయించాలని కేంద్రం స్పష్టం చేసింది. ఆ ఏడాది దాదాపు అన్ని ఐఐటీలు సీట్లను పెంచాయి. ఆ తరువాత క్రమంగా పెంచుతూ వస్తున్నాయి. వచ్చే విద్యా సంవత్సరంలో మాత్రం (2020-21) భారీగా సీట్ల పెంపునకు ఐఐటీ కౌన్సిల్ నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం ఐఐటీల్లో ఉన్న సీట్లకు అదనంగా 20 శాతం సీట్లను బాలికల కోసమే సూపర్ న్యూమరీ సృష్టించి కేటాయించేందుకు చర్యలు చేపట్టింది.

మూడేళ్లలో సీట్ల పెరుగుదల ఇలా..

2016-17 విద్యా సంవత్సరంలో దేశంలోని ఐఐటీల్లో 10,435 సీట్లు ఉన్నాయి. కేంద్రం నిర్ణయంతో 2017-18 విద్యా సంవత్సరం వచ్చేసరికి ఆ సీట్లను ఐఐటీలు 10,957కు పెంచాయి. మొదటి ఏడాది 522 సీట్లను (5%) పెంచాయి. 2018-19 విద్యా సంవత్సరం వచ్చే సరికి 4 శాతం సీట్లను పెంచడంతో ఐఐటీల్లో సీట్ల సంఖ్య 11,326కు చేరుకుంది. 2019-20 విద్యా సంవత్సరంలోనూ అదనంగా 2,050 సీట్లను పెంచడంతో ప్రవేశాలు చేపట్టిన సీట్ల సంఖ్య 13,376కు చేరింది. ఇందులో 2019-20 విద్యా సంవత్సరం నుంచి అమల్లోకి తెచ్చిన ఆర్థికంగా వెనుకబడిన వర్గాల (ఈడబ్ల్యూఎస్) కింద వెయ్యి సీట్ల వరకు ఉన్నాయి. ఇవి మినహాయిస్తే గత మూడేళ్లలో బాలికల కోసమే ఐఐటీల్లో 1,941 సీట్లు అదనంగా వచ్చాయి. తాజాగా వచ్చే (2020-21) విద్యా సంవత్సరంలో 20 శాతం సీట్లను పెంచాలని ఐఐటీల కౌన్సిల్ ఇటీవల నిర్ణయం తీసుకుంది. దీంతో జూన్ లో ప్రారంభమయ్యే ప్రవేశాల కౌన్సెలింగ్‌లో మరో 2,676 సీట్లు అందుబాటులోకి రానున్నాయి. దీంతో నాలుగేళ్లలో బాలికల కోసం అదనంగా పెంచిన సీట్ల సంఖ్య 4,500 దాటనుంది. 2016-17 విద్యా సంవత్సరంలో 10,435 సీట్లు ఉంటే అవి జూన్‌లో ప్రారంభమయ్యే కౌన్సెలింగ్‌లో 16 వేలు దాటనున్నాయి.



Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited,Sakshi Press, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, T.G., and Printed at Jagati Publications Limited, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 08682 248277, 248311, Fax No. 08682 247911. RNI Regn No. TELTEL/2008/23792, Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.